
ISSN 0971-278X


# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 464
వెల : రూ.20/-
నవంబర్ 2023




జనసాహితి ప్రచురణ




నవంబరు 29 అంతర్జాతీయ పాలస్తీనా సంఘీభావ దినం సందర్భంగా
1984లో జనసాహితి ప్రచురించిన పాలస్తీనా పోరాట సాహిత్యం

'నేను నేలకొరిగితే'

సంపాదకుడు : **నిర్మలానంద**; పుటలు : 180; వెల : రూ.7-00

విషయసూచిక

1. స్పందన (ముందుమాట)
2. అతను ఎన్నుకున్న బాట అందరికీ వెలుగుబాట (సంపాదకీయం)
3. ప్రతిఘటన (పాలస్తీనా కథలు)
4. ఆక్రమణని ద్వేషిస్తున్నాం (పాలస్తీనా కవితలు)
5. సంఘీభావం (దేశదేశాల కవితలు)
6. అనుబంధాలు

దొరుకుచోటు : **మైత్రీబుక్‌హౌస్,** జలీల్‌వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2.
సెల్ : 70755 08270


కవిత

# జన విజయం

- ప్రజాసాహితి నాగరాజు

ఆర్థిక యుద్ధాలివి!
డబ్బే ఆయుధమిక్కడ!!
గాయాలు కనిపించవు.
రోదనలు తప్ప!
శవాలు ఆనవాలు కూడా దొరకవు!
పయనాలు అర్థాంతరంగా ఆగిపోతాయి!!
రైలుబళ్లే కావు,
సకల బతుకు బళ్ళు కూడా
కకావికలై పోతాయి!!

పసరాలే ఇక్కడ బలికావడానికి ఎన్నికల జాతరలు
జరుపుతున్నట్టు అగుపిస్తుంది!
కళేబరాలే కలబడి పచ్చిక నోట్లు కతుకుతున్నట్టు
ప్రచారాలు మారుమోగుతాయి,
ఆకలి చేత ఓట్లు కక్కించే దృగ్విషయం రక్తి కడుతుంది !!
చర్వితచరణంగా అధికార, ప్రతిపక్షాలు
హింసాసనాన్ని వంతులు వారీగా పంచుకుని,
బతుకుల్ని పీక్కుతినడంలో ఆరితేరిపోయాయి!!

కాలం ఇక్కడ వెనక్కి నడుస్తున్నట్టు భ్రమకల్పిస్తుంది!!
ముప్పాతికేళ్ళ వంచనాశిల్పం విషాన్ని
అమృతంగా చెల్లుబాటు చేస్తోంది!!

ప్రజాస్వామ్యం స్వగతంగా
ఆత్మహత్యా సదృశంగా
మృత్యుగీతం ఆలపిస్తూ,
రాజదండానికి తల బాదుకోవడంతో
సరికొత్త రాచక చట్టసభ ఊపిరి పోసుకుంటుంది!!

ఏకశిలా శాసనాలతో
అఖండ మతతత్త్వ భారత
అధినాయక రక్తదాహం
అంతిమంగా
ప్రపంచీ సామ్రాజ్య కాంక్షకు
దాసోహం అంటుంది!!

శతాబ్దాల పరాధీన పాలనా గేయాలతో
సగటు మేధావి -
అక్షరాలమీద నివురు కప్పి,
ఇక్కడి జీవకళని
అధికారానికీ, ఆధిపత్యానికీ తారుస్తూవుంటాడు!!
అవార్డుల రగ్గులో తలదూర్చిన ఉష్ట్రపక్షి వాడు.,
వాస్తవాల్ని దాచిపెట్టి, సత్యానంతర భ్రమల్లో ముంచుతాడు!!

ఆ అక్షరాలలో అగ్గిని అందిపుచ్చుకున్న
చేతల ప్రజాకవి మాత్రం
ఎముకల్లో భాస్వరాన్ని మండిస్తాడు!!
గుండెల్లో అరుణోదయాలను రగిలిస్తుంటాడు!!!

అప్పుడే,
ఇక్కడే,
చెమటా, నెత్తురూ
గాయాల నినాదాలతో
ఊపిరి ప్రభం'జనాలతో
కడగళ్ళ కవాతులతో
ముప్పాతికేళ్ల గరళ విపరీతాలను
చివాలునముంచెత్తి
సరికొత్త మహోదయ శ్రమజనామృతాన్ని ఆవిష్కరిస్తుంది!!
ఈ మననం లయిస్తుంది!!
ఈ మథనం జయిస్తుంది!!
జనవిజయం ఆవిర్భవిస్తుంది!!

జనసాహితి ప్రచురణ

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

464

సంపుటి : 47

సంచిక : 04

నవంబర్ 2023

*website :* **www.prajaasaahithi.com**


## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ముఖచిత్రం | : పాలస్తీనా పిలుపు; కవితా పంక్తులు – 'జెనిన్ జెనిన్' అనే అరబిక్ బాషలో దృశ్యీకరించిన పాలస్తీనా డాక్యుమెంటరీ చిత్రాన్ని పరిచయం చేస్తూ శివలక్ష్మి రాసిన 'పాలస్తీనా సత్యం' వ్యాసం నుండి | | ..... 01 |
| రెండవ అట్ట | : జనసాహితి ప్రచురణ 'నేను నేలకొరిగితే', కవిత : పి.ఎస్. నాగరాజు | | ..... 02 |
| మూడవ అట్ట | : దేశ విభజనపై స్పందించిన కళాకారుల చిత్రాలు | | ..... 43 |
| నాల్గవ అట్ట | : అక్టోబర్ విప్లవానికి జేజేలు | | ..... 44 |
| సంపాదకీయం | : ఆలివ్ శాంతికొమ్మకు పూసిన విమోచన తుపాకి – పాలస్తీనా! | | ..... 05 |
| ప్రకటన | : స్వేచ్ఛ కొరకు హుందాగా మేం పోరాటాన్ని కొనసాగిస్తున్నాం | | ..... 07 |
| కథ | : నక్కలు తింటున్న నేల | – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | ..... 09 |
| ధారావాహికలు | : దేశ విభజన వస్తువుగా సాహిత్యం (15) దేశ విభజనపై స్పందించిన చిత్ర కళారంగం–2 | – కొత్తపల్లి రవిబాబు | ..... 14 |
| | : తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట సాహిత్య పరిచయం–2 : "యుగసంధి" | – డా॥ దిలావర్ | ..... 28 |
| వ్యాసం | : పాలస్తీనియన్ల ఆదర్శప్రాయమైన పోరాట సంస్కృతి | – ప్రసన్న | ..... 16 |
| పుస్తక పరిచయం | : "హూ పెయిడ్ ది పైపర్ – ది సిఐఏ & ది కోల్డ్ వార్" | – జి.వి. భద్రం | ..... 19 |
| సినిమా సమీక్ష | : తంతూర (2022) | – బాలాజీ (కోల్‌కతా) | ..... 34 |
| పాలస్తీనా స్వేచ్ఛను కోరుతూ | : నోమ్ చోమ్ స్కీ (**04**); రుష్టి అబు లౌఫ్ (**37**); ఎం.సి. అబ్దుల్ జాన్ (**38**); ఓ.వీ.వీ.యస్, ఉప్పెన (**39**); కుర్రు వినోద్ (**40**) | | |
| వివిధ | : జూపల్లి ప్రేమ్‌చంద్ మరణం (**08**); మన విశ్వవిద్యాలయాల్లో వికార శాస్త్రాలు (**15**); సోమేందురాయ్ మరణం (**18**); సి.వి. రామచంద్రరావు మృతి (**27**); డా॥ మల్లెమాల మరణం, కె.జి. జార్జి మరణం (**33**); ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**27**); చైతన్యవాహిని (**40**) ఈ పుస్తకాలు అందాయి (**41**); వార్తాసాహితి (**42**) | | |
| కృతజ్ఞతలు | : డా॥ జ్యోత్స్న, శివరామకృష్ణ వర్మ; టి.ఎస్.ఆర్. ఆచార్యులు (**04**) | | |



**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు   ఫోన్ : 9490196890**   E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.

ఫోన్ : 70759 57010   prajasahithi1977@gmail.com



ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER

ISSN 0971-278X

LIBRARY OF CONGRESS

LCCN 94903393



*రచనలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్లస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – 532001

ఫోన్ : 78936 97469   prajasahithi1977@gmail.com

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు

1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# అందుకే నీపై రాకెట్ పేల్చాను

– నోమ్ చోమ్ స్కీ

నాకు నీళ్ళు దొరక్కుండా చెయ్
నా ఆలివ్ చెట్లకు అగ్గి పెట్టెయ్
నా ఇంటిని కూలగొట్టెయ్
నా ఉద్యోగం వూడబెరికెయ్
నా నేలను నాకు కాకుండా చెయ్
మా నాన్నను జైల్లోకి తోసేయ్
మా అమ్మను హతమార్చేసెయ్
నా దేశంపై బాంబుల వర్షం కురిపించెయ్
మమ్మల్ని ఆకలి పాల్చేసెయ్
మమ్మలనందరినీ అవమానం పాల్చెయ్
వీటన్నిటికీ నన్నే నిందించు
...............................................
అందుకే నీపై రాకెట్ పేల్చాను.

చోమ్ స్కీ అమెరికన్ తత్వవేత్త , యూదు జాతీయుడు,భాషా శాస్త్రవేత్త, రాజకీయ వ్యాఖ్యాత, వియత్నాం పై అమెరికా యుద్ధాన్ని వ్యతిరేకించిన వాడు. ఆయన వయసు ఇప్పుడు 94 యేళ్ళు. ఆయన 1928 డిసెంబరు 7న జన్మించారు. 10వ తరగతిలోనే స్పెయిన్‌లో అంతర్యుద్ధం పై వ్యాసం రాసి ఫాసిజంను వ్యతిరేకించారు. ఇజ్రాయిల్ – పాలస్తీనా సమస్యపై ఇజ్రాయిల్ పాత్రను తప్పు పడుతూ ఎన్నో వ్యాసాలు రాశారు.

## కృతజ్ఞతలు



డాక్టర్ కసిరెడ్డి జ్యోత్స్న, జంపన శివరామకృష్ణవర్మలు వారి వివాహం సందర్భంగా 2023 నవంబరు నెల సంచిక ప్రచురణకు ఆర్థిక సహాయం అందించారు. వారికి మా కృతజ్ఞతలు.

– సం ॥



## కృతజ్ఞతలు

టి.ఎస్.ఆర్. ఆచార్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు. 'ప్రజాసాహితి' పాఠకులు, అభిమానులు. 'ప్రజాసాహితి' పత్రిక ప్రచురణ కోసం క్రమం తప్పకుండా విరాళాలు ఇస్తున్నారు. వారికి మా కృతజ్ఞతలు.

– సం ॥

సంపాదకీయం

# ఆలివ్ శాంతి కొమ్మకు పూసిన విమోచన తుపాకీ - పాలస్తీనా!

## నవంబర్ 29 పాలస్తీనా సంఘీభావ దినం

**"నేను** ఇక్కడికి శాంతి చిహ్నమయిన ఆలివ్ కొమ్మని ఒక చేత్తోనూ, స్వాతంత్ర్య సమరయోధుని తుపాకీ వేరొక చేత్తోను - పట్టుకొచ్చాను. నా చేతిలోంచి ఈ ఆలివ్ కొమ్మని పడిపోనివ్వకండి!!" అంటూ 1974 నవంబర్ 11 నాడు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాలస్తీనా విమోచన సంస్థ (PLO) అధ్యక్షుడు యాసర్ అరాఫత్ ప్రకటించారు.

ఇజ్రాయిల్ ప్రభుత్వ సైనిక దళాల దాడిలో 3,600 మంది పాలస్తీనా పసి చిన్నారులు చనిపోయారని 04/11/23 నాటి వార్త. రోజుకి 420 మందికి పైగా అమాయకులైన పిల్లల్ని హతమార్చి గాజాను బాలల స్మశానంగా మారుస్తున్నారు.

గత 75 ఏళ్లుగా అమెరికా - ఇజ్రాయిల్ కూటమి చేస్తున్న పైశాచిక మారణహోమం పర్యవసానమే నేటి హమాస్ ప్రతి చర్య.. పాలస్తీనాలో నిరంతర ఇజ్రాయిల్ సైనిక దాడితో గాజా ప్రాంతంలో వేలమంది మహిళలు దుర్మరణం చెందుతున్నారు. గాయపడినవాళ్ళే రోజుకి 18 వేలు దాటుతున్నారు. ఇక ఈ పరిస్థితిని తట్టుకోలేని గాజా ప్రాంతంలోని హమాస్ ప్రభుత్వం 2023 అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెల్‌పై ప్రతిఘటన దాడులు జరిపింది. 1400 మందికి పైగా ఇజ్రాయిల్ ప్రాంత ప్రజలు మరణించారు. దీనితో ఇజ్రాయిల్ సైనిక దళాలు ప్రతీకారంతో రగిలిపోయాయి. గాజా పౌరులకు కనీస అవసరాలయిన ఆహారం, తాగునీరు, వైద్య సహాయం, కరెంటు, ఆర్థిక వనరులు మొదలైనవాటిని అందకుండా చేసి, అమెరికా అండతో పాలస్తీనా ఆ ప్రజలను హింసిస్తోంది. పాలస్తీనియుల జాతి హననానికి ఇజ్రాయిల్ మిలటరీ దళాలు పూనుకున్నాయని ప్రపంచానికి అవగతమైంది.

పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల నడుమ ఘర్షణకు 106 సంవత్సరాల చరిత్ర వుంది. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో బ్రిటీషు పాలకులు వారి ప్రయోజనాల కోసం చేసిన బాల్ఫర్ ప్రకటన ద్వారా వివిధ దేశాలలో చెల్లాచెదురైన యూదులకు పాలస్తీనాలో ప్రత్యేక దేశాన్ని ఏర్పరుస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత రెండవ ప్రపంచ యుద్ధం నాటికి అమెరికా సామ్రాజ్యవాదుల గుప్పిట్లోకి చేరిన ఇజ్రాయిల్, శాంతికాముకులైన పాలస్తీనా ప్రజలపై నిరంతరంగా దాడులను కొనసాగిస్తోంది. పాలస్తీనా ప్రజల భూభాగాన్ని, ఆస్తుల్ని, సంపదల్నీ సర్వస్వం బలవంతంగా గుంజుకుంటున్నది. పాలస్తీనా గ్రామాల నుండి ప్రజల్ని విచక్షణారహితంగా తరిమికొడుతున్నది. 1948-67 కాలానికి పాలస్తీనా ప్రజల్ని సొంత దేశంలోనే కాందిశీకులుగా మిగిల్చింది. పాలస్తీనా ప్రజలపై ఊచకోతలు, వేధింపులు, చిత్రహింసలు నిత్యకృత్యం అయిపోయాయి. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధం కాలాలకి నడుమ, పాలస్తీనా ప్రజలు - తాము పుట్టిన గడ్డమీద నిలబడి, బ్రిటీషు - యూదు వలసవాదుల దాష్టీకాలను ఎదుర్కొన్నా, రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటికి పాలస్తీనా ప్రజలు తమ పాదాల కింద నేల కూడా మిగలని దుస్థితిలో అమెరికా, యూదు జాత్యహంకార కూటమితో 'మా దేశం మాకు కావాలి' అని పోరాడుతున్నారు.

పాలస్తీనా - ఇజ్రాయిల్‌ల మధ్య సాగుతున్న తీవ్ర ఘర్షణలు కేవలం అరబ్బులకు, యూదులకు మధ్య జరిగే జాతుల పోరాటంగా బయటకు కనిపించేటట్లు వందేళ్ళ సామ్రాజ్యవాద శక్తులు మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. యూదు జాత్యహంకారులను తనకి అనుకూలంగా తిప్పుకొని, యుద్ధాలను నిరంతరం రాజేసి, ఆయుధ బేహారిగా, అమెరికా సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్ ప్రభుత్వానికి ఆయుధాలు అందజేస్తుంది. దక్షిణాసియా దేశాలలో ఉన్న అపార చమురు నిక్షేపాల కోసం కూడా ఈ అఘాయిత్యాలకు పూనుకుంటోంది. మధ్య ఆసియాలో అంతర్జాతీయ వాణిజ్యానికి ఉపయోగపడే మధ్యధరా సముద్రానికి, ఇటు దక్షిణాఫ్రికాకి, అటు ఐరోపా ఖండానికి, ఇంకా ఆసియా ఖండానికి, రాకపోకలకు కీలకంగా నడి మధ్యన పాలస్తీనా ఉంది. ప్రపంచ ఆధిపత్యానికి పాలస్తీనా మీద పట్టు భౌగోళికంగా కీలకమైనది. అందువల్లే పాలస్తీనా ప్రజల న్యాయమైన జీవించే హక్కు ప్రశ్నార్థకమయ్యింది.

పాలస్తీనా ప్రజలు తాము కోల్పోయిన భూభాగం కోసం జీవన్మరణ పోరాటం నుండి ఎప్పుడూ తొలగిపోలేదు. వందేళ్ళుగా తమ న్యాయబద్ధమైన పోరాటాన్ని కొనసాగిస్తూనే వున్నారు. ఈ పోరాటాన్ని ప్రపంచ ప్రజలందరూ అక్కున చేర్చుకున్నారు. నిజానికి పాలస్తీ నా ప్రజలు చాలా సౌమ్యులు. శాంతి కాముకులు. బ్రిటీషు అమెరికా సామ్రాజ్యవాదులు ముట్టించిన జాతిదురహంకార ఉన్మాదంలో రగిలిపోతూ ఇజ్రాయిల్, అన్నం పెట్టిన మానవత్వానికి నమ్మకద్రోహాన్ని తలపెట్టింది. నాజీ హిట్లర్ కాలంలో తాము అనుభవించిన చిత్రహింసలను యూదులు మర్చిపోయారు. అమెరికా సామ్రాజ్యవాద కూటమి చేతిలో కీలుబొమ్మలై వాళ్ల ప్రయోజనాలకు కొమ్ముకాస్తూ, పాలస్తీనా దేశాన్ని పూర్తిగా ఆక్రమించుకోవాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తూ వుంది. అందుకే పాలస్తీనా ప్రజల గుండె అగ్నిపర్వతం అయింది. 'షమీ అల్ ఖాసిం' కవితావేశంలో చెప్పాలంటే -

ఇంటికి వచ్చిన వాణ్ణి
ఎన్నడు గుమ్మం లోంచి పొమ్మనలేదు,
చాలా కాలం దాకా!

ఓనాటి ఉదయం లేచి చూశాను
పండించిన పంటనంతాఎత్తుకుపోయారు
పాడుచేసి నా భార్యను దూలానికి వేలాడు కట్టారు!!
నా చిట్టి బాబు వీపుని గాయాల పొలంగా మార్చేశారు!!
దిగుమతి అయిన బంధువులు!!

అందుకే గుమ్మంలో
బాకులూ, మందు గుండు పాతరా నాటాను!!
అందుకే కత్తి అంచులమీద ప్రమాణం చేశాను!!
"బొందిలో ప్రాణం ఉండగా
ఇహ ఏ బంధువుని గుమ్మం తొక్కనివ్వ" నని!!

తాత్విక స్వాప్నికుల మధ్య
ఓ కవిని – నిన్నటిదాకా!
మరి ఈనాడు!
బద్దలయ్యే ఇరవయ్యోవ శతాబ్దపు అగ్నిపర్వతాన్ని!!"

స్వార్థ మూర్ఖశక్తులైన అమెరికా – ఇజ్రాయిల్ కూటమి చేస్తున్న అరాచకాలను ప్రపంచ ప్రజానీకం నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది. పాలస్తీనా దేశాన్ని ప్రపంచ రాజకీయ పటం నుండి తుడిచి పెట్టాలనే కుటిల నీతిని ఆ అమెరికా, ఇంగ్లాండ్ దేశాలలో ఉన్న సామాన్య ప్రజానీకమే అంగీకరించటం లేదు. మతాలకు అతీతంగా, జాతులకు అతీతంగా అమెరికాలో 'క్యాపిటల్ హిల్' దగ్గరకు వేలాదిమంది ప్రజలు తరలి వచ్చారు. ముక్తకంఠంతో ఎలుగెత్తి నినదించారు. పాలస్తీనా పై అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ సైనిక దళాలు చేస్తున్న మారణహోమాన్ని తక్షణమే ఆపాలని నినదించారు. అమెరికా యూదులతో సహా ఐరోపా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా దేశాలలోని ప్రజలందరూ పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించారు.

ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటరీ సభ్యుడు అఫర్ కాసిఫ్ – పాలస్తీనాపై ఇజ్రాయిల్ సైనికదళాల దాడి జాతి హనన దాడులేనని హెచ్చరించినందుకు – ఇజ్రాయెల్ పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ అతనిని 45 రోజులు పాటు పార్లమెంటు నుండి బహిష్కరించింది. ఏ సమావేశాల్లోనూ పాల్గొనకూడదని నిషేధం విధించింది.

ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి చేసిన వెనువెంటనే ఇజ్రాయిల్‌కి మన దేశ ప్రధాని సంఘీభావం తెలిపారు. దేశంలో మారణహోమాలను సృష్టిస్తూ వాటిని చూసీ చూడనట్టుగా ప్రవర్తిస్తున్న ఈ 9 ఏళ్ల ప్రభుత్వం అంతకన్నా ఉన్నతంగా ప్రవర్తిస్తుందని ఆశించలేం.

ఉత్తరప్రదేశ్‌లో పాలస్తీనాకు సంఘీభావం తెలిపిన ప్రజలపై అక్కడి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి కఠిన చర్యలకు ఆదేశించాడు. నిజానికి దేశంలో ప్రజలను ఊచకోత కోయడంలో ప్రపంచ స్థాయిలో ఎనిమిదో స్థానాన్ని నిలబెట్టుకున్న ఘనత మన భారత పాలకులదే! మణిపూర్ నేల పొరల్లో, అక్కడి కొండల్లో నిక్షిప్తమై ఉన్న అపారమైన ఖనిజ సంపదలను గుత్త పెట్టుబడిదారీవర్గాలకు ధారాదత్తం చేయడానికి అక్కడ తెగల మధ్య గొడవలు సృష్టించి, ఆదివాసీలపై అమానుషమైన దాడులను యథేచ్ఛగా ప్రోత్సహించిన మతతత్వ పోకడల పాలకులు ఇజ్రాయిల్‌నే సమర్థిస్తారు.

ఇప్పటికే అమెరికా సామ్రాజ్యవాదం 2000 మంది అమెరికా సైన్యాన్ని, విమానాలను ఇముడ్చుకోగలిగే పెద్దపెద్ద యుద్ధ నౌకలను ఇజ్రాయిల్‌కు అండగా పంపించింది. మరో మూడు వేలమంది సైన్యాన్ని, యుద్ధ నౌకలను పంపించడానికి సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల మధ్య అమెరికా విదేశాంగ కార్యదర్శి బ్లింకెన్ ఖతారా పంపిన వర్తమానం ప్రకారం కొద్ది గంటల్లోనే అమెరికా, కనుసైగతో, ఇజ్రాయెల్ సైనిక దళాలు గాజాపై వైమానిక దాడులు మరోసారి జరిపారు. ఆ దాడుల్లో 'అల్ జజీరా' టీవీ కరస్పాండెంట్ వేల్ అల్ దహదౌష్ భార్య, కొడుకు, కుమార్తె దుర్మరణం పాలయ్యారు. తన వాళ్ల అంత్యక్రియలను నిర్వహించి, వెనువెంటనే పనిలోకిదిగిన దహ దౌష్ (అల్ జజీరా కరస్పాండెంట్) కార్యదీక్ష నిబద్ధత పాలకులకు దాసోహమైన మన మీడియాకు చెంపపెట్టు.

2023 అక్టోబర్ 27వ తారీఖున సమావేశమైన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానం అమెరికా సామ్రాజ్యవాద కూటమిని నైతికంగా దెబ్బ కొట్టింది. మొత్తం 193 దేశాలు సభ్యులుగా ఉన్న ఐక్యరాజ్యసమితిలో – గాజాపై జరుగుతున్న దాడులను బేషరతుగా ఆపివేయాలని, రెండువైపులా యుద్ధాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని, గాజాలోని బాధితులకు కనీస అవసరాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, జోర్డాన్ దేశం ప్రవేశపెట్టిన తీర్మానానికి 121 దేశాల ప్రభుత్వాలు మద్దతునిచ్చాయి. మన భారతదేశ ప్రభుత్వం మాత్రం ఓటింగ్‌కి దూరంగా ఉండిపోయి, తన "ప్రభు భక్తిని'' చాటుకుంది.

50 ఏళ్లనాడు వియత్నాంలో అత్యంత అవమానకరంగా రాజకీయ ఓటమిపాలైన అమెరికా సామ్రాజ్యవాదం నేడు మధ్య ఆసియాలో నైతికంగా అభాసుపాలైంది. ప్రపంచ దేశాల ఐక్యత బలపడి, పాలస్తీనా విమోచన సాధ్యపడే రోజు రావాలి. అది శాంతికి చిహ్నమైన ఆలివ్ కొమ్మలను చిగురింపచేయాలి. శాంతి సాధించాలి అంటే, ప్రపంచ ప్రజాశత్రువు అయిన సామ్రాజ్యవాదంపై ప్రజాయుద్ధం జరిగి తీరాల్సిందే. ✸

## 'ప్రజాసాహితి' జనవరి 2024
## లెనిన్ శత వర్ధంతి సంచిక

**2024** జనవరి 21కు రష్యా విప్లవ విజయ సారథి లెనిన్ (వ్లాదిమిర్ ఇల్యీచ్ ఉల్యనోవ్) మరణించి వంద సంవత్సరాలు అవుతుంది. ఈ సందర్భంగా జనవరి 2024 'ప్రజాసాహితి' సంచికను లెనిన్ శత వర్ధంతి ప్రత్యేక సంచికగా తీసుకురావాలనుకుంటున్నాం. డిసెంబరు 2023 సంచిక వెలువడదు.

లెనిన్ కాలంనాటి ప్రజా – సాహిత్యం, కళలు, సంస్కృతికి సంబంధించిన వ్యాసాలూ, కవితలూ, కథలూ, నాటికలు వివిధ రచనాప్రక్రియలతో వెలువడే ఈ సంచికకు మీ మీ రచనలను ఆహ్వానిస్తున్నాం.

– సంపాదకవర్గం

ప్రకటన

# స్వేచ్ఛ కొరకు హుందాగా మేం పోరాటాన్ని కొనసాగిస్తున్నాం

## (ఆక్రమిత పాలస్తీనాలోని బిర్జీట్ విశ్వవిద్యాలయ యూనియన్‌కు చెందిన ఆచార్యుల, ఉద్యోగుల బహిరంగ ప్రకటన)

*మేమందరం పాలస్తీనియులం!*

వలసవాద ఫాసిజానికి ధైర్యంగా ఎదురు నిలచి, తమ కుటుంబాల, జీవితాల, మానవత్వ పరిరక్షణకై పాలస్తీనియులు గొంతెత్తి నినదించిన సంవత్సరంగా 2023 చరిత్రలో నిలిచిపోతుంది. ఇక్కడకు వచ్చి స్థిరపడిన వలసవాదుల హింసను గత శతాబ్దంగా పాలస్తీనియులు భరించారు. అయినా మేం అభివృద్ధి సాధించాం. దానిని ఇంకా కొనసాగిస్తాం. మా ప్రతిఘటనా హక్కు గురించి వేరే చెప్పనక్కర్లేదు. ఎందుకంటే అది మా అస్తిత్వానికి, మనుగడకు సంబంధించిన మౌలిక విషయం.

ఎక్కడినుంచో వచ్చి ఇక్కడ స్థిరపడిన వలసదారుల ఫాసిస్టు సిద్ధాంతం జియోనిజం. దీనిని మానవతావాదమనే ముసుగు కింద ఇక ఏ మాత్రమూ దాయనక్కర్లేదు. 2023లో మా హక్కు గురించి మేము చెప్పే అవకాశం కోసం ఎవరినీ అడగాల్సిన అవసరం లేదు. మా హక్కు గురించి చెప్పే శక్తి మా చేతులు దాటి ఏనాడూ పోలేదు. అన్ని రకాల, అన్ని పద్ధతుల ప్రతిఘటనలకు, జడాత్మకంగా మారిన అంతర్జాతీయ న్యాయచట్టపు ముందస్తు అనుమతి ఏమాత్రం అవసరం లేదు. అణచివేయబడుతున్న వారికి తాము గురవుతున్న అణచివేతపై పోరాడటానికి ఎవరి అనుమతీ అక్కర్లేదు. మా చరిత్ర, మా చరిత్రలో చోటు చేసుకుంటున్న సంఘటనలు మాకీ హక్కునిస్తున్నాయి. జియోనిజం (యూదు మతతత్త్వం) యొక్క అనాగరిక, పాశవిక రక్తపాత విధానాలను బట్టబయలు చేయకుండా దాచడం మా కర్తవ్యం అని మేము అనుకోవడంలేదు. వారి చర్యలు ఫాసిస్టు రాజ్యచర్యలనీ, వారు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి ఒక క్రూరమైన సైన్యం సరిపోతుందని వేరే చెప్పనక్కర్లేదు. ఈ నాటి పరిస్థితిని, బాధితులుగా గాక, ప్రతిఘటిస్తూ మనుగడ సాగిస్తున్న ప్రజలుగా గుర్తు వుంచుకొని నమోదు చేయడం మా కర్తవ్యంగా భావిస్తున్నాం.

ఈనాటి వలసవాదుల పాశవిక చర్యలను నమోదు చేయడమేగాక, వాటిని వీరోచితంగా ప్రతిఘటిస్తున్న మా చర్యలనూ రికార్డు చేస్తాం. మేము మా భూమిని అంటిపెట్టుకుని వుంటాం. ఈ లోకంలో మానవత్వం నిండిన పాలస్తీనా అరబ్బీలుగా మానవత్వం కోల్పోయిన వారి ముందు మా మానవత్వాన్ని ఋజువు చేయాల్సిన అవసరం లేదు.

మేము నమోదు చేస్తున్న ఈ వాస్తవాలు, పాలస్తీనాలో జరిగిన, జరుగుతున్న నేరాలనూ, బలవంతంగా మా నేలపైకి, ప్రజలపైకి చొచ్చుకువచ్చిన జియోనిజం చేస్తున్న నేరాలను జ్ఞాపకం చేసుకోడానికి ఉపయోగపడతాయి. ఈ వాస్తవాల జాబితా సుదీర్ఘమైనది. ఏ పద్ధతిలోనూ క్లుప్తంగా చెప్పడం సాధ్యంకాదు. అణచివేతకు గురైనవారి పక్షం వహించినవారికీ, మా పోరాటానికి సంఘీభావం తెలిపినవారికి మాత్రమే అది సాధ్యమౌతుంది. స్వేచ్ఛ, విముక్తి అనే వాటి గురించి మాట్లాడేటప్పుడు ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకోవలసిందిగా కోరుతున్నాం. ఎప్పటిలాగానే మేం తలలు క్రిందకు దించకుండా పోరాడుతున్నాం. మా అమరవీరుల పట్ల మాకు నైతికంగా గౌరవం వుంది. ఈ అమరవీరుల జాబితా తయారుచేసే సందర్భంలో 'యుద్ధ నేరాలు', 'జాతి హననం', 'జాతి వివక్షా విధానం', 'నేర స్వభావం', 'అమానవత్వం' మొదలగు పదబంధాలు గతంలోనూ, ఈనాటి కాలంలోనూ వున్న ఇజ్రాయెల్ వారి స్వభావాన్ని చిత్రించడానికి ఏమాత్రం సరిపోవు.

తన పాశవిక ఆక్రమణలో వున్న ప్రజానీకానికి వ్యతిరేకంగా, ఆత్మరక్షణ చేసుకునే హక్కు వేరే దేశాన్ని ఆక్రమించిన వలస దేశంకు వుండదు. వలస వచ్చినవారినీ, వారి చేత బాధితులైన మూలవాసులనూ – ఇద్దర్నీ ఒకే గాటన సమానంగా కట్టడం ఏ నీతి సూత్రమూ చేయదు – మీడియా ఎంత ప్రయత్నించినా, ఎంత ప్రచారం చేసినా అది సాధ్యం కాదు.

గాజాపై చేస్తున్న యుద్ధంలో ఇజ్రాయెల్ మిలటరీ నేరుగా మా పౌరుల ఇళ్ళపైనా, ఆసుపత్రులపైనా, అనాథాశ్రమాలపైనా, క్రీడా మైదానాలపైనా, పాఠశాలలపైనా, విశ్వవిద్యాలయాలపైనా, మసీదులపైనా, చర్చీలపైనా, బహిరంగ ప్రదేశాలపైనా, సమాధులపైనా బాంబులు వేస్తోంది. నీరు, విద్యుచ్ఛక్తి సరఫరా మొదలైన సౌకర్యాలను లేకుండా చేయడమనేది ఒక జాతిని మొత్తంగా తుడిచిపెట్టాలనే కాంక్షతో చేసేవే, జియోనిస్టులు తమ 'పవిత్రమైన సైన్యం' గురించి మాట్లాడటమే ఒక ప్రహసనం. అంటే వారనే పవిత్రత దేనిలో వుందంటే వారి ఆయుధాలను నిరంతరం పాలస్తీనియులపై ఉపయోగించడానికి తయారుగా వుండటంలో వుంది.

అణచివేతదారుడు చేసే నేరాలకు, అణచివేతకు గురైనవారిని నిందించే జియోనిస్టు మీడియా నేర మనస్తత్వం కొనసాగుతోంది. తామే బాధితులమని వాపోతున్న జియోనిస్టుల వాదన, వారు పాలస్తీనీయులను పాలస్తీనా నుండి ఖాళీ చేయించాలన్న వారి కాంక్షను తెలియచేస్తుంది. ఇజ్రాయిల్ చేస్తున్న నేరాలన్నీ జియోనిజం యొక్క వివిధ రూపాలే! ఇవన్నీ విషాదంతో నిండినవే. ప్రపంచమే సాక్ష్యంగా ఇప్పటికీ పాలస్తీనా శరణార్థుల ఊచకోత, విస్థాపన కొనసాగుతూనే ఉంది.

ఇజ్రాయిల్ రాజకీయంలో భాగమే జాతి హనన కార్యక్రమాన్ని నిర్భయంగా కొనసాగించటం. సెటిలర్స్ అయిన జియోనిస్ట్ రాజకీయ నాయకులు "అరబ్‌లను చంపండి" అనే పిలుపు పరమ అశ్లీలకరమైనది.

రాజకీయంగా దీనినే ఫాసిజం అంటారు. దానిని సెటిలర్ల వలస ఫాసిజంగా చరిత్ర నిర్వచిస్తుంది. ఈ పిలుపు మరింత జాతి హనన హింసను బలపరుస్తుంది.

గాజాను అష్టదిగ్బంధం చేసి, మొత్తం అక్కడ వున్న జనాభాకు 16 ఏళ్ళపాటు ఏకాంత కారాగార శిక్ష విధించారు. గాజాను హింసా యుతమైన కారాగారంగా వారు మార్చారు.

రక్తపాతానికి కారణం అణచబడ్డవారే అనే ప్రచారం ఇజ్రేయిలు చేస్తున్నారు. ప్రతిఘటించాల్సిన నేరంగా ప్రచారం చేస్తున్నారు. సెటిలర్స్ చేస్తున్న నేరాలను మొత్తంగా నిర్లక్ష్యం చేస్తున్నారు.

అమెరికా ఆదేశాలతో కొనసాగుతున్న అణచివేత గురించి అరబ్, ముస్లిం రాజ్యాలతోసహా ప్రపంచమంతా అనంతమైన మౌనం వహించి, నేరం చేస్తోంది. సెటిలర్ల నేరాలను, జాతి హనన కార్యక్రమాలను బహిరంగపరచటం, ఎంతో హేయమైన విషయంగా పరిగణిస్తున్నారు.

జియోనిస్టులు, అమెరికన్ వలసలు, అరబ్ రాజ్యాలు పాలస్తీనా ప్రజలపై కలిసి చేస్తున్న మూకుమ్మడి హత్యాకాండ 21వ శతాబ్దపు ఫాసిజానికి నిర్వచనంగా మారింది.

పాలస్తీనా జాతివారి ఉనికిని, ప్రతిఘటనను స్వయం నిర్ణయ హక్కును తిరస్కరించటం చారిత్రకంగా ఒక ఘోరమైన నేరాన్ని కొనసాగించటమే.

పాలస్తీనీయులమైన మాకు మా స్వేచ్ఛ కొరకు పోరాడే హక్కు వుంది. అది న్యాయ చట్టాలలో లేకపోవచ్చు. కాని స్వేచ్ఛ కొరకు మా గౌరవం కోసం పోరాడే హక్కు మాకుంది. పాలస్తీనా ప్రతిఘటనను సెటిలర్లు నేరం చేయడంగా మొదటి నుంచీ చిత్రిస్తూ వచ్చారు. ఆ ప్రతిఘటన నేడు గెరిల్లా యుద్ధ వ్యూహం అవలంభించడంతో మేము అణచివేతదారులమైపోయామా? ఇజ్రాయిల్ సైన్యం ఏం సాధించాలని పోరాడుతోంది? ప్రతిఘటనా వీరులను ఎదుర్కోలేక, విమానాల ద్వారా గాజాపై విచక్షణారహితంగా బాంబులు వేస్తోంది! మా భూమిపైకి జియోనిస్టులు రావడంతో ప్రారంభమైన జాతి హనన సంగ్రామాన్ని కొనసాగించడానికి వారు ప్రయత్నిస్తున్నారా? 1948ని చెరిపివేయడానికి యత్నిస్తున్నారా?

ఇదంతా చూస్తూ, తెలుసుకుంటూ, అనుభవిస్తూ న్యాయం కోసం, మానవత కోసం - దిగజారిపోయిన వలసవాదుల అణచివేతకు వ్యతిరేకంగా మేం పోరాటమార్గాన్ని ఎన్నుకున్నాం. మేమంతా పాలస్తీనియులం. నిజమైన నేరస్తులకు వ్యతిరేకంగా తక్షణమే మేము స్పందించాలి. ఆ జియోనిస్టు రాక్షసుల అనాగరిక చర్యలపట్ల మేం ఎలుగెత్తి అరవడం తప్పనిసరి. జియోనిజం అనేది పాలస్తీనాలో అమలౌతున్న సెటిలర్ల జాతి హనన ప్రాజెక్టు. అది తప్పుడు ఆధారాలపై, మూలవాసులపై నిరంతర హింసను కొనసాగిస్తోన్న వాస్తవాన్ని గమనించాలి. అసలు నేరస్తులను గుర్తించి వారిని నేరస్తులుగా పరిగణించకపోతే రాజకీయ, విద్యావిషయక, సామాజిక స్వాతంత్ర్యం అనేవి చెవిటివారికి విన్పించేవే అవుతాయి.

ఆక్రమణకు గురైన పాలస్తీనాలోని మేము, పాలస్తీనియులమందరం కత్తి కంటే కలం గొప్పదన్న వ్యూహాత్మక కలల భ్రమల్లో లేము. కపటత్వం కూడిన అంతర్జాతీయంగా లభించిన మద్దతుతో కత్తి మా శరీరాల్లోకి లోతుగా దిగబడి వుంది. సామ్రాజ్యవాదం కత్తి, (చంపడానికి) కలం (చంపిన చర్యలు వర్ణించడానికి) - రెండింటిపై గుత్తాధికారం సంపాదించింది. ఇటువంటి క్లిష్ట సమయంలో అవి ఎంత విఫలమైనాసరే - ఆక్రమిత పాలస్తీనాలోని మేధావులుగా, విద్యావేత్తలుగా మా మాటల తూటాలను ఉపయోగించక తప్పదు. మా ప్రజల ధైర్య సాహసాలపై మా ప్రతిఘటనపైనా, స్వేచ్ఛపైనా, విజయంపైనా, ఎవరూ హరించలేని మా హక్కుల సాధనపైనా మాకు హక్కు వుంది. ఈ చారిత్రక సందర్భంలో మేం విజయం సాధిస్తాం - న్యాయం గెలుస్తుంది. మేము మౌన బాధితులుగా వుండం. మమ్ములను హత్య చేశారు. విస్థాపనకు గురిచేశారు. ఒక ఉన్మాదపూరితమైన ద్వేషానికి, రక్తపాత హింసకు - మీ సిద్ధాంతం ప్రకారం బలి అవుతున్నాం. కాని మేం మౌనంగా వుండం. మా నోరు నొక్కలేరు. మా ప్రతిఘటన మాకు మార్గం చూపిస్తుంది. మేం స్థిరంగా కొనసాగుతాం. అంతిమంగా మేం విజయం సాధిస్తాం.

**11 అక్టోబర్ 2023**

## కవి, విమర్శకుడు
# జూపల్లి ప్రేమ్‌చంద్ మృతి



**కవి,** బహుజనోద్యమ సాహిత్యకారుడు, సాహితీ విమర్శకుడు జూపల్లి ప్రేమ్‌చంద్ అక్టోబరు 19, 2023న తన 66వ యేట హైదరాబాద్‌లో ఓ ఆసుపత్రిలో మృతిచెందారు. ఆయన గుంటూరు జిల్లా తాడికొండ గ్రామంలో ఫిబ్రవరి 1957న జన్మించారు.

తండ్రి ఉద్యోగరీత్యా అనంతపురంలో స్థిరపడటంతో ప్రేమ్‌చంద్ అనంతపురం నివాసి అయ్యారు. ఆయన తెలుగు అధ్యాపకుడిగా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శ్రీరంగం నారాయణబాబు 'రుధిర జ్యోతి'పై ఎం.ఫిల్; 'సామాజిక పరిణామాలు - వచన కవిత్వం'పై పి.హెచ్‌డి చేశారు. అధ్యాపకునిగా చేస్తూ, సాహిత్య, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో నిమగ్నమై, ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. 'వాయిస్' అనే స్వచ్ఛంద సంస్థలో చేరి - గ్రామీణ సమస్యలపై కరువుపై దృష్టిపెట్టి పనిచేశారు. ఆయన అనంతపురం జిల్లా రచయితల సంఘంలో కీలకపాత్ర వహించారు. బహుజన అస్తిత్వంతో సాహిత్య సృజన చేశారు.

కథ

# నక్కలు తింటున్న నేల

- ఐ.టీ.ఆర్.వి. శివాజీరావు

"నీ మాట వినేదేటి! నీ చేత సంతకం పెట్టించడానికి మూడు నిమిషాలు పట్టదు కానీ ఎందుకని ఆగుతున్నాను. మర్యాద ఇచ్చినంత వరకే. లేకపోతే మెడలు వంచి మరీ పెట్టిస్తాను".

"తల్లిని అంతమాటనకురా కామేశం", అన్నది ఈ తతంగం అంతా గమనిస్తున్న ఎదురింటి ఎంకట లక్ష్మి.

తెల్లవారే వరాలమ్మకీ, ఆవిడ కొడుకు కామేశుకీ మొదలైన గొడవకి ఇంటి చుట్టు పక్కల ఆడంగులు ఒకరిద్దరు పోగయ్యారు.

కొద్దిరోజులుగా కొడుక్కి,తల్లికి గొడవలు అవుతున్న విషయం వాళ్ళందరికీ తెలిసిందే! ఒక్క కామేశు కుటుంబమనే కాదు ప్రభుత్వం భూములు తీసుకుంటానన్న దగ్గర్నుండీ ప్రతీ ఇంట్లోనూ ఏవో గొడవలు జరుగుతునే ఉన్నాయి.

ఎంకటి కల్పించుకోగానే నలుగురూ తలో మాట అనేసి కళ్ళాపులు జల్లుకోడానికి పోయారు.

"అంత మాటనొద్దంటున్నావు గానీ ఆవిడ చేతలు నీకు కనిపించడం లేదా బాప్పా!" అన్నాడు కోపంగా కామేశు.

"నాను ఆమాట కాదన్లేదు.కానీ ఎంతైనా కన్న తల్లి కదా.... అలా మాటలంటే పేనం గిజగిజలాడుతాదిరా",

"ఓస్! చాల్లే చెప్పొచ్చావు. అంత గిజగిజ లాడేదైతే ఆ సంతకమే పెట్టేసున్ను. ఇన్నిసార్లు అడిగించుకుంటాదా! ఏం! నేను బాగు పడక్కర్లేదా? ఎన్నాళ్ళిలా బేవార్సుగా తిరగాలి" అని కామేశు ఈసడించుకున్నాడు.

అతని తల్లి వరాలమ్మ తల వంచుకుని పనిచేసుకుపోతుందే తప్ప ఒక్క మాట మాట్లాడటం లేదు. కానీ అప్పుడప్పుడు కళ్ళు తుడుచుకుంటూ ఉంది.

"ఒరేయ్! ఆ ఇంతగద్దు మడి చెక్క సంపాదించడానికి మీ మేమందరం ఎన్ని యిద్దెలు పడ్డామనుకున్నావు! అప్పుడు మీరంతా గోతిలో గుంటలు. అప్పటి ఇసయాలు మీకు తెలీవు, సెప్పినా సెవిని బెట్టరు. ఇప్పుడు మన బూవులు ఈ గవరమెంటోడికి జున్ను ముక్కల్లాగ ఆనుతున్నాయి. ఆనవా మరి.. పగలూ రాత్రిళ్ళూ రెక్కలిరుసుకొని మొక్కా మోడూ కొట్టి, రాయీ రప్పా యేరి ఒక రూపు తెచ్చినాం కదా. ఇప్పుడు యే పాడు కళ్లైయినా పడతాయి.

బలుసు తుప్పలు, రక్కిస పొదలు బలిసి పోయి ఆవో, గీదో దూరిందంటే కొక్కాల్లాంటి ముళ్లు గుచ్చుకుపోయి అందల సిక్కొడిపోయి అరిసరిసి, యెవళ్ళూ సూడకపోతే రెండు మూడు రోజులకి సచ్చేది.

యెతకడానికెళ్లినోల్లకి నక్కలూ, దుమ్మల గొండ్లూ తినేసిన ఆనవాళ్లు తప్ప మరేటీ దొరికియ్యి కావు. అలాగ మా సెవట, రక్తం కల్లాపి జల్లి ఆ బూవులన్నీ బాగుజేసుకొన్నాం. బాగుజేసు కున్నంతలోనే అయిపోయిందనుకున్నావా అల్లుడా! రెవెన్యూవోళ్ళు నానా రకంగా దుక్కపెట్టేవోరు. ఆ బూవుల్లోకి అడుగెడితే కేసులు పెట్టేసి అరెస్ట్ సేయిస్తామనీవోరు.

డీ పారాలు సంపాయించడానికి కాళ్ళు రోకళ్లు అయ్యేలా తిరిగాం. సివరాకరికి ఆళ్ల కాళ్లు ఈళ్ల కాళ్లు పట్టుకొని, ఆ నాయకుడ్ని ఈ నాయకుడ్ని పిసకరించి డీ పారాలు సంపాయించినాము. సంపాయించి నానా రకాల మొక్కలూ యేసుకొని పెంచుకున్నాము. ఏసుకున్నాక ఆ మొక్కలకి ఒక తీరు తెన్నూ రాడానికి ఎన్నో పాట్లు పడ్డాము. ఆటిల్ని తడపడానికి బిందెలతో నీళ్ళు మొయ్యాలంటే పేనం పోయేది. అదేవన్నా తక్కువ దూరమా! వూళ్ళో బోరు కొట్టుకొని బిందె నింపుకొని బీముడి కొండ పాదాల కాడికి యెల్తే గానీ మన బూవుల్ని సేరుకోలేం! అలాటిది నిట్ట నిదుపాటి ఎండలో యెన్ని బిందెలు మోసుంటాం సెప్పు. అలా మొయ్యబట్టే ఆ జీవిడి మొక్కలు,మాడి మొక్కలు ఒక నాటికి తేరాయి. ఒక పక్క మగోల్లు కోరీ పనికి కొండకి పోతే మావెల్లి ఆ మొక్కలంట పడి ఏడితే ఏడాదికోపాలి పండిన జీడిపిక్కలు ఒకటో రెండో మూటలయ్యేవి. సన్నీళ్లకు యేన్నీళ్ళు తోడన్నట్టు మొగోల్లు కూలికెల్లి తెచ్చినదానికి మా కష్టంకూడ అలా తోడయ్యేది. ఇంతింత కుటుంబాల్ని, సంసారాల్నీ ఏనాడూ ఈదిలో పెట్టకుండా గుట్టుగా లాక్కొచ్చామంటే మా కస్టానికి ఆ భూ దేవత గూడా తోడుండ బట్టేరా అల్లుడూ!

మీ నాన్న కోరీ పెమాదంలో సెల్లిపోయాక ఆ బూవిని నమ్ముకునే గోతిలో వున్న నిన్ను మీయమ్మ లెగదీసి ఇంతటోడ్ని సెయ్యగలిగింది. ఇప్పుడేమో గవరమెంటోడు నాలుగు సిల్లర కాసులు రాలుస్తానన్నాడని, ఆటి కోసం ఆశపడి ఒకటే ఎగురుతున్నావు సంతకం పెట్టేమని", గబగబా గుక్క తిప్పుకోకుండా చెప్పాల్సిన నాలుగు ముక్కలూ చెప్పేసింది ఎంకట లక్ష్మి.

"నిజమే బాప్పా, నేను కాదన్లేదు. అమ్మ మాత్రం ఎంతకాలం అందులో కష్టపడతాది. ఈ భూసేకరణ గవర్నమెంటే చేస్తుంది. అలాంటప్పుడు నువ్వూ, నేనూ ఇవ్వము అని భీష్మించుకు కూర్చుంటే అవుతుందా. మన ఒక్కరి దగ్గర మాత్రమే తీసుకోవటం లేదు కదా! గవర్నమెంట్‌ని ఎదిరించడం మన వల్ల అవుతుందా చెప్పు. ఇప్పుడు ఇవ్వము అని మొండికేస్తే వాళ్ళు ఇస్తామన్న ప్యాకేజీలేవీ రావట. తర్వాత బలవంతాన లాగేసుకుంటారట. వీఆర్వో కనిపించినపుడల్లా ఈ మాటే అంటున్నాడు. వాళ్ళకి ముద్దొచ్చినప్పుడే మనం చంకెక్కాలి కదా."

"ఒరేయ్! మనం కూడా ఇవ్వము అని అనటం లేదు. కానీ మనం ఇంతా కష్టపడి బాగుజేసుకున్న భూమికి ఎకరాకి ఇన్ని సెంట్లు అని కేటాయిస్తామని అంటున్నారు. అదీ గూడా అట ఇట మాట్లే! ఆ మాటలు నమ్మి మనం

ఇచ్చేసామనుకో ఆ వచ్చేది వస్తాదని, ఎవుడొచ్చినా నీటి మూటల్లాంటి హామీలు నెత్తిమీద గుమ్మరించి ఎలిపోతున్నారు తప్ప మనకేటి వస్తాది, ఏటి పోతాది అని సొస్టంగా చెప్పినోడు ఒక్కడైనా వున్నాడా!

మన ఎగురోల్లు కంగారుపడి సంతకా లెట్టేసినారు. ఆలు ఇలా యెట్టేసిన మజ్జానానికి పెద్ద పెద్ద పోక్లైన్ లొచ్చి బూవులు సదును సేసీనాయి. ఇపుడెలాగుందో ఓ పాలి సూడెల్లి. ఎవుడు బూమేదో ఆల్లే పోల్చుకోలేపోతన్నారు. అపుడే కోలనీ ఇల్లు పునాదులు లేసిపోతున్నాయి గానీ ఒక్కడు ఒక్క రూపాయి కాన్లేదు. ఇపుడు లబో దిబో మంటున్నారు. ఇచ్చీ వరకూ ఇంటి చుట్టూ బేపిల్లా తిరిగిన అతికార్లు ఇప్పుడు ఒక్కడు కనిపించడం నేదు"

"అదేటి బాప్పా అలా అంటావు. గవర్మెంటోడు మోసం చెయ్యడు. మన మినిస్టర్‌గారు కూడా మాటిచ్చారు కదా", చాలా నమ్మకంగా చెప్పాడు కామేశు.

ఎంకట లక్ష్మి పకాల్న ఒక నవ్వు నవ్వి, కామేశు బుగ్గలు పుణుకుతూ"ఇలాటి ఇసయాల్లో నీలా సదువుకున్నోడి కన్నా మాలాంటి సదువు లేనోల్లకే అనుభవం ఎక్కువరా"అంది.

"నువ్వు ఎన్నైనా చెప్పు బాప్పా. మన మినిస్టర్ మాట తప్పడు. పైగా 'ఏం కావాలన్నా నాదగ్గరికి రారా' అని కనిపించినప్పుడల్లా అంటూ వుంటాడు",

"అదంతా నీ బెమ" అన్నది ఆమె.

తన మాటను ఆవిడ అలా తీసి పారెయ్యడంతో కామేశానికి ఉక్రోషం వచ్చింది. అతను ముక్కు పుటాలు ఎగరెయ్యడం చూసి.

"అలా కోపం తెచ్చుకోకరా అల్లుడూ. నీకు గుర్తుందా సేన్నాళ్ళ కిందట జరిగిన సంగతి. మనూరి కోరీ లారీ బేకులు తెగిపోయి రోడ్డు పక్కన కాఫీ హొటేల్లో టిఫిన్ చేత్తున్న ఇద్దర్ని మీదకి ఎక్కేసింది. తింటునోల్లు తింటున్నట్టే పేనాలు ఒగ్గేసారు."

కామేశానికి ఆ సంఘటన గుర్తొచ్చింది. అపుడు అతను ఇంటర్మీడియేట్ చదువుతున్నాడు. ఆ ఆక్సిడెంట్లో అతని ఫ్రెండ్ శ్రీరామ్ కూడా గాయపడ్డాడు. వాడికి కాలు మీదకు టైర్ ఎక్కేసి కాలు నుజ్జు నుజ్జు అయిపోయింది. వాడికి కోలుకోవడానికి రెండు సంవత్సరాలకు పైగా పట్టింది.

"ఆ! ఇపుడు అదెందుకు బాప్పా!"

"ఆ టయంలో నీకు గుర్తుందా కోరీ ఓనర్‌ని అడుగుదామని మనూరోల్లంతా ఎల్లారు కానీ ఏక్సిడెంట్ జరిగిందని తెలీగానే ఆడు ఊరొదిలి పారినాడు".

"మనం ధర్నా గూడ చేశాం కద బాప్పా"

"ఇప్పుడు గుర్తులో పడిందా. మనం ఆ శవాల్ని ఏసుకొని అనకాపిల్లి సొడారం రోడ్డు మీన కూకుండిపోనాం. ఓ.. ఓ.. మన దెబ్బకి రోడ్డు రోడ్డంతా ఇటు అనకాపిల్లి నుంచి అటు సొడారం వరకూ లారీలేటి, బస్సులేటి అన్నీ ఆగిపోయి ట్రాఫిక్ బందయిపోయింది. జెనాలు బాగా ఇబ్బంది పడిపోనారు. ఎస్సైలు, పోలీసులు వచ్చీనారు. మనం నొంగనేదు. సివరికి ఎవరొచ్చారు గుర్తుందా!"

"ఆ! లేకేమి. అప్పటి ఎమ్మెల్యే వచ్చి హామీ ఇస్తేనే గానీ మనం ధర్నాను విరమించలేదు"

"ఆ.. గాబరా గాబరాగా వచ్చిన ఎమ్మెల్యే బాబు సచ్చిపోయినోల్లని చూసి రుమాలతో మాటిమాటికీ కల్లు తుడిసీసుకుండీవోడు. అతగాడ్ని చూసిన మనోల్లకి గుండెలు సెరువులై పోనాయి. మనం ఆ బాబుని పట్టుకొని ఆ బాబు మనల్ని పట్టుకొని దుక్కం తీర్సుకున్నాం..కానీ మనది తీరే దుక్కం కాదని ఆ బాబు ఆమీ లిచ్చేసి మనల్ని రోడ్డు మీద నుంచి లేపీసి ఇంటికి పొమ్మన్నాక గానీ మన బోదకి రాలేదు. ఆ ఓనర్ ముక్కు పిండి నట్ట పరిహారం ఇప్పిత్తా నన్నాడు. ఆల్లు జచ్చి అయిదేళ్ళయ్యింది. మనం ధర్నా ఇరమించిన మూడో రోజు నుండి ఓనర్ టింగు రంగా మంటూ యెనకాల పోలీసు బందోబస్తు యేసుకొని వూళ్లో దర్జాగా తిరగడం మొదలెట్టాడు. ఆడికి నట్టవూలేదు, ఆ సచ్చిపోయిన బావులకి పరిహారమూ లేదు",

"బాప్పా! ఇప్పుడున్న మినిస్టర్ వేరు ఆ ఎమ్మెల్యే వేరు.ఇప్పుడదంతా ఎందుకు", అన్నాడు కామేశం విసుగ్గా.

"ఆల్లిద్దరూ సచ్చినాక దెయ్యాలై ఒకే నరకానికి పోతార్రా అల్లుడూ", అంది నవ్వుతూ ఎంకట లక్ష్మి.

"అదేటి బాప్పా అలగంటావు",

"నానలగే అంటాన్రా అల్లుడూ. మొన్న కోరీలో పంజేసే లేబరంతా కూలి రేట్ల ఒప్పందాల కోసం పనులాపితే ఈ మినిస్ట్రేనా తగువు పెద్దమనిసిగా వచ్చి, ఓనరు కూలీ పెంచ నంటున్నాడు. మీరు మొండికి దిగితే కోరీ మూసేత్తాడట. ఆడు ఏదో ఆడికి తోసింది ఇత్తాడు మీరు కాదనకండి. మూసెత్తే మీకే నట్టం నేను సెయ్యగలిగింది ఇంతే అని లేసిపోనాడు. అపుడు అందరూ దిక్కునేక దూటీలకి ఎక్కినారు."

"పాతోడు కూడా ఇదే సేసాడు. ఇందాక ఎక్సిడెంట్ జరిగాక ఓనర్ పరారీ అయిపోనాడని సెప్పాను కదా. ఆడు తిన్నగా ఎవడింటికి పోనాడనుకున్నావు. ఆ ఎమ్మెల్యే బాబు ఇంటికి పోయి దాంగున్నాడు. మన దగ్గరకొచ్చినప్పుడు ఆడ్ని వదలొద్దని పోలీసులతో చెప్పాడు, కానీ అప్పిడికే ఆడ్ని ఇంట్లో దాసిపెట్టుకున్నాడు. ఇదీ ఆళ్ళ రాజకీయం",

"మరి మనవే కద బాప్పా ఆల్లిచ్చిన డబ్బుకి కక్కుర్తి పడి ఆళ్లకి ఓట్లేత్తున్నాం"

"అవున్రా అల్లుడూ. సచ్చినోడి పెళ్లికి వచ్చిందే కట్నం"

"అంటే ఏటి బాప్పా"

"ఈల్లందరూ ఒకటేరా అల్లుడూ! అంటే నువ్వూ, నానూ అదిగదిగో ఇంట్లో కూకుని చైలెంట్‌గా ఏడుత్తుందే మీ అమ్మ – అదీ ఇలా మనందరం ఏసిన ఓట్లతో గెలిసి, కుర్సీ ఎక్కాక డబ్బున్నోడి పీతి గుడ్డలు, రొచ్చు గుడ్డలూ ఉతుకుతారు. ఆలు వచ్చాక మనకి సేసేదేమీ వుండదు కనుక కుర్సీ ఎక్కకముందే ఆడి దగ్గరా ఈడిదగ్గరా అనేటి, ఇచ్చినోడి దగ్గరల్లా తలా ఒక కూరాకు తీసుకొని చెటిల్మెంట్ చేసుకోవడం అన్నమాట. అందుకని ఆల్లు చెప్పిన మాటలు నమ్మీసి ఆ ఆస్తిని తీసుకెల్లి ఏట్లో పారబోసీక"

ఆలోచనలో పడిన కామేశం ఏమీ మాట్లాడకుండా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

★ ★ ★ ★ ★

మర్నాడు చెరువు పనికెళ్ళి తిరిగి వస్తుంటే కామేశం నేస్తాలు కలిశారు. అందరూ డిగ్రీలు చేసిన వాళ్ళే. ఉద్యోగాలు లేక చెరువు పనికి వెళ్తూ వుంటారు. వాళ్ళ మధ్య చర్చ, పోతున్న తమ భూముల మీదకు వెళ్ళింది.

"ఒరేయ్, అసలు గవర్నమెంట్ కళ్ళు మన భూవుల మీద పడ్డాయేట్రా!" అడిగాడు కామేశం.

"ఎందుకంటే మన భూముల వంటి అందమైన భూములు ఈ భూ ప్రపంచంలోనే లేవు కనుక", అని కిసుక్కున నవ్వాడు వెంకట్రావు.

"మన మెరక భూములంటే ఏమను కున్నావురా. వారికి కరకరలాడే చేగోడీలు, జంతికలూను", అన్నాడు నవ్వుతూనే కరీం.

"ఛ! మెరక భూములంటావురా మనవి! మాంచి మీగడ తరకల్లా వుంటేను" అన్నాడు ఈశ్వరరావు.

"చపాతీ పిండి చదరంగా చేసి కాలిస్తే మన భూములంత అందంగా తయారవు తుందిరా" అన్నాడు జోజయ్య.

"అడిగిన దానికి సమాధానం చెప్పకుండా జోకులేస్తారేమిట్రా", కాస్త చికాగ్గా అన్నాడు కామేశం.

"ఒరేయ్! ఈడికి చాలా వేళాకోళంగా ఉందిరా మన మాటలంటే" అన్నాడు వెంకట్రావు.

"ఏరా కామేశూ, ఎంత నీ అంత చదువు కోకపోయినా ఏదో కొద్దిగా చదువుకున్నాంరా. మరీ అంత వేళాకోళం చెయ్యకురా" అన్నాడు కరీం మాటల్లో వ్యంగ్యాన్ని అణిచి పెట్టి.

"నోరు ముయ్యండ్రా. ఇక పేలితే తంతాను. అడిగిన దానికి సమాధానం తెలిస్తే చెప్పండి లేకపోతే నోర్మూసుకుని ఉండండి" అన్నాడు కామేశం కోపంగా.

"లేకపోతే నీ ప్రశ్నేంట్రా. గవర్నెంటోడికి మన భూములు కనిపించకపోతే కిందన పల్లంలో వున్న పూరోళ్ళ భూములు కనిపిస్తాయేట్రా! అయ్యన్నీ పెద్ద బుర్రలవీ. ఈ మెరకలన్నీ మనలాంటి యెద్దు బుర్రలవీ", అన్నాడు జోజయ్య.

"అయితే తేరగా వున్నాయని లాక్కు దొబ్బుతారేట్రా" అన్నాడు ఆవేశంగా అంతవరకూ వీళ్ళ సంభాషణని మౌనంగా వింటున్న చిన్నారావు.

కరీం అందుకున్నాడు "అన్నన్నా చిన్నారావు! ఎంత మాటన్నావోయ్. గవర్నమెంటంటే ఎవరు? మనమే కదా! మనం త్యాగాలు చెయ్యకపోతే వాళ్ళ భోగాలు ఎవరు తీరుస్తారోయ్!"

"అయినా మినిస్టర్‌గారు ప్రారంభోత్సవంలో ఇపుడు జరుపుతున్న ఈ సేకరణ రెండువైపులా పదునున్న కత్తిలాంటిదని అన్నారు వినలేదా", అన్నాడు వెంకటరావు.

"అవును! ఏవైపు నరికిన తెగిపోయేది మనకే!" అన్నాడు చిన్నారావు.

"ఒరేయ్ చిన్నారావు మళ్ళా తప్పు మాట్లాడుతున్నావు. ఆయనన్నది ఆ ఉద్దేశ్యంలో కాదు. ఈ సేకరణ ద్వారా మన పేదరికాన్ని తొలగిస్తారు (నరుకుతారు). ఈ భూముల్లో కాలనీలు కట్టి పేదలకివ్వడం ద్వారా వారి పేదరికాన్నీ తొలగిస్తారు(నరుకుతారు). అందువల్ల ఈ కార్యక్రమం రెండువైపులా జారున్న కత్తే!" అన్నాడు వెంకటరావు.

"ఒరేయ్ పేదరికం తొలగించాలంటే అంత కష్టం ఎందుకురా పేదల్ని నరికేస్తే సరిపోతుంది గదా" అన్నాడు ఈశ్వరరావు.

"ఓరి వెర్రి నాగన్నా! ఇంతసేపూ వెంకట్రావుగాడు చెప్పింది అదేరా.. కాకపోతే ఆడు ఇండైరెక్ట్ స్పీచ్‌లో చెప్పాడు, నువ్వు మరీ డైరెక్ట్ స్పీచ్‌లో చెప్పేసావు. ఇది గరీభీ హఠావో కార్యక్రమమే" అన్నాడు జోజయ్య.

"మీరు మరీ అన్యాయంగా మాట్లాడు తున్నార్రా! గవర్నమెంట్‌కి మన మీదేమైనా పగా ఏమిట్రా నరికెయ్యడానికి" అన్నాడు కామేశం.

"బయలుదేరాడ్రా! బుద్ధిమంతుడు. అందుకే ఆ రోజు కలెక్టర్, ఆర్డీఓ మీటింగ్‌లో నోటిమీద వేలేసుకోని ముందు వరసలో కూర్చున్నాడు"

"ఆ రోజు మంత్రిగారు, కలెక్టర్‌గారు ఇచ్చిన హామీలు అబద్దాలంటారా"

"ఒరేయ్! ఈ హామీలే గానీ నిజాలైతే ఆ లాభం నష్టం పేదోళ్లకెందుకు వదిలేయాలని వూళ్ళో పెద్ద బుర్రలన్నీ ఆలోచించవా! 'మా భూములు తీసుకోండి' 'మా భూములు తీసుకోండి' అని వాళ్ళే ఆ అధికార్ల వెంట, నాయకుల వెంట ఎగబడి తిరిగేవాళ్లు. కానీ వాళ్ళు ఇప్పుడు చడీ చప్పుడూ లేకుండా ఉన్నారంటే ఈ హామీలు ఉత్తదే అన్న అనుమానం వస్తుంది ఎవరికైనా" అన్నాడు వెంకటరావు.

"నువ్వన్నది నిజమేరా! మనకు కేటాయించిన భూమి అమ్ముకుంటే ఆ వచ్చిన డబ్బులు తీసుకెళ్లడానికి గోనెబస్తాలు కూడా చాలవట. మనం కారుల్లో తిరగొచ్చట, ముక్కా ముక్కా అమ్ముకున్నా తరతరాలు బతికెయ్యొచ్చట. ఇలాంటివి చాలా చాలా చెప్పారు. వీటిల్లో నిజముంటే వూళ్ళో పలుకుబడి ఉన్నోళ్ళంతా వదులుతారా! ఇందులో ఏదో మతలబు వుంది", అన్నాడు కరీం.

"నేను మాత్రం మా నాన్నతో యెట్టి పరిస్థితుల్లోనూ సంతకం పెట్టొద్దని చెప్పాను" అన్నాడు చిన్నారావు.

"భూమి ఇవ్వననడానికి లేదట. డీ ఫార్మ్ పట్టా గవర్నెంట్ ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసేసుకోవచ్చని ఆర్డీఓ మీటింగ్‌లో చెప్పాడు వినలేదా! అడగడానికి మనకి రైట్ లేదట. నువ్విప్పుడు చెయ్యాల్సిన పని అదికాదు" అన్నాడు జోజయ్య.

మరేమిటన్నట్టు చూసాడు చిన్నారావు.

"ముందు మీ నాన్న చేత సంతకం పెట్టించేసి. ఆ తర్వాత ఎక్కడ లేని పాత గోనె సంచులన్నీ సేకరించి వుంచుకో. సమయానికి గోనె మూటలు దొరక్కపోతే డబ్బు తెచ్చు కోవడానికి ఇబ్బందయిపోతుంది" అన్నాడు ఈశ్వరరావు.

అందరూ పెద్దపెట్టున నవ్వారు. చిన్నారావు మొహం చిన్నబోయింది.

ఆ తర్వాత ఎవరింటికి వారు వెళ్ళిపోయారు.

ఇంటికి వెళ్ళిన కామేశంకి ఎదురింటి ఎంకట లక్ష్మత్త

"కామేశూ! మీ అమ్మ లారీకి లోడెత్తడానికి జట్టుతో ఎల్లింది. నిన్ను భోజనం పెట్టుకొని తినీమంది". అని తాళాలు చేతిలో పెట్టింది.

కామేశంకి చాలా సిగ్గనిపించింది. ఆవిడ మొహం వైపు చూడకుండానే తాళాలు తీసుకొని లోపలికి వెళ్ళిపోయాడు.

భోజనం చేసి మంచం వాల్చుకున్నాడు. స్నేహితుల మధ్య జరిగిన చర్చ గుర్తొచ్చింది. వాళ్లంతా నవ్వుతూ వున్నా ఆ నవ్వులు నిజమైనవి కావు. ఆ నవ్వుల వెనుక లోలోతుల్లో గూడు కట్టుకున్న విషాదం వుంది, తమ చేతకానితనం వుంది. ఆ విషాదం వాళ్ళదే కాదు. తమలాంటి వారందరిదీ. తరతరాలుగా మోసపోతున్న వాళ్లంతా తమ బాధను వ్యక్తం చేసుకోవడానికి ఎంచుకున్న మార్గం అదేనేమో!

తల్లి కూలిపనికి వెళ్ళడం కోపం తెప్పించింది. కానీ అంతకన్నా వేరే దిక్కులేదని కూడా గుర్తొచ్చింది. తను కూడా ఇంకా ఆవిడ రెక్కల కష్టమ్మీదే ఆధారపడి బ్రతుకుతున్నాడు. అందుకే భూమిని గవర్నమెంటోళ్లు తీసుకుంటే వాళ్లిచ్చిన తృణమో పణమో తీసుకుని ఏదైనా వ్యాపారం చేసుకుందామని ఆశపడ్డాడు. కానీ పరిస్థితులు చూస్తుంటే అంతా తిరకాసుగా

ఉన్నట్టు అనిపిస్తుంది. యేమి చేయడానికీ పాలుపోవడం లేదు. ఇంతవరకూ తల్లి సంతకం పెట్టకపోవడం వెనుక ఆ భూమితో ఆమెకున్న అనుబంధమే కారణం అనుకున్నాడు కానీ ఆమె లోలోపల తన భవిష్యత్తు గురించి కూడా తీవ్రంగా ఆలోచిస్తుందని అర్థమైంది.

ఆ మడి చెక్క చేజారిపోతే తమలాంటి కుటుంబాలకి పెద్ద అండ పోయినట్టే! ఆలోచనలకి నిద్ర పట్టక వీధిలోకి వెళ్ళిపోయాడు.

★ ★ ★ ★ ★

ఒక రోజు వీఆర్వో కామేశంకి కబురు పెట్టాడు.

"నమస్కారం సార్!"

"ఏమోయ్ కామేశం! మీ అమ్మ సంతకం పెట్టిందా"

"లేదండీ", అన్నాడు వినయంగా కామేశం.

"ఇదేమిటోయ్, ఇంజనీరింగ్ చదువుకున్న కుర్రాడివి ఇంట్లోవాళ్లని ఒప్పించలేకపోతే రేప్పొద్దున నీకు ఏ కంపెనీలోనైనా ఇంజనీర్‌గా జాబ్ వస్తే నీ కింద పనిచేసే కిందిస్థాయి ఎంప్లాయ్స్‌తో ఎలా పని చేయిస్తావోయ్", అని కామేశంతో ఒక రకంగా మాట్లాడాడు వీఆర్వో.

తనని అర్థం పర్థం లేకుండా ఉబ్బేస్తున్నాడని అర్థమైంది కామేశంకి. అయినా ఏమీ జవాబు చెప్పకుండా నిలుచున్నాడు.

"అది సరేగాని, ఒక్కసారి మీ లాండ్ దగ్గరికి తీసుకువెళ్ళాలోయ్"

"ఎందుకు సార్"

"మీ లాండ్‌లో చెట్లు ఎన్నున్నాయో లెక్క రాసుకోవాలి"

"ఇంకా మేము ఇస్తామని అంగీకారం ఇవ్వలేదు కద సార్!"

"అదేమిటి కామేశం! ఇల్లిటరేట్‌లా మాట్లాడతావు. మొన్న కలెక్టర్‌గారు ఆర్‌డీఓగారు వచ్చినప్పుడు ఏమన్నారో వినలేదా. భూములు ఇవ్వము అనే ఆప్షన్ మీదగ్గర లేదు. కాకపోతే నష్టపరిహారం విషయమై అధికారులతో ఏమైనా మాట్లాడుకోవచ్చు అన్నారు. పద చూపించు. ఒకవేళ ఇప్పుడు నువ్వు చూపించక పోతే నేను జీరో ట్రీస్ అని రాసుకొని పోతాను. రేప్పొద్దున చెట్లకు సంబంధించిన నష్టపరిహారం నీకు రాకపోతే నన్ను అనొద్దు", అన్నాడు వీఆర్వో.

"సార్! యెన్ని చెట్లున్నాయో నేను చెప్పేస్తా సార్ రాసుకోండి" అన్నాడు కామేశం.

"అలా కుదరదమ్మా. నేను ఫీల్డ్ మీదకి వెళ్లి స్వయంగా చూస్తేనే కానీ నాకు సాటిస్‌ఫ్యాక్షన్ వుండదు పద" అని బయలుదేరదీసాడు.

చివరికి చేసేదేమీలేక తన గరువు చూపించడానికి తీసుకువెళ్లాడు. వీఆర్వో చెట్లన్నీ లెక్కెట్టి మొత్తం అన్ని రకాలూ కలిపి యాభయ్ వున్నాయని లెక్క రాసుకున్నాడు. ఏయే చెట్లకు ఎంత పరిహారం వస్తుందో చెప్పాడు.

ఆ తర్వాత విచిత్రంగా కామేశం కేసి చూసి పళ్ళికిలించడం మొదలెట్టాడు. కామేశంకి అర్థం కాలేదు.

"కామేశం మీ పొలంలో చేవ చెట్లు పెద్దగా లేవయ్యా! అన్నీ మామూలు చెట్లే, చెప్పాలంటే వీటికి పెద్ద నష్టపరిహారం రాదు. మరేమీ చేయమంటావు", అన్నాడు పళ్లికిలిస్తూనే.

"ఎన్నుంటే అన్నే రాయండి. మీరు మాత్రం ఏం చేస్తారు" అన్నాడు.

"నిన్ను చూస్తే చదువుకున్న కుర్రాడివి. నోట్లో నాలుక లేనోడివి. పైగా తండ్రి కూడా లేడు. ఎలా బ్రతుకుతావో ఏమోనోయ్!", అన్నాడు జాలి కురిపిస్తూ.

హఠాత్తుగా తనమీద ఇంత జాలి ఎందుకు కురిపిస్తున్నాడో కామేశంకి అర్థం కాలేదు.

"నీకు భూమి కాస్త ఎక్కువ రాయిస్తాలే! అలాగే నీ పొలంలో వున్న యాభై చెట్లూ చేవ చెట్లని రాయిస్తా. కాకపోతే పైన ఆర్‌ఐకి ఏమ్మార్వో, వాళ్ళని కూడా ఒప్పించేస్తే మనకిక ఢోకా ఉండదు. ఏమంటావ్", అన్నాడు వీఆర్వో.

అతను ఉద్దేశ్యం ఏమిటో చూచాయగా అర్థం అయినా అర్థం కానట్టే

"సరే సార్, అలాగే వాళ్ళని కూడా ఒప్పించి నాకు సాయం చేసి పెట్టండి" అన్నాడు కామేశం.

"నీ గురించి నీ కుటుంబం గురించీ నాకు తెలుసు గనుక నేనేదో సాయం చేయాలని అనుకుంటున్నాను. కానీ పైనున్న అధికారులు అలా అనుకుంటారా. వాళ్లకేం కావాలి అలా అనుకోవడానికి"

"అయితే మరేమి చేద్దామంటారు"

"వాళ్ళకి కనీసం ఒక పదివేలైనా చేతిలో పెట్టకపోతే ఒప్పుకోరోయ్"

"పదివేలా!", ఆశ్చర్యంగా అన్నాడు కామేశం.

"ఇంకా నువ్వు గాబట్టి పదివేలు మరొకళ్ళైతే ఇరవై వేలకు తక్కువుండదు. నీ కేసు కూడా ఒప్పుకుంటారో, ఒప్పుకోరో చెప్పలేను. నా ప్రయత్నం నేను చేస్తాను. ఆ తర్వాత నీ ఇష్టం"

"ఒక వారంలో బెత్తాయిస్తానండీ" అన్నాడు వినయంగా కామేశం.

"వారమంటే కష్టమోయ్. ఒక్క రెండు మూడు రోజుల్లోగా ఇవ్వగలిగితే చూడు. లేకపోతే వున్నది వున్నట్టు రాసి ఫైల్ పైకి పంపించేస్తాను. ఇప్పటికే లేటైపోయింది"

"అలాగే సార్! నా ప్రయత్నం నేను చేస్తాను"

"త్వరగా చూడు మరి. నేను వస్తాను"

"అలాగే సార్"

"మరొక్క విషయం"

"చెప్పండి"

"ఒక ఎకరా లాండ్ పోయిన రైతుకి, ప్రభుత్వం పద్దెనిమిది సెంట్లు డెవలప్ చేసిన లాండ్ ఇస్తుంది. కానీ సర్వేయర్లు అంత లాండ్ లేదని తగ్గించేస్తున్నారు."

"అదేంటి సార్! భూమి కాయితాల్లో ఎంతుంటే దాన్ని బట్టే కదా వస్తుంది"

"నిజమే, కానీ కాయితాల్లో రాసిచ్చినంత భూమి వాస్తవంగా భూమ్మీద లేదు. ఎకరా అని వున్నోడికి కనీసం పది సెంట్లయినా తేడా వస్తుంది. అందుకని సర్వేయర్లు తగ్గించి రాస్తున్నారు. నీకు కూడా కాయితం మీద వున్నది అరెకరా! నిజానికి అంత వుండదు. అయితే నేను మాత్రం సర్వేయర్‌తో చెప్పి నికరం అరెకరా ఉండేటట్టు రాయిస్తాను. నువ్వు మాత్రం అందులో ఒక సెంట్ నా పేర్న రిజిస్టర్ చేయించాలి. సరేనా" అని ఆశగా చూస్తూ అడిగాడు కామేశంని.

వీఆర్వో తన పొలం వరకూ మొక్కలు లెక్కబెట్టే పేరుతో ఎందుకొచ్చాడో ఇప్పుడు పూర్తిగా అర్థమైంది కామేశంకి. పైకి మాత్రం ఏమీ అనకుండా

"అలాగే సార్, చూద్దాం" అన్నాడు.

★ ★ ★ ★ ★

ఇంట్లో బట్టలుతుక్కుంటున్నాడు కామేశు. ఇంతలో ఫోన్ రింగయ్యింది.

అవతల అతని మిత్రుడు వెంకటరావు

"ఏరా ఎక్కడున్నావు"

"ఇంట్లో వున్నారా"

"మినిస్టర్ గారొచ్చార్రా! ఎల్పిఓసిలు ఇస్తారట. నువ్వు కూడా రా"

"ఎల్పిఓసి లా అంటే ఏమిట్రా!"

"నీకు తెలుసు కదా మన వాళ్ళలో కొంతమంది భూమిని ప్రభుత్వానికి ఇస్తున్నట్టుగా ఫార్మ్ 3ల మీద సంతకాలు పెట్టారు. వాళ్ళందరికీ వాళ్లిచ్చిన భూమిని బట్టి, వాళ్ళకి ప్రభుత్వం ఇవ్వాల్సిన భూమిని కేటాయిస్తూ ఎల్పిఓసి ఇస్తారట. అంటే లాండ్ పూలింగ్ ఓనర్ షిప్ సర్టిఫికేట్లు" వివరించాడు వెంకటరావు.

"ఫార్మ్ 3 మీద మా అమ్మ సంతకం పెట్టలేదు కదా. నేనెందుకులే ఆ మీటింగ్ కి" అన్నాడు కామేశు.

"మా నాన్న మాత్రం పెట్టాడేమిట్రా. మనం కొన్ని విషయాలని కాపలా కుక్కల్లాగ గమనించాలి. ఇక్కడ ఏదో డ్రామా జరగ బోతుందని అనిపిస్తుంది ఒక్కసారి రా"

స్నేహితుడి మాట తియ్యలేక చేస్తున్న పని ఆపి గబగబా బట్టలు వేసుకొని మీటింగ్ దగ్గరకు చేరుకున్నాడు కామేశం. అక్కడంతా కోలాహలంగా వుంది. మినిస్టర్‌గారి చుట్టూ స్థానిక నాయకులు ఈగల్లా ముసిరిపోయి వున్నారు. మినిస్టర్‌గారి పక్కన కలెక్టర్‌గారు కూర్చొని వున్నారు. మిగిలిన అధికారులు ఎవరి హడావిడిలో వాళ్ళు వున్నారు. వూరి జనాలంతా ఆవరణలోని కుర్చీల్లో కొంతమంది వుంటే మరి కొంతమంది గుంపులు గుంపులుగా నిల్చొని చర్చించుకుంటున్నారు.

ఒక పక్కగా నిల్చున్న మిత్ర బృందాన్ని కలిశాడు కామేశు. కాసేపటికి మీటింగ్ అట్టహాసంగా మొదలయ్యింది. మినిస్టర్‌గారు భూసేకరణ వెనుక ఉద్దేశ్యాన్ని మరోసారి స్పష్టం చేశారు. పేదల పట్ల, పేదవారి అభ్యున్నతి పట్ల వారి ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి వున్నదీ తెలియజేశారు.

ఆ తర్వాత కలెక్టర్‌గారు, ఒకరిద్దరు మండల నాయకులు మాట్లాడారు. మీటింగ్ ముగింపుకి వచ్చింది.

మినిస్టర్‌గారి చేతుల మీదుగా ఎల్పిఓసీలు ఇచ్చే కార్యక్రమం మొదలయ్యింది. వీఆర్వో ఒక్కొక్కరి పేరే పిలుస్తున్నాడు. అతను పేర్లు పిల్చిన వాళ్ళు ఒక్కొక్కరుగా వచ్చి మినిస్టర్‌గారి చేతులమీదుగా ఎల్పిఓసీలు తీసుకుంటున్నారు. బి.చంటిబాబు.. కె.రాజు... సి.హెచ్. పైడమ్మ....

కామేశం బుర్ర ఒక్కసారిగా అలెర్ట్ అయ్యింది. ఆ పేరుగలావిడని పరీక్షగా చూసాడు.

"రేయ్! ఆవిడ్ని చూడండి. మన కాలనీ మనిషి కాదు కదా"

అందరూ ఆవిడ్ని పరీక్షగా చూసారు.

"ఆవిడ మన వీరునాయుడిగాడి అమ్మరా" అన్నాడు కరీం.

"ఏ వీరునాయుడు రా"

"ఆడేరా! ఆళ్ళ పార్టీకి యూత్ లీడర్. మన మినిస్టర్ గారికి రైట్ హ్యాండ్"

"వాళ్ళకి ఈ సెలకల్లో ఒక్క సెంట్ కూడా లేదు కదరా. ఆవిడకి ఎల్పిఓసీ ఎలా ఇస్తున్నారు. ఇది చాలా అన్యాయం గదా"

"ఇందాకా ఇక్కడ డ్రామా జరగబోతుందని చెప్పాను కదా! ఇదే ఆ డ్రామా! చూసి తరించు"

ఆ తర్వాత ఎల్పిఓసీలు తీసుకున్నవాళ్ళలో ఏంపీటీసీ, సర్పంచ్ బినామీలు కూడా వున్నారు.

ఆ సాయంత్రం కామేశు తనకు తెలిసిన వాలంటీర్‌ని కనుక్కుంటే అసలు విషయం బయట పడింది.

"ఆళ్లకి ఏ రకమైన పట్టాలూ లేవు. కానీ కొంత భూమి తమ ఆక్రమణ కింద వున్నట్టు రాయించుకున్నారు. వాటికి కాయితాలు వుండవు. డీ ఫారం పట్టాకైతే యెకరాకి పద్దెనిమిది సెంట్ల భూమి ఇస్తే ఈ ఆక్రమణ భూములకు కాయితాలు లేనందున యెకరాకి తొమ్మిది సెంట్లు ఇస్తారు"

ఆ వాలంటీర్ మరో విషయం కూడా చెప్పాడు. వూళ్ళో అధికార పార్టీ వాళ్ళే కాక ఏమ్మార్వో, డీటి, ఆర్ ఐ స్థాయి అధికారులు కూడా బినామీ పేర్లతో ప్లాట్లు రాయించు కుంటున్నారట.

కామేశంకి రక్తం సలసలా కాగింది. వీఆర్వో, తమ భూములు వుండాల్సినంత విస్తీర్ణం ఎందుకు లేవన్నాడో ఇప్పుడు అర్థమైంది.

వీళ్లంతా కలిసి ఏం చేస్తారో కూడా అర్థమైంది. ఏ రోడ్డు పక్కనో మంచి రేటున్నచోట ప్లాట్‌లు వాళ్ళు తీసుకొని తమకు ఎందుకూ పనికి రానివి ఇస్తారు. యెప్పటిలాగే తమ నోట్లో మట్టి కొడుతున్నారన్నమాట.

మీటింగ్ అయ్యాక వీఆర్వో కామేశం ఇంటిముందు బండి ఆపాడు.

"ఏమోయ్ కామేశూ! చూసావా, మీ అమ్మ సంతకం పెట్టేసి వుంటే ఈ రోజు నువ్వు కూడా మినిస్టర్‌గారి చేతుల మీదుగా ఎల్పిఓసీ తీసుకొని వుండేవాడివి. ఎలాగూ తప్పని దానికి మీ అమ్మకు అంత మంకుపట్టు ఎందుకూ. అనవసరంగా మినిస్టర్‌గారి చేతుల మీద తీసుకొనే అవకాశం పోయింది" అన్నాడు వీఆర్వో.

"మా సంగతికేముంది గానీ మీరు కూడా మంత్రిగారి చేతులమీదుగా ఓఎల్పిఓసీ తీసుకోవాల్సింది" అన్నాడు.

"నేను తీసుకోవడమేమిటోయ్. ఏం మాట్లాడుతున్నావు" ఆశ్చర్యంగా అన్నాడు వీఆర్వో.

"ఏం లేదండీ, మాకందరికీ ప్లాట్లు ఇప్పించడానికి రాత్రనకా పగలనకా కష్టపడు తున్నారు కదా! మీకు ఎంతో కొంత లేకపోతే ఎలాగండి!"

"ఇన్నాళ్ళకి నువ్వొక్కడివన్నావోయ్! నీ అభిమానానికి థాంక్స్. కానీ అది కుదిరే పనేనా"

"మన దేశంలో కుదర్లేని పనంటూ ఉందటండీ అసలు! అందులోనూ మీలాంటి వాళ్ళు తల్చుకుంటే అసలు జరగలేని పనంటూ వుండదు. అసలు నన్నడిగితే మీకే కాదండీ మీ డిపార్ట్‌మెంట్‌లో కష్టపడుతున్న ప్రతీ ఒక్కరికీ అంటే ఏమ్మార్వో నుంచి డీటిలు, ఆర్టైలు ప్రతీ ఒక్కరికీ ఎల్పిఓసీలు ఇవ్వాలండీ" అన్నాడు కామేశు.

"అదేమిటోయ్, ఇక్కడ లాండ్ పోయిన వాళ్ళకే కదా ఎల్పిఓసీలు ఇస్తారు" అన్నాడు మరింత ఆశ్చర్యంగా వీఆర్వో.

"ఇప్పుడే అన్నాను కదా సార్ మీరు తల్చుకుంటే జరగలేని పని వుంటుందా అని. మళ్లీ మొదటి కొస్తారే!"

"భూములన్నీ వాళ్ళకిచ్చేస్తే మరి మీ సంగతేంటోయ్!"

"మాకు అలవాటే లెండి. వున్నకాడికి మట్టీ, రాళ్ళూ బుక్కడం" అన్నాడు కామేశు వ్యంగ్యంగా.

అప్పుడుగానీ కామేశు మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించలేదు వీఆర్వో.

ఏదో పనుందని చెప్పి బండి స్టార్ట్ చేసి గబగబా లాగించేసాడు.

కామేశు బుర్రలో ఆలోచన నిప్పులా రాజుకుంటోంది. కొలిమి అంటుకోవడానికి సిద్ధంగా వుంది. ✵

దేశ విభజన వస్తువుగా సాహిత్యం-15

# దేశ విభజనకు స్పందించిన చిత్రకారులు, శిల్పులు, ఛాయాచిత్రకారులు, మ్యూజియంలు - 2

- కొత్తపల్లి రవిబాబు

**దేశ** విభజన అంటే కేవలం నేలను మాత్రమే విభజించలేదు. దానిపై వున్న ప్రజలను, వారిలో వున్న కళాకారులనూ, సంస్కృతిని కూడా విడదీసింది. కళాకారులు, సాంస్కృతికబృందాలు విచ్ఛిన్నమై వేర్వేరు ప్రదేశాలకు విసరివేయబడ్డారు. ఉర్దూభాష దేశమంతా మాట్లాడే భాషగా, సాహిత్య భాషగా ఉన్నదల్లా కేవలం పాకిస్తాన్ వారి భాషగా మారిపోయింది. సంప్రదాయ సంగీతం, నాట్యరీతులపైనా విభజన ప్రభావం అపారంగా వుంది. ఉదాహరణకు పంజాబీ సంస్కృతిలో భాగంగా వున్న పంజాబీ నాట్యరీతులైన భంగ్రా, గిద్దా విభజన తర్వాత ఇండియాలో విరివిగా, పాకిస్తాన్‌లో అరుదుగా కొనసాగుతున్నాయి, అలాగే ఉమ్మడి ప్రాచీన కట్టడాలు కూడా ఇప్పుడు ఆయా దేశాలలోని కట్టడాలుగా పరిగణింపబడుతున్నాయి. అలా కళలు, సంస్కృతి, వారసత్వ చిహ్నాలు కూడా విభజనకు గురయ్యాయి.

దేశ విభజనపై స్పందించి చిత్రాలను సృష్టించిన మరికొందరు చిత్రకారులు, చిత్రకారిణిలను పరిచయం చేసుకుందాం. ఆలీగర్‌కు చెందిన జరీనా (రషీద్) హష్మి తల్లిదండ్రులు, 1950లో కరాచీకి వలస వెళ్ళారు. ఆమె తండ్రి ఆలీఘర్ విశ్వవిద్యాలయంలో చరిత్ర ఆచార్యుడు. అప్పటికి జరీనా వయసు 13 ఏళ్ళు. 1937లో జన్మించిన ఆమె 2020లో మరణించారు. 1977లో న్యూయార్క్‌లో స్థిరపడ్డారు. న్యూయార్క్ ఫెమినిస్ట్ ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఒక దౌత్యవేత్తను వివాహ మాడటం వల్ల చాలా దేశాలు తిరిగారు. ఆమె 'నాకు స్వదేశం లేదు' అనేవారు. 'ఇండియా, పాకిస్తాన్ – రెండు దేశాలకు చెందినదానను' అనేవారు. Home is a Foreign Place (ఇల్లే విదేశీయం) పేరుతో 36 వుడ్‌కట్ చిత్రాలు వేశారు. ఇండియాలో వున్న కుటుంబాలను కూడా ఆమె చిత్రీకరించారు. దేశాన్ని విభజిస్తూ రాడ్‌క్లిఫ్ గీసిన గీతను ఆమె చిత్రీకరించారు. దానికి 'డివైడింగ్ లైన్' (2001) అని పేరు పెట్టారు. ఆ తర్వాత కాలంలో ప్రపంచవ్యాప్తంగా బాధితులైన శరణార్ధులపైనా, రోహింగ్యాలపైన చిత్రాలు వేశారు. లెబనాన్, బాగ్దాద్, సిరియాలలో వలసదార్ల దుస్థితిని చిత్రించారు.

దేశ విభజన జరిగి 70 సంవత్సరాలైన సందర్భంగా ఆమె 2018లో 'డార్క్ రోడ్స్' (చీకటిదారులు) పేరుతో ఒక ప్రదర్శన నిర్వహించారు. దానిలో ఆమె చెక్కిన బొమ్మలు, వుడ్‌కట్ ప్రింట్లు, కాగితంతో తయారు చేసిన శిల్పాలు ప్రదర్శించారు. 2015లో చిత్రించిన 'రిఫ్యూజ్ కాంప్' (శరణార్ధుల శిబిరం)ను కాగితంతో తయారుచేసి, నాలుగు వరుసల దేరాలతో స్ఫురింపచేశారు. వీరి చిత్రాలు అనేక దేశాలలోని ప్రసిద్ధ కళాప్రదర్శనశాలల్లో ప్రదర్శిస్తున్నారు.

అమెరికాలోని చికాగోలో స్థిరపడిన ప్రీతిక చౌదరి 'పార్టిషన్ యాంటీ – మెమోరియల్ ప్రాజెక్టు'ను, 'కౌంటర్ మెమరీ ప్రాజెక్టు'లను రూపొందించారు. 1973లో ఇండియాలోని కర్నాటకలో జన్మించిన ఆమె 1999లో అమెరికాకు వెళ్ళారు. మాడిసన్‌లోని విస్కాన్‌సన్ విశ్వవిద్యాలయంలో చిత్రకళకు సంబంధించిన కోర్సులను చదివారు. 2009–2011 మధ్య విజిటింగ్ ప్రొఫెసర్‌గా కొన్ని కళాశాలల్లో పనిచేశారు. 2007లో ఆమె ప్రారంభించిన 'పార్టిషన్ యాంటీ – మెమోరియల్ ప్రాజెక్టు'లో చరిత్రకు సంబంధించి తొమ్మిది ఉపశాఖ లున్నాయి. వాటిలో 1947 నాటి భారతదేశ విభజన, 1971 నాటి బంగ్లాదేశ్ యుద్ధం, 1919 నాటి జలియన్‌వాలాబాగ్ మారణకాండ వున్నాయి. ఆమె చిత్రాలు అమెరికాలోని వివిధ ఆర్ట్ గ్యాలరీలలో చోటు దక్కించుకున్నాయి. ప్రస్తుతం ఆమె సౌత్ ఆసియా ఇన్‌స్టిట్యూట్‌లో క్యూరేటర్ (సంరక్షకురాలి)గా పనిచేస్తున్నారు. చికాగోలోని 'మహిళల గ్యాలరీ బోర్డు'లో సభ్యురాలిగా వున్నారు.

ప్రీతిక చౌదరి తల్లి కరాచీకి చెందిన సింధీ. తండ్రి బెంగాలీ. ఆమె అమ్మమ్మ, తాత కరాచీ నుండి ఢిల్లీకి వలస వచ్చే నాటికి ప్రీతిక తల్లి వయసు మూడేళ్ళు. తల్లి ద్వారా అమ్మమ్మ, తాతయ్యలు విభజన సమయం నాటి దుర్భర వేదన గురించి ప్రీతిక తన 30వ యేట తెలుసుకుంది. 2007లో ఊర్వశి బుటాలియా రచన 'ది అదర్ సైడ్ ఆఫ్ సైలన్స్' (మౌనానికి ఆవలప్రక్క) ద్వారా ఆమె ప్రభావితమయ్యారు.

'Queering Mother India', 'What the Body Remembers', 'Silent Waters', 'Remembering the Crooked Line' చిత్రాలను 2007–2009 మధ్య చిత్రించారు. ఆమె కేవలం భారతదేశ విభజన గురించేకాక, ప్రపంచంలో విభజన జరిగిన దేశాలన్నిటిలో ఆ సందర్భంగా జరిగిన అల్లర్లు, యుద్ధాలు, సరిహద్దుల్లో జరిగే హింస, జాతి హననం, ఉగ్రవాదుల దాడులు, లైంగిక దాడులకు వ్యతిరేకంగా స్పందిస్తూ చిత్రాలు వేశారు. ఈనాటి బోస్నియా, రువాండా, యుక్రెయిన్ యుద్ధ సమయంలో సాధారణ ప్రజల బాధామయ గాథలకు స్పందించారు. www.pritikachowdry.com అనే వెబ్‌లో వారి చిత్రాలు చూడవచ్చు.

లాహోర్ నుండి వలస వచ్చిన చిత్రకారులు ఢిల్లీలో 25 మార్చి 1949న శిల్పి చక్ర గ్రూపుగా ఏర్పడ్డారు. వీరిలో ముఖ్యులు శైలజా ముఖర్జీ, బి.సి. సన్యాల్, ధనరాజ్ భగత్, దినకర్ కౌశిక్, కె.ఎస్. కులకర్ణి, జియా అప్పస్వామి, శంకర్ పిళ్ళై, కన్వాల్ కృష్ణ, పి.ఎన్. మంగో, మెక్సికో నుండి తిరిగి వచ్చిన సతీశ్ గుజ్రాల్. తమ ప్రణాళికలో బెంగాల్ స్కూల్ కంటే విభిన్నంగా "కళ జీవితంలో కాంతి నింపుతుంది" అని

ప్రకటించారు. "కళ అనేది జీవితం నుంచి వేరుపడకూడదు. ఒక జాతివారి కళ, ఆ జాతి ప్రజల ఆత్మను చిత్రించాలి. ఆ జాతి ప్రగతితో కలసి పయనించాలి. చిత్రకారులు తమ కళ ద్వారా జాతీయ సంస్కృతిని నిర్మించి, దేశంలో మెరుగైన పరిస్థితులకై కృషిచేయాలి" అని వారి ప్రణాళికలో నిర్దేశించుకున్నారు.

22 ఏప్రిల్ 1901లో అస్సాంలోని డిబ్రూగర్‌లో బెంగాలీ కుటుంబంలో జన్మించిన బి.సి. సన్యాల్, తన జీవిత కాలంలో ఉపఖండంలో 1905, 1947, 1971లలో జరిగిన విభజనలను చూసారు. ఆయన కలకత్తాలోని ప్రభుత్వ చిత్రకళా కాలేజిలో చదివారు. అమరుడైన లాలాలజపతిరాయ్ విగ్రహం తయారుచేయడానికి లాహోర్‌కు 1929లో వెళ్ళి అక్కడే స్థిరపడి లాహోర్‌లోని మేయో స్కూల్ ఆఫ్ ఆర్ట్‌కు వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. సతీశ్ గుజ్రాల్, కృష్ణ ఖన్నా అక్కడ ఆయన విద్యార్థులు. 1937లో ఆయన సొంతంగా లాహోర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్ 1937లో స్థాపించారు. కాని 1947లో ప్రసిద్ధ గజల్ గాయని స్నేహలతతో కలసి ఢిల్లీకి వలస వెళ్ళి అక్కడ స్థిరపడ్డారు. అక్కడ ఆయన స్టూడియోను "శరణార్థి స్టూడియోగా పిలిచేవారు. ఇక్కడే ఢిల్లీ శిల్ప చక్ర ఏర్పడింది. ప్రధానంగా ఆయన ఆర్థికంగా చితికిపోయిన ప్రజలను చిత్రించారు.

ఈ గ్రూపులోని ధనరాజ్ భగత్ (1917–1988) లాహోర్‌లో జన్మించి, 1950లో ఢిల్లీ చేరారు. వీరు మొదట మట్టితో శిల్పాలు చేసి ఆ తర్వాత లోహాలతో చేయడంలో నైపుణ్యం సంపాదించారు.

అభ్యుదయ చిత్రకారుల బృందం (Progressive Artist Group - PAG) 1947 డిసెంబర్ 15న సామ్రాజ్యవాద వ్యతిరేకత లక్ష్యంగా ఏర్పడింది. కళాకారులకూ, సాధారణ ప్రజలకూ మధ్య వున్న అంతరాన్ని ఈ బృందం తగ్గించింది. ఆరా, రజా, సౌజా, బక్రే, హుసేన్, గడే అనే చిత్రకారులు ఈ బృందం తరఫున తమ చిత్రాలు 1949లో బొంబాయిలో మొదట ప్రదర్శించారు. ఈ గ్రూపులో వయసులో అందరికంటే పెద్దవాడైన కె.హెచ్. ఆరా 1914లో జన్మించారు. తన 7వ ఏట తాతతోపాటు సింధ్‌లోని హైదరాబాద్ నుండి బొంబాయికి తరలివచ్చారు. రోమన్ కాథలిక్ కుటుంబానికి చెందిన ఫ్రాన్సిస్ న్యూటన్ సౌజా 1924లో జన్మించాడు. మూడు నెలల పసితనంలో తండ్రి మరణించాడు. ఆ తర్వాత చెల్లెలు మరణించింది. వితంతువైన తల్లితో బొంబాయి చేరారు. తల్లి టైలరింగ్ చేసి కుటుంబాన్ని పోషించేవారు. 1940లో జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో చేరారు. దేశభక్తి ప్రదర్శించినందుకు స్కూలు నుండి బహిష్కరించారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి, మార్క్సిస్టు భావాలకనుగుణంగా చిత్రాలు వేశారు. 'గోవన్ రైతులు', 'బొంబాయి శ్రామికులు' మొదలైనవి ఆయన ప్రముఖ చిత్రాలు.

సరిహద్దులను నిర్ణయిస్తూ రాడ్‌క్లిఫ్ 1947 ఆగస్టు 17న ఇచ్చిన ప్రకటన గుర్తు తెచ్చుకుంటూ 2017 ఆగస్టు 17న అమృతసర్‌లోని చరిత్రాత్మక టౌన్‌హాల్‌లో 'పార్టిషన్ మ్యూజియం' ప్రారంభించారు. ఈ మ్యూజియంలో అమృతసర్ మీదుగా లాహోర్ నుంచి ఢిల్లీకి కుటుంబంతో వలస వెళ్ళిన అమర్ కపూర్ డైరీ వుంది. ఢిల్లీలో మొదటి మూడు నెలలు ఒకరి ఇంటి వరండాలో ఆ కుటుంబం కాలం గడిపింది.

ప్రీతమ్ కౌర్ ముస్లిం మతం నుండి సిక్కు మతంలోకి మారి కేహర్‌సింగ్‌ను వివాహమాడారు. ఆమెను జనవరి 1948లో బంధువులను చూడటానికి వెళ్తుంటే అరెస్టు చేశారు. ఆమెను విడుదల చేయమని కేహర్‌సింగ్ రాసిన ఉత్తరం ఈ మ్యూజియంలో చదవవచ్చు.

పాత బ్రిటిష్ తపాలా స్టాంప్స్ పైన పాకిస్తాన్ అనే పదాన్ని ముద్రించి, వాటినే ప్రత్యేకంగా పాకిస్తాన్ తపాలా బిళ్ళలు ముద్రించేవరకూ అంటే 1947 అక్టోబరు 1 వరకు వాడారు. ఈ పోస్టల్ స్టాంప్స్ ఈ మ్యూజియంలో చూడవచ్చు.

**ఈ వ్యాసానికి సంబంధించిన చిత్రాలు మూడవ అట్టపై ఉన్నాయి.**

**వచ్చే సంచికలో : చమన్ నహాల్ నవల 'ఆజాదీ'** ✵

# మన విశ్వవిద్యాలయాలలో వికార శాస్త్రాలు!

**జ్యోతిష్యం** ఒక నేర్చుకోదగిన, ఆచరించదగిన శాస్త్రంగా మన 'తెలుగు విశ్వవిద్యాలయం' తాను బోధించే కోర్సులలో ఒకటిగా ఏనాడో ప్రవేశపెట్టింది. ఇప్పటికే దానిలో డిగ్రీ పట్టాలు సాధించినవారిని తయారుచేసింది. అయితే ఇప్పటివరకు ఈ 'విద్యాధికులు' ఎవరి భవిష్యత్తును అధ్యయనం చేసి ఏ వాస్తవాలు ముందుగా వెల్లడించి ఏ సంక్షేమాన్ని సృష్టించారో వివరాలు మాత్రం ప్రజలకు ఎవరూ చెప్పలేదు. ఈ విషయమై మీడియాలోని వార్తావిశ్లేషకులు కూడా ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు కానరావు.

ఇప్పుడు మరలా 2020 నూతన విద్యావిధానంలో "పురాతనమైన, శాశ్వతమైన భారతీయ విజ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్ళే కార్యక్రమం"లో భాగంగా, కాన్పూరులోని ఛత్రపతి సాహూజీ మహరాజ్ విశ్వవిద్యాలయంలో 'హిందూ కర్మకాండ'పై ఒక సర్టిఫికెట్ కోర్సునూ, ఒక డిప్లొమా కోర్సునూ ప్రవేశబెడుతున్నారు. అంతేగాక జ్యోతిష్య విజ్ఞానంపై మాస్టర్స్ డిగ్రీ కోర్సును కూడా ప్రారంభిస్తున్నారు.

చనిపోయినవారి కోసం చేయాల్సిన కర్మకాండ శ్రాద్ధ కార్యక్రమాల పద్ధతులు, వివరాలు వేదాలలో వున్నాయట! వీటిని బ్రాహ్మణులే చేయాలి. ఆ క్రమంలో వారికి దక్షిణలు, దానాలు ఇవ్వాలి. చనిపోయినవారి ఆత్మలు, ఎడారిలో చాలదూరం ప్రయాణంచేసి చీము, నెత్తురు ప్రవహిస్తున్న వైతరిణి నదిని దాటాలి. ఎడారి ప్రయాణం కోసం చెప్పులు, ఎండ నుండి కాపాడటానికి గొడుగు, విశ్రాంతి తీసుకోడానికి మంచం, ఆవుతోక పట్టుకుని వైతరణి నదిని దాటాలి కనుక ఒక ఆవును – ఇలా దానాలు ఇవ్వాలి!

ఈ ఏడాది ఈ కోర్సులో 29 మంది చేరారు, నెమ్మదిగా వీరి సంఖ్య పెరుగుతూ వుంటుందని అంచనా! ఈ కర్మకాండ కోర్సులూ, పురాతన వైదిక జ్యోతిష్యం కోర్సులు గోరఖ్‌పూర్, లక్నో విశ్వవిద్యాలయాలలో కూడా ప్రవేశపెట్టి సనాతనమైన నేటి పాలకులను మెప్పింప చూస్తున్నాయి. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయంలలో 'హిందూ అధ్యయనాలు' అనే కోర్సు గూడ ప్రారంభించాయి.

ఇంకా ఎన్ని అశాస్త్రీయ శాస్త్రాలను మనం శాస్త్రాలుగా అధ్యయనం చేసి మన కాలాన్ని ఎంత వృధా చేసుకోవాలో మరి! ✵

వ్యాసం

# పాలస్తీనియన్ల ఆదర్శప్రాయమైన పోరాట సంస్కృతి!

- ప్రసన్న

**అక్టోబర్** 7 తెల్లవారుజామున పాలస్తీనాకు చెందిన గాజా ప్రజలచే ఎన్నుకోబడి అధికారంలో ఉన్న హమాస్ అనే రాజకీయ పార్టీ ఇజ్రాయిల్ దేశం మీద రాకెట్ల వర్షం కురిపించింది. ఈ దాడిలో కొన్ని వందల సంఖ్యలో ఇజ్రాయిల్ సైనికులు, పౌరులు మరణించగా, మరికొంతమంది హమాస్‌కి బందీలుగా దొరికారు. దీనికి సమాధానంగా ఇజ్రాయిల్ గతం నుండి తాను చేస్తున్న దాడుల పరంపరను ఉధృతం చేసింది. ఈ దాడుల్లో పాలస్తీనాకు చెందిన సుమారు 9 వేలమంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. తన 75 సంవత్సరాల చరిత్రలో ఏనాడూ అంతర్జాతీయ సమాజాన్ని కానీ, ఒప్పందాలను కానీ పట్టించుకునే అలవాటు లేని ఇజ్రాయిల్, ఈ దాడుల్లో ఆసుపత్రులపై కూడా బాంబులు వేసి వందలాది మంది రోగుల ప్రాణాలు కూడా బలి తీసుకుని తన అమానవీయ ముఖాన్ని మరింత స్పష్టంగా ప్రపంచానికి చూపించింది. ఐతే ఇది రెండు మతాల మధ్య సంఘర్షణ అనీ, ఈ దాడులను హమాస్ మొదలు పెట్టింది కాబట్టి ఇజ్రాయిల్ చేస్తుంది సరైన పనే అనీ దురభిప్రాయాలను సామ్రాజ్యవాద మీడియా ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న అమానుషమైన అశాంతికి గత వంద సంవత్సరాలకు పైగా బీజాలు ఉన్నప్పటికీ, ఇజ్రాయిల్ ఈ వివాదాన్ని రెండున్నర వేల సంవత్సరాల ప్రాచీనమైనదిగా ప్రచారం చేస్తున్నది కాబట్టి, అక్టోబర్ 7 దాడులను చారిత్రక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక నేపథ్యం నుండి విడదీసి పరిశీలిస్తే వాస్తవాలను అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

మెసపుటోమియా అంటే నేటి ఇరాక్ నుండి పాలస్తీనా మీదుగా అబ్రహాం నాయకత్వంలో ఈజిప్టు చేరిన యూదులు మోషే నాయకత్వంలో తిరిగి పాలస్తీనా చేరి ఆ తర్వాత (సుమారు 2800 సంవత్సరాల క్రితం) ప్రపంచం నిండా చెల్లాచెదురయ్యారు. యూదు మత గ్రంథాల ప్రకారమైనా యూదుల జన్మభూమి పాలస్తీనా కాదు. అది వారి ప్రయాణంలో ఒక మజిలీ మాత్రమే. క్రీస్తును హత్య చేసినవారనే ద్వేషం వల్ల యూదులను యురోపియన్ క్రైస్తవులు అమితంగా ద్వేషించేవారు. దాడులు చేసేవారు. అప్పటి యూదులను యురోపియన్లు ఎంతగా ద్వేషించేవారో షేక్స్పియర్ 1597లో వ్రాసిన 'ది మర్చంట్ ఆఫ్ వెనిస్' నాటకంలోని షైలాక్ పాత్ర ద్వారా అర్థం చేసుకోవచ్చు. అలా 1290లో ఇంగ్లండు మొదలు 1945లోజర్మనీ వరకు మొత్తం క్రైస్తవ ప్రపంచం వారిని బహిష్కరించింది. ఆస్ట్రియా దేశస్థుడైన థియోడర్ హెర్జల్ మొదటి జియోనిస్ట్ మహాసభను 1897లో యూదులకు పాలస్తీనాలో ప్రత్యేక దేశం కావాలనే నినాదంతో ప్రారంభించాడు. ఆనాటికి పాలస్తీనా ప్రాంతం (టర్కీ కేంద్రంగా ఉనికిలో ఉన్న) ఒట్టోమాన్ సామ్రాజ్యపు ఖలీఫాల పాలనలో ఉండేది. ఖలీఫాల పాలనలో నిరంకుశ ధోరణులు తీవ్రంగా ఉన్నప్పటికీ, సామాన్య ప్రజలు శాంతిప్రియులుగా సహజీవన సంస్కృతితో జీవిస్తుండేవారు. అప్పటికి పాలస్తీనాలో సుమారు 25000 మంది యూదులు ప్రశాంతంగా అరబ్ ప్రజలతో కలిసి మెలిసి నివసిస్తుండేవారు. అరబ్బులు క్రైస్తవులలా యూదులపై దాడులు చేసేవారు కాదు. ప్రపంచమంతా శాంతి చిహ్నంగా భావించే ఆలివ్ మొక్కల్ని సాగు చేసే పాలస్తీనియన్ల సహజీవన సంస్కృతికి ఇది నిదర్శనం. తమ ఇంటికొచ్చిన అతిథుల్ని సాదరంగా స్వాగతించి, గౌరవించి, అవసరమైతే తమతోపాటు కలిసి బ్రతకడానికి సహకరించే ఉన్నత సంస్కారం వారి సంస్కృతిలో భాగం. కనుకనే యూదులు ఎలాంటి ప్రతిఘటనా లేకుండా పాలస్తీనాలో అన్ని వేల మంది స్థిరపడగలిగారు. ఆలివ్ చెట్లూ, దేవదారు చెట్లు లాగా అరబ్బులూ, యూదులూ పాలస్తీనా నేల మీద కలిసి బ్రతకగలిగారు.

1914-1918 మధ్య జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం ఈ ప్రాంతంలో కల్లోలానికి పునాది వేసింది. ఇదే యుద్ధం సామ్రాజ్యవాదుల మోసకారితనాన్ని కూడా బట్టబయలు చేసింది. యుద్ధంలో తమకు శత్రు పక్షంలో ఉన్న టర్కీని ఓడించడానికి, ఒకవైపు టర్కీ పాలనలో ఉన్న అరబ్బులకు స్వాతంత్ర్యం ఇస్తామని మక్కా షరీఫ్‌కి వాగ్దానం చేసి, వారి నుండి సైనిక మద్దతు పొందిన బ్రిటన్, బాల్ఫోర్ ప్రకటన ద్వారా పాలస్తీనాలో యూదు రాజ్యాన్ని ఏర్పాటు చేస్తామని ఆశ చూపి మరోవైపు యూదుల నుండి ఆర్థిక సహాయాన్ని కూడా పొందింది. సొంత మతస్థులైన తురుష్కులపై సైతం యుద్ధం ప్రకటించి, బ్రిటిష్ వారికి సహకరించిన పాలస్తీనియన్ల వైఖరి, వారి స్వాతంత్ర్యకాంక్షకు నిదర్శనం.

ప్రపంచ పెట్రోల్ నిల్వలకు – రవాణా మార్గాలకు, ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లకు కూడలిగా కీలక స్థానంలో ఉన్న పాలస్తీనాను వదులుకునే ఆలోచన బ్రిటిష్ వారికి లేనప్పటికీ, మోసపూరితంగా అన్ని వర్గాల మద్దతుకూడగట్టారు. ఈ యుద్ధంలో మిత్ర రాజ్యాలు విజయం సాధించడంతో ఒట్టోమాన్ సామ్రాజ్యం కూలిపోగా, 1916లో సైక్స్-పికాట్ ఒప్పందం ద్వారా తమ చిత్తం వచ్చినట్టుగా, రొట్టెను ముక్కలు చేసి పంచుకున్నట్టు బ్రిటన్ – ఫ్రాన్స్‌లు మధ్యప్రాచ్యాన్ని పంచుకున్నారు. ఈ పంపకంలో ఇటు యూదులను, అటు అరబ్బులను ఇద్దరినీ మోసం చేసి మ్యాండేటరీ విధానం పేరుతో, పాలస్తీనా ప్రాంత

భవితవ్యాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఇది బ్రిటిష్ సామ్రాజ్యవాదులు రాజేసిన కుంపటి. వారి కుటిల సంస్కృతికి నిదర్శనం.

యూదులను ఉద్ధరించాలని బ్రిటన్ నిజంగా భావిస్తే, విశాల భూభాగం కలిగి, తక్కువ జనాభా ఉన్న ఆస్ట్రేలియా, కెనడాలు అప్పటికి వారి అధికారంలోనే ఉన్నాయి. కానీ వారి అజెండా అది కాదు. పాలస్తీనా ప్రాంతపు భౌగోళిక, ఆర్థిక, సైనిక ప్రాధాన్యతను అర్థం చేసుకున్న బ్రిటన్, ఈ ప్రాంతంలో తమ ప్రయోజనాలు నెరవేరాలంటే, ఇక్కడ నిరంతర అశాంతి అవసరమనే నిర్ధారణకు వచ్చింది. అరబ్ ప్రపంచపు నడిమధ్యలో యూదు జాత్యాహంకారాన్ని ప్రతిష్ఠించడం ద్వారా అశాంతిని అదుపు చేసే పెత్తనం తమకు గ్యారంటీగా లభిస్తుందని భావించింది. అప్పటికే జన సమ్మర్దంగా ఉన్న పాలస్తీనాకు క్రమంగా వేల సంఖ్యలో, ఆ తర్వాత లక్షల సంఖ్యలో యూదులను చేర్చింది. ఈ వలసలు ఎంత భారీగా సాగాయంటే, ఆ దేశం భరించగల జనాభాను అంచనా వెయ్యడానికి జియోనిస్ట్ సంఘం వారే నియమించిన కాంప్బెల్ కమిటీ, "(1930లోనే) ఇప్పటికే యూదుల వలస వలన దేశం భరించలేని స్థాయికి చేరిందని" అభిప్రాయపడింది.

ఇలా వలస వస్తున్న యూదులకు బ్రిటిష్ ప్రభుత్వం బంజరు భూములను కట్టబెట్టడమేకాక, వ్యవసాయంపై ఆధారపడి బ్రతుకుతున్న పాలస్తీనీయులపై భరించ సాధ్యం కాని విధంగా భూమి శిస్తు విధించింది. చాలా సందర్భాలలో ఆ భూమిపై వచ్చే ఆదాయం కంటే, చెల్లించాల్సిన శిస్తే ఎక్కువగా ఉండేది. ఫలితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు – యూదు జాత్యహంకారులు కోరుకున్నట్టే పన్నులు చెల్లించలేని పాలస్తీనీయులు తమ భూముల్ని ఐనకాడికి తెగనమ్ముకున్నారు. ఈ భూముల్ని అప్పుడే వలస వస్తున్న యూదు ధనికులు కొనుగోలు చేయసాగారు. ఆ ప్రాంతంలో అప్పటికి ప్రధాన జీవనాధారమైన వ్యవసాయం ఆ విధంగా పాలస్తీనీయుల చేతుల్లో నుండి యూదుల చేతుల్లోకి మారింది. యూదులు, పాలస్తీనా శ్రామికులని కనీసం కూలికి కూడా పిలవకపోవడంతో, బ్రతుకుతెరువు కోసం అనేకమంది పాలస్తీనియులు వలసలు పోవడం ప్రారంభమైంది. తమ సోదరులు కానని దేశాలకు వలసలు పోతున్నా నిస్సహాయులుగా ఉండిపోయారు స్థానికులు. ఇలా పాలస్తీనియుల సంస్కృతిలో వలసలు ఒక భాగంగా మారిపోయాయి.

పాలస్తీనియులను వారి మాతృభూమి నుండి వెళ్ళగొట్టి, ఆ భూమిలో పాగా వెయ్యదలుచుకున్న యూదు జాత్యహంకారులు ఈ వలసలను మరింత వేగవంతం చేయడానికి బ్రిటిష్ పాలకుల మద్దతుతో మూకుమ్మడి దాడులకు పాల్పడేవారు. గ్రామాలకు గ్రామాలే నాశనం చేసేవారు. దీంతో పాలస్తీనియన్లు ఇరుగుపొరుగు అరబ్ ప్రజల మద్దతుతో 1936 నుండి తిరుగుబాటు చెయ్యడం ప్రారంభించారు. ఈ తిరుగుబాట్లను బ్రిటిష్ ప్రభుత్వం నిరంకుశంగా అణచివేసింది. శత్రువు తన పిల్లల్ని నిలువునా చీరేస్తూ ఉంటే, తీవ్రమైన హింసను భరిస్తూ బ్రతకడమా? – లేదంటే ప్రతిరోజూ నవ ఉషస్సును స్వప్నిస్తూ తిరగబడటమా? అనే స్థితికి శాంతిప్రియులైన పాలస్తీనావాసుల రోజువారీ జీవితం మారిపోయింది.

తిరిగి రెండవ ప్రపంచ యుద్ధంలో అరబ్బుల మద్దతు కోసం పాలస్తీనాను విభజించే ఆలోచనను విరమించుకున్నామనీ, భవిష్యత్తులో మరో 75 వేలమంది యూదులను మాత్రమే ఆ ప్రాంతంలోకి అనుమతిస్తామనీ, మరో పది సంవత్సరాలలో పాలస్తీనాకు స్వాతంత్ర్యం ఇస్తామనీ 1939లో ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది బ్రిటన్.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్ నియమించిన పీల్ కమిషన్, పాలస్తీనాలో విపరీతమైన వలసల తర్వాత పెరిగిన యూదు జనాభా దామాషా ప్రకారం, మొత్తం దేశంలో మూడవ వంతు భూమితో ఇజ్రాయెల్ దేశాన్ని ఏర్పాటు చేయాలనీ, లేదంటే యూదు–అరబ్ ప్రజల సమాఖ్య దేశంగా పాలస్తీనా ఉండాలని చేసిన రెండు ప్రత్యామ్నాయాలను జియోనిస్టులు తిరస్కరించారు. జనాభాలో మూడవ వంతు ఉన్న యూదులకు 56% భూమిని కేటాయించి దేశ విభజన చేయాలని ఐక్యరాజ్యసమితి 1948లో చేసిన అన్యాయమైన ప్రతిపాదనను పాలస్తీనియన్లు సహజంగానే అంగీకరించలేదు. కానీ యూదులు 1948మే 14న ఏకపక్షంగా 56% భూభాగంతో ఇజ్రాయిల్ దేశం ఏర్పడినట్లు ప్రకటించారు. 1956 యుద్ధంలో 78% భూమిని ఆక్రమించుకున్నారు. 1967 యుద్ధం తర్వాత మొత్తం దేశం ఇజ్రాయిల్ అధీనంలోకి వచ్చింది.

అప్పటి నుండి జియోనిస్టుల క్రూర హింసను భరించలేక లక్షలాది మంది దేశం వదిలి ఇరుగుపొరుగు దేశాలలో శరణార్ధి శిబిరాలలో దుర్భర జీవితం గడుపుతున్నారు. ఇలా వలసలు పోగా దేశంలో 21% అరబ్బు జనాభా మాత్రమే మిగిలారు. 1964లో ఏర్పడిన PLO (పాలస్తీనా విముక్తి సంస్థ) పోరాటం ఫలితంగా,1993లో నార్వే మధ్యవర్తిత్వంలో ఇరువర్గాల మధ్య కుదిరిన ఓస్లో ఒప్పందం మేరకు, గాజా, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాలను అతి పరిమిత అధికారాలతో పాలస్తీనా అథారిటీ నిర్వహించి, 2000 సంవత్సరానికి పూర్తి స్వయం ప్రతిపత్తి ఇవ్వాల్సి ఉంది. సుదీర్ఘ పోరాటాలతో అలసిన PLO, శాంతి కోసం, ఈ అవమానకరమైన ఒప్పందానికి కూడా అంగీకరించింది. కానీ తమ మాతృదేశంలో 90శాతం భూమిని యూదులు ఆక్రమించుకోగా మిగిలిన కొద్దిపాటి వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో కూడా లెక్కకు మిక్కిలిగా సెటిలర్స్‌ను ఇప్పటికీ చొప్పిస్తున్నారు. ఆ కొద్ది భూమిని కూడా వారికి నిషిద్ధ ప్రాంతంగా మార్చారు. గాజా ప్రాంతాన్నైతే అష్ట దిగ్బంధనం చేసి, ఒక ఓపెన్ జైలుగా మార్చేశారు.

సిరియా, జోర్డాన్, లెబనాన్, వెస్ట్ బ్యాంక్, గాజా ప్రాంతాలలో మొత్తం 68 శరణార్ధి శిబిరాలలో పాలస్తీనియన్లు నేడు బ్రతుకు లీడుస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో కలిసి వందలాది కిలోమీటర్ల దూరం కాలినడకనే ప్రయాణం చేసి, దారిలో ఎంతో మంది ఆప్తుల్ని పోగొట్టుకుంటూ చేరుకున్న ఈ శిబిరాలలో జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో తెలుసుకోవడానికి కొన్ని గణాంకాలు మనకు ఉపయోగ పడతాయి. సిరియాలోని 10 ఎకరాల విస్తీర్ణం కూడా లేని షటిలా శరణార్ధి శిబిరంలో 12 వేలమంది నివసిస్తున్నారు. ఈ శిబిరంపైనే 1983లో ఇజ్రాయిల్ కాల్పులు జరిపించి వందలాది మంది అమాయక పాలస్తీనియన్లను చంపించారు. సిరియాలోనే ఉన్న 7 ఎకరాల జరమానా

శరణార్థి శిబిరంలో సుమారు 50,000 మంది అభాగ్యులు తల దాచుకుంటున్నారు. ఈ శరణార్థులకు ఉపాధి ఏమీ ఉండదు. ఐక్యరాజ్య సమితి దాతృత్వం మీద ఆధారపడి, చాలీచాలని జీవితాలు గడుపు తుంటారు. మహిళలు, పిల్లలు, వృద్ధులను ఇలా పొరుగు దేశాలలో ఉన్న శరణార్థి శిబిరాలకు పంపించి, యువకులు పోరాటంలో కొనసాగుతూ ఉన్న ఈ దుర్భర పరిస్థితుల నేపథ్యంలో, హృదయ విదారకమైన ఇలాంటి పరిస్థితుల్లో, PLO సామరస్య ధోరణిని తిరస్కరిస్తూ పురుడు పోసుకున్నదే హమాస్ (ఇస్లామిక్ రెసిస్టన్స్ మూమెంట్). స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు తప్ప పాలస్తీనియన్ల జీవన్మరణ సమస్యకి మరొక పరిష్కారం లేదని, అందుకు సాయుధ పోరాటం మాత్రమే ఏకైక మార్గమని హమాస్ భావించింది. గర్భస్థ శిశువుల్ని గాజు పెంకులతో పెకలిస్తూ, మానవత్వం మీదనే దాడికి తెగబడ్డ యుద్ధోన్మాదాన్ని అంతం చేయడానికి, ఆ యుద్ధం పైనే యుద్ధం ప్రకటించారు. వాళ్ళు చేపట్టిన ఆలివ్ కొమ్మలు యూదు జాత్యహంకారుల చేత నేలరాల్చ బడిన తర్వాత, సాయుధ పోరాటాన్ని అక్కున చేర్చుకున్నారు.

శాంతిప్రియులుగా, సహజీవనం సాగిస్తున్న పాలస్తీనా ప్రజలు కేవలం వందేళ్ళు జీవించాలి అంటే పోరాడక తప్పని పరిస్థితుల వెనుక, దేశ విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేసే వీరులుగా తల్లిదండ్రులే తమ బిడ్డల్ని మలుస్తున్న చైతన్యం వెనక, వారు అనుభవిస్తున్న అమానుషమైన జీవితం ఉంది. తరువాతి తరాలకు మానవీయమైన భవిష్యత్తును ఇవ్వాలనే దృఢమైన పట్టుదల ఉంది. అందుకే పాలస్తీనా ప్రజలు తమ కాళ్ళ కింద నేల కోసం, తమ సౌభ్రాతృత్వపు సంస్కృతిని కాపాడుకోవటానికి పోరాట బిడ్డలను కంటున్నారు. ప్రజాస్వామికంగా పనిచేస్తూ, లౌకిక పంథాలో పోరాడుతున్న PLOకు వ్యతిరేకంగా తన మిత్ర దేశమైన ఖతార్ ద్వారా హమాస్‌కు గతంలో సహకరించిన ఇజ్రాయిల్, నేడు హమాస్ పోరాటం తనపై ఎక్కుపెట్టగానే గావుకేకలు పెడుతున్నారు. పాలస్తీనాలోని గాజా పట్టీ ప్రాంతంలో అధికారంలో ఉన్న హమాస్ తన ప్రజలపై జాతి హననానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్‌పై యుద్ధాన్ని ఎక్కుపెట్టింది.

ఐనప్పటికీ ఇదేమీ జాతుల ఘర్షణ కాదు. మతాల మధ్య సంఘర్షణ అంతకంటే కాదు. ప్రపంచవ్యాప్తంగా వేల మంది యూదులు పాలస్తీనియన్ల పక్షాన గొంతు విప్పుతున్నారు. నిన్నటికి నిన్న అమెరికాలోని యూదులు ఇజ్రాయిల్ జాత్యహంకార విధానాలకు నిరసనగా ప్రదర్శనలు నిర్వహించారు. ఇంగ్లాండ్, అమెరికా, మొత్తం యూరోప్‌లో పాలస్తీనాకు సంఘీభావంగా పనిచేస్తున్న యూదు సంస్థలు కూడా ఉన్నాయి. ఇజ్రాయిల్‌లోని లికుడ్ పార్టీ ప్రభుత్వ నిరంకుశ, ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరిస్తూ, ఉద్యమిస్తున్న యూదు ప్రజలు ఇజ్రాయిల్‌లోనే ఉన్నారు. గతంలో హిట్లర్ జాత్యహంకారానికి బలైన యూదులు, తిరిగి మరొక జాత్యహంకార సమాజంగా రూపొందటం వెనక అంతర్జాతీయ ఆర్థిక, సైనిక ప్రయోజనాల కనుగుణమైన వ్యూహాలు ఉన్నాయి. ప్రతి మతంలోనూ అనేక జాతుల ప్రజలు ఉన్నట్లే యూదులు కూడా అనేక జాతుల్లో ఉన్నారు. వారిని ఒకే దేశంగా ఏర్పాటు చేయడం వెనక, అదీ మధ్యప్రాచ్యంలో ఉంచడం వెనక, ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల పెట్టుబడిదారీ ప్రయోజనాలు నగ్నంగా బహిర్గతమౌతున్నాయి.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులచే సృష్టించబడి, అమెరికన్ సామ్రాజ్యవాదులచే పెంచి పోషించబడుతోంది యూదు జాత్యహంకారం. ప్రపంచంలో ధర్మాన్ని స్థాపించడానికి దేవుడు తమను ఎంచుకున్నాడని భావించే యూదుల నమ్మకం సంగతేమో కానీ, మధ్యప్రాచ్యంలోని ఆయిల్ సంపదలపై తమ పట్టు బిగించడానికి, దాన్ని ప్రతిఘటించే అరబ్బులను అణచి ఉంచడానికి ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదులు మాత్రం యూదు జాత్యహంకారాన్ని ఆయుధంగా ఎంచుకున్నారు. ప్రపంచ పీడిత ప్రజలతో కలిసి, యూదు జాత్యహంకారంతోపాటు సామ్రాజ్యవాదంతో కూడా పాలస్తీనా ప్రజలు మట్టు పెడితేనే ప్రపంచ శాంతి సాధ్యమౌతుంది.

# ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సౌమేందురాయ్ మరణం



**సత్యజిత్‌రాయ్** తీసిన చిత్రాలలో 21 చిత్రాలకు, నాలుగు డాక్యుమెంటరీలకు, ఒక లఘు చిత్రానికి కెమెరామెన్‌గా పనిచేసిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సౌమేందురాయ్ దక్షిణ కలకత్తాలో 27-9-2023న తన 90వ యేట మరణించారు. ఆయన 7-2-1933లో జన్మించారు.

ఆయన ట్రాలీ లైటింగ్ బాయ్‌గా చలనచిత్ర జీవితం ప్రారంభించారు. 1960లో సత్యజిత్‌రాయ్ తీసిన 'రవీంద్రనాథ టాగోరు' చిత్రంతో ప్రారంభమైన వారి బంధం రాయ్ చనిపోయేవరకు కొనసాగింది. 2000 సంవత్సరంతో సినిమాటోగ్రఫీకి స్వస్తి వాక్యం పలికినా, చివరివరకూ వివిధ చలనచిత్ర సంస్థల శిక్షణా కేంద్రాలలో అధ్యాపకునిగా వున్నారు. చాలాకాలం పాటు పశ్చిమబెంగాల్ సమాచార, సాంస్కృతిక మంత్రిత్వశాఖ వారి ఇండో ఇటాలియన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ 'రూప్‌కళా కేంద్రం'లోని సినిమాటోగ్రఫీ శాఖకు సలహాదారునిగా వున్నారు.

తపన్ సిన్హా 'ఏక్ డాక్టర్ కీ మౌత్', 'వీల్ చైర్', ఎం.ఎస్. సత్యు డాక్యుమెంటరీ 'ఇస్లాం ఇన్ ఇండియా' బుద్ధదేవ్‌దాస్ గుప్తా చిత్రానికి ఆయన సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు.

సహజసిద్ధమైన కాంతినుపయోగించి చిత్రీకరించిన ఆయన చిత్రాలకు 1974లో 'ఆసానీ సంకేత్'కూ, 1975లో 'సోనార్ కెల్లార్'కూ, 1977లో 'శత్రంజ్ కె ఖిలాడి' (చదరంగం ఆటగాళ్ళు) కథాచిత్రాలకు సినిమాటోగ్రఫీలో జాతీయ అవార్డులు అందుకున్నారు.

పుస్తక పరిచయం

# సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధం అమెరికా విదేశాంగ గూఢచారి సంస్థ సి.ఐ.ఏ!

– ఫ్రాన్సిస్ స్టోనర్ సాండెర్స్

పరిచయకర్త : **జి.వి. భద్రం**

**బ్రిటన్‌కు** చెందిన కథారచయిత్రి స్వతంత్ర సినీ నిర్మాత అయిన ఫ్రాన్సిస్ స్టోనర్ సాండెర్స్ డాక్యుమెంటరీ చిత్రాలను నిర్మించారు. ఆమె వ్రాసిన "బిగ్ థింగ్స్" అనే కథానిక 1998లో 'న్యూ రైటింగ్ 7' అనే పత్రికలో ప్రచురింపబడింది.

ఆమె "సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధం" అనే అంశంపై పరిశోధన జరిపారు. ఎంతో గొప్పగా పొగడబడే అమెరికా 'సమాచార స్వేచ్ఛా చట్టం' తనకు యీ పరిశోధనలో ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె భావించి, 1992లో ఆమె సి.ఐ.ఏ.కు చెందిన పాత డాక్యుమెంట్లను పరిశీలించటానికి అనుమతిని కోరుతూ దరఖాస్తు చేసుకొన్నారు. కానీ సి.ఐ.ఏ. తనకు ఆ దరఖాస్తు ముట్టినట్లు రశీదు యిచ్చినా, యీనాటి వరకూ కూడా ఆ సంస్థకు చెందిన డాక్యుమెంట్లను పరిశోధించటానికి ఆమెకు అవకాశం యివ్వలేదు. పైపెచ్చు సి.ఐ.ఏకు చెందిన సమాచార – ప్రైవసీ కోఆర్డినేటర్ ఆమె దరఖాస్తులోని కోరికను అంగీకరించే అవకాశాలే లేవని తేల్చి చెప్పాడు. దాంతో ఆమె అమెరికాలో గల వివిధ పట్టణాలలోని అనేక ప్రైవేటు లైబ్రరీలలోని వివరాలను అధ్యయనం చేసి, పలువురు వ్యక్తులతో ఇంటర్వ్యూలు జరిపి వివరాలు తెలుసుకొని, లండన్‌లోని పబ్లిక్ రికార్డ్స్ ఆఫీస్‌లోని రీడింగ్ యూనివర్శిటీ లైబ్రరీలోని పత్రాలను అధ్యయనం చేసి, తన పరిశోధనల సారాంశాన్ని "హు పెయిడ్ ది పైపర్ – ది సి.ఐ.ఏ అండ్ ది కోల్డ్ వార్" అనే గ్రంథాన్ని 1999లో ప్రచురించారు.

### కమ్యూనిజానికి వ్యతిరేకంగా రహస్య సాహిత్య, సాంస్కృతిక ప్రచారం

ప్రచ్ఛన్న యుద్ధం (సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా) తీవ్రంగా సాగుతున్న రోజుల్లో అమెరికా ప్రభుత్వం, పశ్చిమ యూరోపులో రహస్య సాంస్కృతిక ప్రచార కార్యక్రమాలు నిర్వహించటం కోసం అపారమైన ఆర్థిక మరియు ఇతర వనరులు చేకూర్చటానికి నిర్ణయించింది. ఈ రహస్య సాంస్కృతిక ప్రచార కార్యక్రమాన్ని అమెరికన్ గూఢచారి విభాగమైన సి.ఐ.ఏ తన ఏజెంట్ల ద్వారా, తన దర్శకత్వంతో, చాలా పట్టుదలతో 1950 నుండి 1967 వరకూ కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం (సాంస్కృతిక స్వేచ్ఛ కోసం కాంగ్రెస్) అనే ముసుగు సంస్థ పేరుతో నిర్వహించింది. ఈ ముసుగు సంస్థ భారతదేశంతో సహా 35 దేశాలలో తన రహస్య సాంస్కృతిక ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది. ప్రతిష్టాకరమైన 20 పత్రికలను ప్రచురించింది. చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించింది. వార్తల – ఫీచర్ల సర్వీసుల సంస్థను నెలకొల్పింది. భారీఎత్తున అంతర్జాతీయ మహాసభలు నిర్వహించింది. సంగీతకారులకూ, చిత్రకారులకు బహుమానాలు యిచ్చి మరీ ప్రదర్శనలను ఏర్పాటు చేసింది. పశ్చిమ యూరోపు దేశాలలోని మేధావి వర్గం మార్క్సిజం మరియు కమ్యూనిజాలపట్ల చూపిస్తున్న ఆరాధనా భావాన్నుండి వారిని దూరంగా తప్పించి వారి అభిప్రాయాలలో, దృక్పథాలల్లో "అమెరికన్ విధానాల – పద్ధతుల"కు తమ ఆలోచనల్లో స్థానాన్ని కల్పించేలా చేయటం అన్నదే యీ ప్రచ్ఛన్న సాంస్కృతిక ప్రచార కార్యక్రమాల లక్ష్యం. దీనినే ఆమె సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధంగా పేర్కొంటూ, యీ సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధానికి సంబంధించిన అనేక వివరాలను ఆమె యీ పుస్తకం ద్వారా ప్రపంచానికి వెల్లడించారు. ఈ పుస్తకంలో ఆమె సవివరంగా ఏ సి.ఐ ఏ ఏజెంటు దర్శకత్వంలో, ఏయే దేశాలలో, ఏ విధమైన కార్యక్రమాలు జరిగాయో అన్న వివరాలతోపాటు, ఆయా ఏజెంట్ల పుట్టు పూర్వోత్తరాలతో సహా వెల్లడించారు. వాటి సారాంశాన్ని యిప్పుడు తెలుసుకొందాం!

ప్రస్తుత తరాలవారు యీ వివరాలను తెలుసుకోవటం వలన, నేటి ప్రపంచ పరిస్థితులను అర్థం చేసుకోవటం ఎలాగో, ఆ పరిస్థితుల పట్ల, ఏవిధమైన వైఖరులు అవలంబించాలి! అనే ఒక సక్రమమైన అవగాహనను ఏర్పర్చుకోగల్గుతారు. 'అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛ' పేరిట, పాశ్చాత్య ప్రపంచం కోసం పశ్చిమ దేశాల్లో సి.ఐ.ఏ, ఎదురు లేకుండా, అతి రహస్యంగా నిర్వహించిన యీ పాశ్చాత్య సాంస్కృతిక ఫ్రంట్ యొక్క గుట్టుమట్టులను తెలుసుకొంటారు!

1947లో సి.ఐ.ఏ అధ్యక్షుడు ట్రూమన్ కాలంలో ఈ కార్యక్రమం ఏర్పాటయింది. దీని కర్తవ్యాలలో మొదటిటి ఒక కన్సోర్టియం (అసోసియేషన్)ను స్థాపించటం. ఆ కన్సోర్టియం కర్తవ్యం : ప్రపంచ మంతటికి కమ్యూనిజం మహమ్మారి సోకకుండా, టీకాలు వేయటం. రెండవ కర్తవ్యం : విదేశాలలోకి అమెరికా విదేశాంగ విధానపు ప్రయోజనాలు ప్రయాణించటానికి మార్గాలను సుగమం చేయటం. "విదేశీ గ్రూపుల యొక్క అభిప్రాయాలను, వైఖరులను, ఉద్వేగాలను, ప్రవర్తనలను, అమెరికా జాతీయ లక్ష్యాలను, ఉద్దేశ్యాలను బలపరచే విధంగా, అభిప్రాయాలను, భావాలను, సమాచారాన్ని వారికి ఒక పథకం ప్రకారం అందించటం" యీ ప్రచార కార్యక్రమాల కర్తవ్యంగా నిర్దేశించబడింది. వార్తల ద్వారా, ప్రత్యేక వాదనల ద్వారా, చర్చల ద్వారా లేదా విజ్ఞప్తుల ద్వారా ఆలోచనలను, ఆచరణను (వివిధ గ్రూపుల యొక్క) ప్రభావితం చెయ్యటమన్నది సి.ఐ.ఏ నిర్వహించిన ఈ "మానసిక (సైకలాజికల్) యుద్ధపు" లక్ష్యంగా కొనసాగింది.

అంతవరకూ జర్మనీలో 'డీ నాజిఫికేషన్' (నాజీతత్వాన్ని ఏరిపారి వేయటం), రీ ఓరియంటేషన్ లాంటి కార్యక్రమాలు చేబట్టిన మిత్ర రాజ్య బలగాల కూటమి, (జర్మనీలో అమెరికా సైన్యపు నాయకత్వంలో నిర్వహింపబడుతున్న సైనిక బలగాల కూటమి) క్రమక్రమంగా హిట్లర్ కాలం నాటి పారిశ్రామికవేత్తలను, శాస్త్రజ్ఞులను, పరిపాలనాధికారులను, ఉన్నతాధికారులను జర్మనీ కుప్పకూలిపోకుండా వుండటం అనే పేరిట, తిరిగి వారిని పునర్నియమించటం (1947లో) ప్రారంభమయింది. అదేవిధంగా నాజీ సంగీతవేత్తలకు కూడా తిరిగి గుర్తింపు ఇచ్చారు. అమెరికన్‌ల ఆధ్వర్యంలో వున్న మిత్రరాజ్యాల కంట్రోల్ కమిషన్ చేబట్టిన యీ వైఖరి వలన ఫాసిజాన్ని సహించటం మాత్రమే కాకుండా, దీన్ని (ఈ సహనాన్ని) కమ్యూనిజానికి వ్యతిరేకంగా ఉపయోగించే వైఖరిని అమెరికా చేబట్టింది. ఆ విధంగా అమెరికా సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధాన్ని ప్రారంభించింది.

## సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధం నాటి పరిస్థితులు

అమెరికా ప్రభుత్వం సి.ఐ.ఏ ద్వారా యిటువంటి సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధం సాగించటానికి ఆనాటి పరిస్థితులను అర్థం చేసుకోవలసి వుంటుంది. 1947 నాటికి హిట్లరు ప్రచారం చేసిన నాజీయిజంను ఓడించినందుకు ప్రపంచమంతటా ప్రత్యేకించి పశ్చిమ యూరోపు దేశాల్లోని వారంతా స్టాలిన్‌ను మెచ్చుకొంటున్నారు. స్టాలిన్‌గ్రాడ్ ఉదంతంతో స్టాలిన్ పట్లా  కమ్యూనిజం పట్లా  ఆకర్షితులయ్యారు. అమెరికా మిత్రరాజ్యాల కూటమి తన ఘనత గురించి (నాజీయిజంను ఓడించటంలో) ఎంతగా పొగడుకుంటున్నా పెద్దగా దానిని ఎవ్వరూ పట్టించుకోవటల్లేదు. లెక్కపెట్టడం లేదు. మరోవైపు పశ్చిమ యూరోపు దేశాలైన ఫ్రాన్సు, ఇంగ్లండ్, జర్మనీ, ఇటలీలోని మేధావులు, విద్యావంతులూ, రచయితలూ, చిత్రకారులూ, కళాకారులూ, విద్యావేత్తలూ, అమెరికాని సంస్కృతి శూన్యమైన బంజరుభూమిగా పరిగణిస్తున్నారు. అమెరికా సంస్కృతిని వస్తుపరమైన సంస్కృతిగా పరిగణిస్తున్నారు. "మనకు (పశ్చిమ దేశాలవారికి) నైపుణ్యం, తెలివితేటలు వున్నాయి. వాళ్ళకు (అమెరికా) డబ్బు వుంది" అని ఎగతాళి చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో 1947లో 'అంటర్ డెన్ విండెన్' (జర్మనీలో)లో, సోవియట్ యూనియన్‌వారు 'హౌస్ ఆఫ్ కల్చర్' అనే సాంస్కృతిక ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించారు. ఈ ఇన్‌స్టిట్యూట్, విశాలమైన ప్రజానీకంలో రష్యన్లు నాగరికులు కాదు అనే దురభిప్రాయాన్ని పటాపంచలు చేసింది.

ఇందుకు ప్రతిగా అమెరికన్లు అమెరికా - హౌసర్‌ను ప్రారంభించటంతోపాటు అమెరికా సంస్కృతికి చెందిన ఔట్‌పోస్టులను ఏర్పాటుచేశారు. సౌకర్యవంతమైన రీడింగ్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. సినిమాలు చూపించారు. అమెరికా సంస్కృతిపై అతిగా నొక్కి వక్కాణిస్తూ చర్చలు నిర్వహించారు. చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. అమెరికా ప్రచురించిన పుస్తకాలను అక్కడ (జర్మనీలో) పంచారు.

1949 మార్చి 25న, న్యూయార్కు నగరంలోని వాల్డ్‌రోఫ్ ఆస్టోరియా హోటల్‌లో "ప్రపంచ శాంతికోసం సాంస్కృతిక మరియు శాస్త్రీయ మహాసభ" జరిగింది. ఈ మహాసభకు వేలాదిమంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ మహాసభ కోమిన్‌ఫోరమ్ చొరవతో, కళల - శాస్త్రాల - వృత్తుల జాతీయ కౌన్సిల్‌ను నిర్వహించింది.

అమెరికాలోని మితవాద మిత్రకూటమి అయిన అమెరికన్ లీజియన్ (సైన్య విభాగం), కేథలిక్కుల గ్రూపులు మరియు దేశభక్త (అమెరికా) సొసైటీల కూటమి ఆధ్వర్యాన, యీ మహాసభ ప్రాంగణం వద్దే, యీ మహాసభకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపారు. క్రైస్తవ కన్యలు (నన్స్) యిక్కడ పికెటింగ్ చేస్తూ, ఆ మహాసభలో పాల్గొనే వ్యక్తుల ఆత్మల కోసం ప్రార్థనలు జరిపారు. సాతాను యొక్క (కమ్యూనిజం యొక్క) మరులు (మోహపూరిత ఆకర్షణ) నుండి వారిని రక్షించమంటూ ఆ మహాసభ వద్ద ఆ మత కన్యలు తమ నిరసనను తెలియచేశారు. ఆ మహాసభను భగ్నం చేయటానికి, మితవాద అభివృద్ధి నిరోధకులైన కమ్యూనిస్టు ఫ్రంటులను బహిర్గత పరచటానికి గతకాలపు మార్క్సిస్టులూ, ట్రాట్స్కీయిష్టులూ కూడా సభాప్రాంతానికి చేరుకొన్నారు. యీ మహాసభ కార్యక్రమాన్ని భగ్నం చేయటం కోసం వారు ఆ మహాసభలో ప్రతినిధులుగా అన్ని రోజులూ పాల్గొంటూనే ఒక అంతర్జాతీయ పోటీ అడ్‌హాక్ కమిటీని ఏర్పాటుచేశారు. ఆ కమిటీవారు, రచయిత టి.ఎస్. ఎలియట్, తత్వశాస్త్రవేత్త బెర్ట్రండ్ రస్సెల్, నోబుల్ ప్రైజ్ విజేత డాక్టరు ఆల్బర్ట్ షెవీట్జర్ లాంటి ప్రముఖులను తమ సభ్యుల జాబితాలో చేర్చుకొన్నారు.

ఈ కాన్ఫరెన్సును వ్యతిరేకిస్తూ రచయిత టి.ఎస్. ఎలియట్ ఒక టెలిగ్రాం పంపాడు. జాన్ డాస్ పాసోస్ ఒక టెలిగ్రాం పంపుతూ అమెరికన్ ఉదారవాదులను, సోవియట్ దేశం యొక్క నిరంకుశత్వాన్ని బట్టబయలు చేయవల్సిందిగా కోరాడు. అందువలన నిరంకుశత్వం తానున్న స్థానంలోనే ధ్వంసమవుతుందనీ చెప్పాడు. ఒకప్పుడు "కమ్యూనిస్టు వ్యతిరేకత అన్నది 20వ శతాబ్దపు మౌలికమైన అవివేక మూర్ఖత్వం (స్టుపిడిటీ)" అని వ్యాఖ్యానించిన థామస్ మాన్ మాత్రం ఆ మహాసభను బలపరుస్తూ ఒక కేబుల్ పంపాడు.

వార్తాపత్రికాధిపతులు తమ పత్రికల సంపాదకులను ఆ మహాసభను కమ్యూనిస్టు మహాసభగానూ, దానిలోని అమెరికా దేశపు సహ ప్రయాణీకులనూ తెగనాడమని ఆదేశించారు. 'లైఫ్' పత్రిక ప్రముఖులైన కొందరు అమెరికన్లను క్రెమ్లిన్ యొక్క డ్యూప్‌లు (వంచకులు - మారు మనుషులు)గా పేర్కొంటూ 50 మంది ఫొటోలను ప్రకటించింది. వారిలో ఆర్థర్ మిల్లర్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, చార్లీఛాప్లిన్, మార్లన్ బ్రాండోలాంటివారున్నారు. వీరందరూ కమ్యూనిజాన్ని ప్రచారం చేసారని ఆ పత్రిక ఆరోపించింది.

అమెరికా అంతర్గత నిఘాశాఖ ఎఫ్.బి.ఐ. (ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్) యీ మహాసభలోకి తన ఏజెంట్లను పంపించింది. మహాసభ ముగిసిన అనంతరం ఎఫ్.బి.ఐ ఏజెంటు, హోవార్డు ఫాస్టు కొత్త నవల 'స్పార్టకస్'ను ప్రచురించవద్దని, ప్రచురణ సంస్థలైన లిటిన్, బ్రౌన్‌లను హెచ్చరించింది. ఆఖరుకు నవలను హోవార్డు ఫాస్టే స్వయంగా 1950లో ప్రచురించుకోవాల్సి వచ్చింది.

అనేక పత్రికా ప్రకటనల ద్వారా, ఆ మహాసభలో మాట్లాడిన వక్తలను, ప్రతినిధులను, ఆ మహాసభ స్పాన్సరర్లను తమను తాము "కమ్యూనిస్టుపార్టీ సభ్యులుగానూ లేదా కమ్యూనిస్టు పార్టీ సహ ప్రయాణీకులుగానూ ప్రకటించుకోవాలంటూ" సవాలు చేశారు.

ఈ రకంగా ఆ మహాసభ సి.ఐ.ఏకు సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధం చేయటానికి అవకాశంగా మారింది. బ్రిటిష్‌వారు (ప్రభుత్వం) ప్రారంభించిన ఇన్ఫర్మేషన్ అండ్ రిసెర్చి డిపార్టుమెంటు కూడా, కమ్యూనిస్టు సూత్రాలపైనా, కమ్యూనిజం యొక్క ఆచరణ పైనా దాడిచేయటానికి ఏర్పాటు చేయబడిందే!. ఈ సంస్థ కూడా సి.ఐ.ఏతోపాటు "మానసిక యుద్ధాన్నీ", "సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధాన్నీ" రహస్యంగా నిర్వహించటం కోసం తోడయింది. ఈ సి.ఐ.ఏ సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ నిర్వహణకు నాయకత్వం వహించినవాడు భవిష్యత్తులో అమెరికా దేశపు స్టేట్ కార్యదర్శి అయిన జాన్ ఫాస్టర్ డల్లెస్ యొక్క సోదరుడు అల్లెన్ డల్లెస్. ఇతడే యీ యుద్ధం యొక్క వ్యూహాన్ని రూపొందించాడు.

## సి.ఐ.ఏ (సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ) కురిపించిన నిధులు

కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం ద్వారా, సి.ఐ.ఏ నిర్వహించిన అన్ని సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యకలాపాలకూ నిధులను సి.ఐ.ఏ.నే సమకూర్చింది. మార్షల్ పథకం ప్రకారం కేటాయించబడ్డ (మానసిక యుద్ధం నిర్వహించటం కోసం) నిధులు, పెంటగాన్ (అమెరికా దేశపు దేశరక్షణా విభాగం) యొక్క నిధుల నుండీ సమకూర్చుకొన్న నిధులను సి.ఐ.ఏ. రహస్య పద్ధతుల ద్వారా, ఫోర్డు, రాక్‌ఫెల్లర్, కార్నిగె ఫౌండేషన్ల ద్వారానూ, తానే స్వయంగా ఏర్పాటుచేసిన బూటకపు (డమ్మీ) ఫౌండేషన్ల ద్వారా సరఫరా చేసింది. అలా ఏర్పాటుచేయబడ్డ బూటకపు ఫౌండేషన్లలో ఫార్ ఫీల్డు ఫౌండేషన్ ప్రధానమయినది. దీన్నేకాక గోధమ్ ఫౌండేషన్, మిచిగాన్ ఫండ్ ప్రైస్ ఫండ్, ఎడ్‌సెల్ ఫండ్, ఆంద్రూ హేమిల్టన్ ఫండ్, బోర్డెన్, బీకన్ ఫండ్, కెంట్ ఫీల్డు ఫండ్, కోల్డ్ ఫౌండేషన్, ఫ్లోరెన్సు ఫండ్, ల్యూసియస్, ఎన్. విట్టయర్ ఫండ్, రోంథెలిమ్ ఛారిటబుల్ ట్రస్ట్, షెల్టర్ రాక్ ఫౌండేషన్, సోనా బెండ్ ఫౌండేషన్, సున్నెన్ ఫౌండేషన్ లాంటి డమ్మీ ఫౌండేషన్లను నెలకొల్పింది. అంతేకాక న్యూయార్క్‌లోని అమెరికన్ ఫండ్ ఫర్ ఫ్రీ జ్యూరిస్ట్సు ఇంక్, ది బైయార్డ్ ఫౌండేషన్, కప్లాన్ ఫండ్ లాంటి ఫౌండేషన్లకు తన మద్దతును యిచ్చి, కప్లాన్ ఫండ్ ద్వారా సి.ఐ.ఏ మధ్య తూర్పు ఆఫ్రికా దేశాల్లో తాను నిర్వహించిన కార్యకలాపాలకు నిధులను అందజేసింది. 170 ఫౌండేషన్ల ద్వారా నిధులను, పలు కార్యక్రమాలకు అందజేసింది.

తన సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఏజెంట్లను, కార్యకర్తలను సి.ఐ.ఏ. పునః ప్రతిష్టించబడ్డ నాజీల నుండీ, వ్యక్తిగత లేదా సైద్ధాంతిక కారణాల చేత కమ్యూనిస్టుపార్టీని వదలి వచ్చేసిన సభ్యుల నుండీ, పార్టీ క్రమశిక్షణలో ఇమడలేక బయటకు వచ్చిన కమ్యూనిస్టుపార్టీ సభ్యుల నుండీ, వివిధ కారణాల చేత కమ్యూనిస్టుపార్టీ నుండి బహిష్కరింపబడిన సభ్యుల నుండీ, సోవియట్ యూనియన్ లేదా తూర్పు యూరోపు దేశాలలోని కమ్యూనిస్టు ప్రభుత్వాలు తమకు గతకాలపు ప్రత్యేక సౌకర్యాలను, ప్రత్యేక హక్కులు నిరాకరించటంతో విదేశాలకు పారిపోయిన 'వలస'దారుల నుండీ, దేశ బహిష్కరణకు గురయిన కమ్యూనిస్టు దేశాల వ్యక్తుల నుండీ, ట్రాట్స్కీయిస్టుల నుండీ ఎంపిక చేసుకొంది.

ఈ ప్రచ్ఛన్న సాంస్కృతిక యుద్ధం ప్రధానంగా కమ్యూనిస్టేతర వామపక్షాలైన సోషలిస్టు పార్టీ, సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు చెందిన మేధావులను, రచయితలను, సంగీతకారులనూ, కళాకారులనూ, ఆకర్షించటం తన లక్ష్యంగా పెట్టుకొంది. అదే సందర్భంలో కమ్యూనిస్టు సిద్ధాంతాలతోపాటు, తటస్థ విధానం అవలంబించే – అటు కమ్యూనిస్టు భావజాలాన్ని గానీ, యిటు పెట్టుబడిదారీ దేశాల భావజాలానికి గానీ మద్దతు యివ్వకుండా తటస్థవాదాన్ని నిశితంగా విమర్శించటం, తెగనాడటం అన్నది ఒక ముఖ్య కర్తవ్యంగా పెట్టుకొంది.

1949లో న్యూయార్క్‌లో కోమిన్‌ఫారం చొరవతో నిర్వహించిన ప్రపంచశాంతి మహాసభలో పాల్ రోబ్సన్ పాట పాడటం, ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో శాంతి పావుర చిహ్న చిత్రాన్ని ఎగురవేయటం, చార్లీ ఛాప్లిన్ ఆ మహాసభకు సందేశాన్ని పంపించటం, ఫ్రెంచి అణుశక్తి కమీషనర్ జోలియట్ క్యూరీతోపాటు ప్రముఖ అమెరికన్ రచయిత హోవార్డు ఫాస్టు, డెనిష్ రచయిత మార్టిన్ ఆండర్సన్, ఇటాలియన్ సోషలిస్టు పీయటోనెన్నీ లాంటి ప్రభృతులు పాల్గొనటం వలన, ఆ మహాసభ కమ్యూనిస్టు శాంతి ఉద్యమానికి ఒక ప్రతిష్టాత్మక గుర్తింపు వచ్చింది.

ఇందుకు పోటీగా సి.ఐ.ఏ. మద్దతుతో 1949 ఏప్రియల్ 30న ప్యారిస్‌లో "నిరంకుశత్వానికీ, యుద్ధానికీ అంతర్జాతీయ ప్రతిఘటనా దినం" నిర్వహించబడింది. దీనికి అమెరికన్ రచయిత అప్టన్ సింక్లైర్ లాంటి పలువురు ప్రముఖులు తమ మద్దతు సందేశాలను పంపారు. ఈ మహాసభ ప్రముఖమైన స్టాలిన్ వ్యతిరేకులను ఆకర్షించినా, ఫ్రాన్సు దేశపు ప్రజల్లో అమెరికా దేశపు జీవన విధానం, సంస్కృతుల పట్ల గల వ్యతిరేకతను చులకన భావాన్ని తగ్గించలేకపోయింది.

బెర్టోల్ట్ బ్రెష్ట్, ఆల్బర్ట్ కామూ, జీన్ పాల్‌సాత్రేల అభిప్రాయాలు బలంగా వుండటం వల్లనే పశ్చిమ ఐరోపా దేశాల్లోని మేధావులు, కళాకారులు అమెరికా ప్రజల జీవన విధానం, ఆలోచనలు, సంస్కృతుల పట్ల ఆకర్షింపబడలేదు.

అటువంటి తరుణంలో ఒక జర్మన్ మేధావుల బృందం, న్యూయార్కులో జరిగిన మహాసభకు వ్యతిరేకమైన ఒక పెద్ద మహాసభను బెర్లిన్‌లోనే జరపాలని నిర్ణయించారు. ఆ వ్యతిరేక మహాసభ మాజీ కమ్యూనిస్టులు, స్టాలిన్ వ్యతిరేకులైన అమెరికన్, బ్రిటిష్, యూరోపియన్ మేధావులతో కూడినదై వుండాలని నిర్ణయించారు. వారు టిటోకు, యుగోస్లోవేకియాకు తమ సానుభూతిని ప్రకటించాలని కూడా నిర్ణయించారు. ఇందుకు సి.ఐ.ఏ. ఆమోదాన్ని తెల్పటమే కాక ఇందుకుగాను 50,000 డాలర్లు బడ్జెట్టు కూడా కేటాయించారు. ఆ మహాసభనే కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడంగా పిలవాలని నిర్ణయించారు.

ఆ మహాసభకు హాజరుకావాల్సిందిగా జీన్ పాల్ సాత్రేను కోరగా, అందుకు ఆయన నిరాకరించాడు. ఆ "సాంస్కృతిక స్వేచ్ఛ కోసం కాంగ్రెసు" ఎంతో ఆడంబరంగా 4000 మంది ప్రేక్షకుల ముందు జూన్ 26, 1950న ప్రారంభించబడింది. ఆ కాంగ్రెస్‌కు అమెరికా నుండి, ఇంగ్లండ్ నుండి, ఫ్రాన్సు నుండి, ఇటలీ నుండి ప్రతినిధులు హాజరయ్యారు. తర్వాతి నాల్గురోజుల్లోనూ విదేశీ ప్రతినిధులను బ్రాడెన్ బర్గ్‌గేట్, పాట్సడామర్ ప్లాజా లాంటి ప్రాంతాలకు విహారయాత్రకు తిప్పారు. ప్రెస్ కాన్ఫరెన్సులకు తీసుకెళ్ళారు. కాక్‌టైల్ పార్టీలకు తీసుకు వెళ్ళారు. వారికోసం ప్రత్యేకంగా సంగీత కచేరీలు ఏర్పాటుచేశారు. ఈ సభను ప్రారంభించిన సందర్భంలో బెర్లిన్ ఫిల్ హార్మోనిక సంగీత

బృందం ఎగ్ మాంట్ ప్రస్తావన సంగీతాన్ని వాయించింది. ఈ మహాసభలో ప్రధానంగా "సైన్సు మరియు ఏకాధిపత్య నియంతృత్వ వాదం (టోటలిటేరియనిజం)", "కళలు, కళాకారులు, స్వేచ్ఛ", "స్వేచ్ఛాసమాజంలో పౌరుడు", "స్వేచ్ఛా ప్రపంచంలో స్వేచ్ఛా సంస్కృతి" అన్న అంశాలపై చర్చలు జరిగాయి. సభలు ముగించే సందర్భంలో 'స్వేచ్ఛా ప్రణాళిక' పేరిట ఆ సంస్థ యొక్క నూతన ప్రణాళిక ప్రకటించబడి, ఆమోదించబడింది. సాంస్కృతిక స్వేచ్ఛ కోసం కాంగ్రెసు యొక్క నైతిక, తాత్విక పునాదిరాయిగా యీ ప్రణాళికను పేర్కొన్నారు. మేధోపరమైన స్వేచ్ఛ అన్నది మానవుని యొక్క అన్యాక్రాంతం చేయవీలులేని, తిరుగులేని హక్కు అంటూ ఆ ప్రణాళిక ప్రకటించింది. ఆ సంస్థ, అమలులో వున్న స్వేచ్ఛలను పరిరక్షిస్తుందనీ, కోల్పోయిన స్వేచ్ఛలను తిరిగి సాధిస్తుందనీ ఆ ప్రణాళిక ప్రకటించింది.

## కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం (సాంస్కృతిక స్వేచ్ఛ కోసం కాంగ్రెస్) కార్యక్రమాలు

ఈ సంస్థ యొక్క ప్రధాన కార్యాలయాన్ని బెర్లిన్ నుండి మార్చి ప్యారిస్‌లో నిర్వహించటానికి సి.ఐ.ఏ. నిర్ణయం చేసింది. అంతేకాక యీ కాంగ్రెస్‌ను అమెరికన్ కార్మిక సమాఖ్య ప్రతినిధి అయిన టోంబ్రాడెన్ తన స్వాధీనంలోకి తీసుకొంటాడనీ, ఆ రకంగా దానిని కార్మికసంఘాలు తీసుకొన్నాయనే అందమైన ముసుగును కప్పాలనీ నిర్ణయించింది.

ఈ కాంగ్రెసు యొక్క వాస్తవ లక్ష్యాలను ఇలా వెల్లడించారు. అది ఆందోళనలు జరిపే కేంద్రం కాదనీ, కానీ పశ్చిమ యూరోపులో కమ్యూనిస్టు భావజాలం ముందుకు సాగకుండా నిరోధించే బలగాలతో నింపబడిన కోట అనీ తెలియజేశారు. ఈ కాంగ్రెసు మేధావులపై తోటి మేధావులు వారిని కమ్యూనిస్టు ప్రజాసంఘాల నుండీ, వాటి సహచర ప్రయాణ సంస్థల నుండి తమకున్న సంబంధాలను విడదీసు కోవటానికి ఒత్తిడి చేసి, ఒప్పించే విస్తృతమైన, కలిసికట్టు బంధనంతో కూడిన ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ సంస్థ ప్రజాబాహుళ్యం కోసం కాక, ఒత్తిడి తెచ్చే కులీన బృందాలు, రాజనీతిజ్ఞుల కోసం అవసరమైన సిద్ధాంతాలనూ, వాదనలను రూపొందించే మేధావులకు ప్రోత్సాహం యివ్వటం ద్వారా ఆయా గ్రూపులు ప్రభుత్వ విధానాలు నిర్ణయించేవాటిగా చేయాలి. ఆ కాంగ్రెస్ అమెరికన్ విదేశాంగ విధానానికి 'స్వతంత్రంగా' మద్దతునివ్వాలనీ, నాటోలో సభ్యత్వం ద్వారా ఒక ఐక్య యూరోపు ఏర్పాటు లక్ష్యానికీ, తిరిగి ఐక్యపరచబడే జర్మన్ యూరోపియన్ ఉద్యమానికి స్వతంత్రంగా మద్దతునివ్వాలనీ, ఈ కాంగ్రెస్ సాంస్కృతికంగా అమెరికా సాధించిన విజయాలకు రహస్య ప్రతినిధిగా వుండాలనీ, అమెరికాకు వ్యతిరేకంగా యూరోపులో వున్న అభిప్రాయాలను నిర్లక్ష్యం చేసే పనిని చెయ్యాలి. అమెరికా ప్రజాస్వామ్య పౌరహక్కుల రికార్డుకు వ్యతిరేకంగా చేసే విమర్శలను ఆ కాంగ్రెస్ త్రిప్పికొట్టాలని సి.ఐ.ఏ నిర్దేశించింది. ఈ అంతర్జాతీయ సంస్థకు అనుబంధంగా జర్మనీ, ఇంగ్లండ్, స్వీడన్, డెన్మార్క్, ఐస్‌లేండ్, జపాన్, అర్జెంటైనా, చిలీ, ఆస్ట్రేలియా, లెబనాన్, మెక్సికో, ఉరుగ్వే, పెరూ, కొలంబియా, బ్రెజిల్, పాకిస్తాన్, మరియు ఇండియాలలో తన కార్యాలయాలను తెరచింది. మనదేశంలో లోక్‌నాయక్‌గా చెప్పబడే సోషలిస్టు పార్టీ నాయకుడు జయప్రకాష్ నారాయణ, మినూమసానీ, కె.కె.షా లాంటి నాయకులు ఈ కాంగ్రెస్ సంస్థకు నాయకత్వం వహించారు. బెర్ట్రండ్ రస్సెల్ అంతర్జాతీయ కాంగ్రెసుకు గౌరవాధ్యక్షుడిగా పనిచేశాడు.

ఫ్రాన్సులో, ఈ కాంగ్రెస్ తన మొట్టమొదటి అధికార పత్రిక 'పూదె' (రుజువు)ను ప్రారంభించింది. బ్రిటన్‌లో 'ఇరవయ్యవ శతాబ్దం' అనే పత్రికను ప్రారంభించింది. 'ఎన్‌కౌంటర్' పత్రికను 1953 నుండి 1990 వరకూ నడిపింది. దీన్ని ఇంగ్లండ్, అమెరికా, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో చదివేవారు. జయప్రకాష్ నారాయణ్, బెర్ట్రండ్ రస్సెలు లాంటివారు యీ పత్రికలో వ్యాసాలు వ్రాశారు. అదేవిధంగా 'హొరైజాన్', 'ది లండన్' మేగజైన్ పత్రికలను నడిపింది. లాటిన్ అమెరికన్ మేధావుల కోసం 'క్యూడెర్నోస్' పత్రికను నడిపింది. వియన్నాలో 'ఫోరం' పత్రికను నడిపింది. 'సోవియట్ సర్వే' పత్రికను ప్రారంభించింది. ఇటలీ మేధావుల కోసం (కమ్యూనిస్టు పార్టీని వదలి వచ్చిన వారికోసం) 'టెంపో ప్రెసెంట్' పత్రికను నడిపింది. ఆస్ట్రేలియాలో 'క్వాడ్రాంట్' పత్రికను నిర్వహించింది. భారతదేశంలో 'క్వెస్ట్' పత్రికను నడిపింది. జపాన్‌లో 'ఓయు' పత్రికను నడిపింది. అరబిక్‌లో 'హివార్' పత్రికనూ, ఉగాండాలో 'ట్రాన్సిషన్' పత్రికనూ ప్రచురించింది. 'లండన్ సెన్సార్‌షిప్' పత్రికను నడిపింది. ఫోర్డు ఫౌండేషన్ ద్వారా 'డెర్‌మొనంట్' పత్రికను నడిపింది. 'ప్రెయూవ్స్', 'ఎన్‌కౌంటర్, డెర్‌మొనంట్' పత్రికలు ఈ కాంగ్రెస్‌కు మణిమకుటాలుగా భాషించాయి. అవి రెండు పురాతన దేశాల స్వేచ్ఛాయుత, మానవీయ, అంతర్జాతీయ ప్రజాస్వామిక మార్పిడి సంస్కృతికి ప్రతీకలుగా కొనియాడారు.

సి.ఐ.ఏ కనీసంగా వెయ్యి పుస్తకాల ప్రచురణలో జోక్యం కల్పించుకొంది అని 'న్యూయార్కుటైమ్స్' 1977లో బహిర్గత పరచింది. కాంగ్రెస్ ఫర్ ఫ్రీడం లేదా దాని అనుబంధ సంస్థల ద్వారా కమ్యూనిస్టు సోవియట్ వ్యతిరేకమైన అనేక నవలలను ప్రచురించింది. టి.ఎస్. ఇలియట్ వ్రాసిన 'ఫోర్ క్వార్టెట్స్' కవితలను తర్జుమా చేయించి, వాటి కాపీలను సోవియట్ రష్యాలో విమానం ద్వారా వెదజల్లింది సి.ఐ.ఏ. 1948లో అమెరికా దేశపు గూఢచారి వర్గాలవారు, కమ్యూనిస్టు వ్యతిరేకిగా భుజకీర్తులు పొందిన కోఎజ్లర్ వ్రాసిన 'డార్క్‌నెస్ ఎట్ నూన్' (మధ్యాహ్నంవేళ అంధకారం) అనే పుస్తకం 50,000 కాపీలను కొనుగోలు చేసి వాటిని అమెరికా దేశపు విదేశాంగ కార్యాలయం ద్వారా పంచిపెట్టారు. గూఢచారి (అమెరికన్) శాఖ ద్వారా ఉత్పత్తి చేయబడిన 'ది గాడ్ దట్ ఫెయిల్డ్' (విఫలమైన భగవంతుడు) అనే పుస్తకాన్ని హమీష్ హేమల్టిన్ ప్రచురణ సంస్థ ద్వారా ప్రచురింపజేసి, అమెరికా ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా యూరోప్ అంతటా పంపకం చేశారు.

మరోవైపు ఫోర్డు ఫౌండేషన్ 1952లో అంతర్జాతీయ ప్రచురణల కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'పరస్పెక్టివ్' అనే పత్రికను ప్రారంభించింది. ఈ పత్రిక ఫ్రాన్సు, ఇంగ్లండ్, ఇటలీ, జర్మనీలలో గల కమ్యూనిస్టేతర వామపక్షవాదులను ఉద్దేశించినట్టిది. ఈ పత్రికను ఆయా దేశాలకు చెందిన అన్ని భాషలలోనూ ప్రచురించింది.

అమెరికా ప్రభుత్వం అమలుజరుపుతున్న 'మానసిక యుద్ధం' యొక్క ఘోరం ఎంతకు దిగజారిందంటే, రెండవ ప్రపంచ యుద్ధంలో దేశద్రోహ నేరారోపణకు గురైన ఏకైక అమెరికన్ దేశస్థుడైన, ముస్సోలినీకి చెందిన మిన్‌కుల్‌పాప్ ద్వారా అమెరికన్ అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ 'మిస్టర్ జ్యూస్‌వెల్ట్', 'ఫ్రాంకిన్ ఫింకెల్ స్టీన్ రూజ్వెల్ట్', 'స్టింకీ రూజెన్‌స్టీన్' అంటూ పేర్లుపెట్టి ఎగతాళి చేసారు. 'మీన్ కాంఫ్' రచయిత హిట్లర్ 'చరిత్రను చాలా సునిశితంగా విశ్లేషించాడనీ', అతడు జోన్ ఆఫ్ ఆర్క్ సంప్రదాయానికి చెందిన ఒక రుషి, మృతవీరుడూ' అంటూ పొగిడిన ఎజ్రాపౌండ్‌కు 1949లో కవిత్వానికిగాను బొలింజెన్ బహుమతి ఇచ్చారు. ఆ సందర్భంగా 1930 నుండీ కొనసాగుతున్న కళలు – రాజకీయానికీ మధ్య జరుగుతున్న వివాదాన్ని మరోసారి రేకెత్తించింది. ఈ బహుమతి యివ్వడాన్ని బట్టి, స్వేచ్ఛాయుత కళలు, అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛ నినాదాలమాటున, వాటిని అమెరికాదేశపు రాజకీయ సేవలకు ఎలా వాడుకొంటున్నారో వెల్లడవుతోంది.

ఒకవైపున సి.ఐ.ఏ యీ రకంగా సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధాన్ని సాగిస్తూ వుంటే, విస్కాన్‌సిన్‌కు చెందిన సెనేటర్ మెకార్థే బహిరంగంగానే సాంస్కృతిక యుద్ధాన్ని కొనసాగించాడు. అతడు అధ్యక్షత వహించిన 'అమెరికన్ వ్యతిరేక కార్యకలాపాల విచారణ కమిటీ (అన్ అమెరికన్ ఏక్టివిటీస్ కమిటీ) జరిపిన విచారణలో అనేకమందిపై కమ్యూనిస్టులన్న ఆరోపణలు చేసారు. శిక్షలు విధించారు. అమెరికన్ కమ్యూనిస్టు పార్టీలోకి ఎఫ్.బి.ఐ. ఏజెంట్లు చొరబడ్డారు. 'లైఫ్' పత్రిక ప్రకారం అమెరికా పాల్ రోబ్సన్‌ను తనవాడిగా చెప్పుకోవటం అన్నది విద్రోహ చర్యే అవుతుంది. స్కూలు పిల్లల కోసం వ్రాసిన "ఎక్స్‌ప్లోరింగ్ అమెరికన్ హిస్టరీ" అన్న పుస్తకంలో ఎఫ్.బి.ఐ వారు యిలా ప్రకటించారు : ఎఫ్.బి.ఐ. అమెరికన్లకు విజ్ఞప్తి చేస్తోంది. – "తమతోటి అమెరికన్లు ఎవరైనా కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలలో పాల్గొంటున్నట్టు అనుమానం వస్తే వారు నేరుగా ఎఫ్.బి.ఐ. ఆఫీసుకు తెలియజేయాలి" అని.

1953లో మెకార్థే అధ్యక్షత వహించిన కమిటీ నియమించిన సబ్‌కమిటీ సభ్యులు అమెరికా ప్రభుత్వానికి చెందిన సమాచార సర్వీసు కేంద్రాలు (యు.ఎస్.ఐ.ఎస్) తనిఖీ చేసి, ఆ కేంద్రాల లైబ్రరీలలో (ఏడు దేశాలలో) వున్న లైబ్రరీలో 30,000 పుస్తకాలు, కమ్యూనిస్టు అనుకూల రచయితలు రాసారనీ, వాటిని తొలగించాలనీ ప్రకటించారు. అందుకు అనుగుణంగా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంటు అటువంటి పుస్తకాలను, పెయింటింగ్స్‌ను నిషేధిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఫలితంగా అమెరికన్ రచయితలు, చిత్రకారులూ సృష్టించిన వందలాది పుస్తకాలు, పెయింటింగ్స్ విధ్వంసమయ్యాయి. వాటిలో మాక్సిం గోర్కీ జాన్ రీడ్స్, ఏగ్నెస్ స్మెడ్లీ, హోవార్డ్ ఫాస్ట్ లాంటి ప్రముఖుల రచనలన్నీ తొలగించారు. లైబ్రరీల నుండి తొలగించిన పుస్తకాలన్నీ కాల్చివేసారు. థామస్ మాన్ 'ది మేజిక్ మౌంటైన్', టామ్ పెయిన్ 'ఏరిన రచనలు', ఐన్‌స్టీన్ 'సాపేక్ష సిద్ధాంతం', ఫ్రాయిడ్ రచనలు, హెలెన్ కెల్లర్ వ్రాసిన 'నేను సోషలిస్టును ఎందుకయ్యాను?', థోరో యొక్క "శాసన ఉల్లంఘన" అన్న పుస్తకాలను నిషేధించారు. హోవార్డు ఫాస్టు, ఎర్నెస్టు హెమింగ్వే లాంటివారిపై ఎఫ్.బి.ఐ. నిఘాలు పెంచింది. ఆవిధంగా మెకార్థేయిజమ్' ఒక ఉద్యమంగా రూపొందింది. ఈ మెకార్థేయిజం ఫలితంగా రచయితల, కళాకారుల వ్యక్తీకరణలపై జరిగిన దాడి పూర్వక 'ప్రక్షాళన', ద్వారా అమెరికా తాను 'భావప్రకటనా స్వేచ్ఛకు వైతాళికుడి' (అగ్రగామి)గా ప్రకటించుకోవటం ఎంత బూటకత్వమో వెల్లడయింది.

స్వేచ్ఛా యూరోపు కమిటీ పేరిట, సి.ఐ.ఏ ఏర్పాటుచేసిన కమిటీ ఆధ్వర్యాన 1950లో బెర్లిన్‌లో "రేడియో ఫ్రీ యూరోప్" (స్వేచ్ఛా యూరపు రేడియో)ను స్థాపించారు. ఇది 27 రేడియో స్టేషన్ల నుండి, 16 భాషలలో ప్రచారాన్ని ప్రసారం చేసింది. ఇది కమ్యూనిస్టు వ్యతిరేక నిందలనూ, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఖండించే చర్చలను, ప్రసంగాలనూ, సమాచారాన్ని ముమ్మరంగా ప్రసారం చేసింది.

## లలితకళలతో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం

"మొట్టమొదటిసారిగా అమెరికాకు చెందిన అగ్రశ్రేణి కళాసంస్థలు, యూరోపియన్ కళాసంస్థలు, సమానత్వ ప్రాతిపదికపై కళలను ఉత్పత్తి చేస్తూ యూరోపు అమెరికా దేశాల యొక్క నాగరికతలు ఒకదానిపై, మరొకటి పరస్పరం ఆధారపడి వున్నాయన్న సంఘీభావాన్ని గురించి వెల్లడించాలి!" అన్న ప్రధానలక్ష్యంతో, కాంగ్రెస్ ఆధ్వర్యంలో 1952, ఏప్రియల్ ఒకటవ తేదీన ప్యారిస్‌లో "20వ శతాబ్దపు అత్యుత్తమ కళల పండుగను" నిర్వహించారు. 30 రోజులపాటు జరిగిన యీ ఫెస్టివల్‌లో 75 మంది సంగీత దర్శకులు సృష్టించిన వంద సింఫనీలు, సంగీత కచేరీలు, నాటకాలు, నృత్యనాటకాలు చోటుచేసుకున్నాయి. అత్యధిక శృతిలో (సోప్రానో) పాడటానికి పేరుపొందిన నీగ్రో గాయని లియోన్ టైన్ ప్రైస్ చేత పాట పాడించారు.

శిల్పకళా, చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించారు. 'స్వేచ్ఛా వాతావరణంలో సమకాలీన ప్రపంచంలో సృష్టింపబడిన కళాఖండాలుగా' వాటి గురించి ప్రచారం చేశారు. అయితే యీ పండుగను ఒక కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచార కార్యక్రమంగానూ, "స్వేచ్ఛ", "సంస్కృతి" అన్న పదాల భావనను అపభ్రంశం చేసిన ప్రయత్నంగానూ, ఫ్రాన్సు దేశానికి చెందిన వారి మెదళ్ళలోకి ఫాసిస్టు అభిప్రాయాలను ఎక్కించి, ఫ్రాన్సు దేశపు మేధావులను "సాంస్కృతిక సైన్యంలోకి" చేర్చుకోవటానికి చేసిన పన్నాగం అనీ, ఫ్రాన్సులోని పత్రికలు యీ ఫెస్టివల్ గురించి వ్యాఖ్యానించాయి.

ఈ ఫెస్టివల్‌లో ఆధునిక కళ పేరిట 'మ్యూజియం ఆఫ్ మోడరన్ ఆర్ట్' అనే ప్రైవేటు మ్యూజియం ద్వారా "అమూర్త వ్యక్తీకరణవాదాన్ని" (బాహ్య ప్రపంచంతో సంబంధంలేని, అవాస్తవిక ధోరణులతో కేవలం మనోద్వేగాన్ని మాత్రమే వ్యక్తపరచే) భారీ ఎత్తున చిత్తరువులు (పెయింటింగ్స్)ను ప్రదర్శించి, ఆ రకపు కళావిధానానికి ప్రచారం యిచ్చారు. ఈ రకమైన అమూర్తకళను, ప్రజాస్వామ్యానికి సమానార్థకంగా చూపించారు. అయితే విమర్శకులు యీ అమూర్త వ్యక్తీకరణ విధానాన్ని అమెరికా ఒక భారీ ఉత్పత్తి పరిశ్రమగా మార్చిందనీ, ఈ పెయింటింగ్స్‌ను చిత్రించటంలో చిత్రకారులకు స్వేచ్ఛ లేకుండా పోయి, వారు పెద్ద, అతిపెద్ద శూన్యమైన, మరింత శూన్యమైన చిత్రాలను రూపొందించారని వ్యాఖ్యానించారు. అంతేకాక వారు మ్యూజియాలంటే కళాసంపదలతో పోగుబడిన గోరీలు కాదనీ, స్టాక్ ఎక్స్చేంజి కౌంటింగ్ రూంలో ఎమ్యూజ్‌మెంట్‌లు కాదని అమెరికన్ మ్యూజియం ఫర్ మోడరన్ ఆర్ట్స్‌ను

విమర్శించారు. ఆఖరుకు ఆ కళ రాజుగారు కట్టుకొన్న దేవతావస్త్రాల కథ భాగోతంలా తయారైందని కూడా విమర్శించారు.

సి.ఐ.ఏ, తన ఏజెంట్లను హాలీవుడ్ సినీ పరిశ్రమలోకి కూడా చొప్పించి, ఆ సినీ నిర్మాణ పరిశ్రమలో కూడా ప్రచ్ఛన్న సాంస్కృతిక యుద్ధ కార్యక్రమాలు నిర్వహించింది. 1920 నుండి 1930 వరకూ సోవియట్ యూనియన్‌నూ, కమ్యూనిస్టు పాలనను మెచ్చుకొంటూ "ది నార్త్ స్టార్", "డేస్ ఆఫ్ గ్లోరీ", "సాంగ్ ఆఫ్ రష్యా", "మిషన్ టు మాస్కో" లాంటి చిత్రాలను నిర్మించిన హాలీవుడ్, 1950 నుండీ "ది రెడ్ నైట్‌మేర్", "ది రెడ్ మినేస్", "ఇన్‌వేజన్ యు.ఎస్.ఏ", "ఐ వజ్ ఏ కమ్యూనిస్టు ఫర్ ఎఫ్.బి.ఐ", "ఐరన్ కర్టెన్", "మై సన్ జాన్", "ఇన్‌వేజర్ ఆఫ్ ది బాడీ స్నాచర్స్", "వాక్ ఈస్ట్ ఆన్ బేకన్ స్ట్రీట్", లాంటి చిత్రాలను ఎఫ్.బి.ఐ. యిచ్చిన నిధులతో నిర్మించింది. ఈ చిత్రాలన్నీ కమ్యూనిజాన్ని భూతంగా చూపిస్తూ, కమ్యూనిజపు ముప్పు అనీ, కొండంతలుగా చూపించిన చిత్రాలు.

అంతవరకూ హాలీవుడ్ చిత్రాల్లో నీగ్రోలను తెలివిలేని మూర్ఖులుగానూ, అనాగరికులుగానూ చిత్రీకరించారు. ఇప్పుడు అందుకు బదులుగా నీగ్రో పాత్రలను మంచి దుస్తులు ధరించే నాగరికులుగానూ, హుందాగా జీవించే నీగ్రో బట్లర్లగానూ, వారు స్వేచ్ఛా జీవులైనట్లుగానూ, తాము కోరుకున్న విధంగా పనిచేసే స్వేచ్ఛ గల వారిగానూ సినిమా పాత్రల్లో చూపించటం ద్వారా ప్రేక్షకులకు నీగ్రోలు అమెరికాలో స్వేచ్ఛగా ఎటువంటి జాతి వివక్షతలకు గురికాకుండా బ్రతుకుతున్నట్లు అభిప్రాయం కలిగే, భ్రమను కల్పించే విధంగా చిత్రాలను నిర్మింపచేశారు.

అంతేకాదు అంతవరకూ అపాచీలను ఆటవికులుగానూ, వారి మొత్తం తెగను, వారి యిష్టానికి వ్యతిరేకంగా, అమెరికన్ సైన్యం వారిని ఓడల్లో జంతువుల మాదిరి ఫ్లోరిడాకు పంపించివేసిందనే వాస్తవాన్ని చిత్రీకరించిన చిత్రంలోని ఆ భాగాన్ని తీసివేసి, అవాస్తవికతను జోడించి, ఆ చిత్రాన్ని ప్రదర్శించారు.

మరోవైపు ప్రభుత్వ సాంస్కృతిక విభాగం ద్వారా 70 మంది నీగ్రోలు నటించిన "ది గ్రేట్ నీగ్రో ఫోక్ (జానపద) ఒపేరా" బృందం చేత "పోర్గీ అండ్ బెస్" ప్రదర్శింపజేస్తూ పశ్చిమ యూరోపు, సౌత్ అమెరికా ఖండం, సోవియట్ బ్లాక్ దేశాల్లో ఆ ప్రదర్శనను ఒక దశాబ్ద కాలంపాటు యిప్పించటం ద్వారా "అమెరికా దేశపు సాంస్కృతిక జీవితంలో అమెరికన్ నీగ్రోల పాత్ర" అన్నదానికి "సజీవ సాక్ష్యం" అన్నట్లు భ్రమ కల్పించే యత్నం చేశారు.

హాలీవుడ్ నిర్మించిన చిత్రాలలో ప్రధాన పాత్రలు తాగుబోతు పాత్రలుగా చిత్రీకరించకుండా సి.ఇ.ఏ. తన హాలీవుడ్ ఫార్ములా ద్వారా కట్టడి చేసింది. అదేవిధంగా మతాన్ని (క్రిస్టియన్) వ్యతిరేకించే, మతం పట్ల అపోహలను కల్పించే సన్నివేశాలను చిత్రాలలో లేకుండా కట్టడి చేసింది. 1950లో జార్జి ఆర్వెల్ మరణానంతరం అతడి భార్య సోనియా నుండి "ఏనిమల్ ఫారం" నవలకు చిత్ర నిర్మాణ హక్కులు సంపాదించి డిస్నీ సంస్థ ద్వారా 80 మంది కార్టూనిస్టులతో, 750 సీన్లు గల, 3,00,000 చిత్రాలతో ఆ నవలను కార్టూన్ చిత్రంగా నిర్మింపజేశారు. ఆ చిత్రంలో నవల చివరిలో రచయిత యిచ్చిన ముగింపును తొలగించి, చిత్రీకరించారు. అదేరకంగా జార్జి ఆర్వెల్ యొక్క '1984' నవల తమ సాంస్కృతిక వ్యూహానికి అనుగుణంగా వున్నందున, దాన్ని కమ్యూనిస్టు వ్యతిరేక చిత్రంగా నిర్మింపజేశారు. వాస్తవానికి ఆ నవల అన్ని రకాల అబద్ధాలకు, ప్రభుత్వాలు ఆడే అన్ని రకాల ట్రిక్కులకు నిరసనగా ఉద్దేశించబడింది. కానీ దాన్ని కమ్యూనిస్టు వ్యతిరేక చిత్రంగా మలిచారు. అంతేకాదు ఆ చిత్రం యొక్క ముగింపును అమెరికా దేశపు ప్రేక్షకులకు ఒక విధంగానూ బ్రిటన్ దేశానికి చెందిన ప్రేక్షకులకు మరోరకంగానూ ఉండేటట్లు రెండు రకాల ముగింపులతో చిత్రీకరింపజేశారు.

1956లో హంగేరీలోకి సోవియట్ సైన్యం ప్రవేశించి అక్కడి తిరుగుబాటును అణచివేసిన సందర్భంగా జీన్ పాల్ సాత్రే బహిరంగంగా కమ్యూనిస్టు పార్టీ (సోవియట్) చర్యను వ్యతిరేకిస్తూ ప్రకటించాడు. కానీ అదే సమయంలో ఆంగ్లో – ఫ్రెంచి – ఇజ్రాయిల్ సైన్యాలు సూయజ్ ప్రాంతంపై దండయాత్ర జరిపాయి. దాంతో అధ్యక్షుడు ఐసెన్ హోవర్‌కు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. అయినా నిస్సిగ్గుగా కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం ద్వారా సి.ఐ.ఏ, జీన్ పాల్ సాత్రే ప్రకటించిన సోవియట్ వ్యతిరేకతను వేలాది కాపీలు ముద్రించి, విస్తృతంగా పంచిపెట్టారు.

ప్రముఖ రచయిత టాల్‌స్టాయ్‌ని అమెరికన్ గూఢచారి విభాగంవారు "వ్యక్తిగత స్వేచ్ఛ అనే అవగాహనకు ఒక ప్రతీక"గా పరిగణించారు. టాల్‌స్టాయ్ యొక్క కుటుంబసభ్యులు 1950ల నుండీ సి.ఐ.ఏతో సంబంధాలలో వున్నారు. మ్యూనిచ్‌లో గల టాల్‌స్టాయ్ ఫౌండేషన్‌కు నిధులు పొందుతున్నారు. (టాల్‌స్టాయ్ మనవడు, దేశం నుండి విదేశాలకు వలస వెళ్ళిన ఇలియా టాల్‌స్టాయ్ ద్వారా – యితడు అమెరికన్ గూఢచర్యశాఖ – ఒ.ఎస్.ఎస్‌లో అధికారి). 1958 డిసెంబర్‌లో సి.ఐ.ఏకు చెందిన ఫార్ ఫీల్డు ఫౌండేషన్, సోవియట్‌వారు తలపెట్టిన టాల్‌స్టాయ్ ఫెస్టివల్‌కు ప్రతిగా "టాల్‌స్టాయ్ యొక్క పాశ్చాత్య సెలబ్రేషన్ జరిపి, దానిలో మహారచయిత టాల్‌స్టాయ్‌ని బోల్షివిజానికి ముందటి కాలంవాడు, సమకాలికుడు కాదు అన్నట్లు ప్రచారం చేబట్టింది. ఆ ప్రకారం 1960 జూన్–జులై నెలలలో వెనీషియన్ దీవి శాన్ జియార్గియోలో భారీఎత్తున ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ ఉత్సవంలో భారతదేశం నుండి జయప్రకాశ్ నారాయణ్ కూడా పాల్గొన్నాడు. ఒకరకంగా కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం అనేకమైన పత్రికలను ప్రచురించి సాంస్కృతిక నాటో (ఎన్.ఎ.టి.ఓ)ను రూపొందించాయి.

'రచయితలతో ఉత్పాదకతా సంబంధాలు' పేరిట అధ్యక్షుడు కెన్నడీ, ఎర్నెస్ట్ హెమ్మింగ్వే, రాబర్ట్ లోవెల్ లాంటి 156 మంది రచయితలను 1962, మే 11న ఆహ్వానించాడు. వారందరికీ రాజభోజనం లాంటి డిన్నర్ యిచ్చాడు. సరిగ్గా అదే సమయంలో అమెరికా యొక్క 7వ నౌకాదళాన్ని ఆసియాకు పంపాడు. దీని గురించి రాబర్ట్ లోవెల్ యిలా వ్యాఖ్యానించాడు : "వాస్తవానికి కళాకారుడు ఏరకంగా అమెరికా ప్రభుత్వానికి ముఖ్యమైనవాడు కాదో నాకు అర్థమైంది. నిజానికి వైట్‌హౌస్‌లో మాకిచ్చిన డిన్నర్ కేవలం లోకం ముందు ఒక రకమైన ఒక ప్రదర్శన మాత్రమే! వాస్తవ ప్రభుత్వం (అమెరికా దేశపు) మరెక్కడో వుంది. అది పెంటగాన్‌కు దగ్గరగా వుండి దేశాన్ని నడుపుతోంది.... నాకర్థమవుతోంది. మేధావులయిన మేము ఆడంబరపూర్వకమైన, జల్సాలతో నిరర్థకమైన పాత్రను నిర్వహిస్తున్నామని నాకనిపిస్తుంది.

మనం ప్రదర్శింపబడే అలంకారాలుగా వుండకూడదు. మనం ప్రదర్శనలు నిర్వహించేవారిగా వుండాలి!"

ఎవరైనా సందర్శక మేధావులు న్యూయార్కు నగరం వస్తే వాళ్ళను పెద్దపెద్ద పార్టీలకు ఆహ్వానిస్తారు, ఖరీదైన భోజనం పెడతారు. సేవకులను సమకూర్చిబెడతారు – నిజానికి యీ మేధావులెవ్వరూ అటువంటి విలాసవంతమైన అనుభవం కోసం ఖర్చుపెట్టగలిగే స్తోమత (ఆర్థిక) కలవారు కానేకాదు. ఆ రకంగా మేధావులను ప్రలోభాలకు గురిచేసే రూపంలో కాంగ్రెసు ఫర్ కల్చరల్ ఫ్రీడం వారిని ఆకర్షిస్తుంది. ఉదాహరణకు : జూన్ 1965లో "ప్రపంచ పొందిక (ఆర్డర్) యొక్క పరిస్థితులు" అనే సెమినార్‌ను నిర్వహించింది. అందుకు హాజరయిన మేధావులకు, ప్రతినిధులకు యూరోపులోని అతిపెద్ద పేరున్న హోటల్‌లో ఖరీదైన బసను ఏర్పాటుచేసింది. మెడిటరేనియన్ నదిలో విలాసవంతమైన బోటు పర్యటనలు ఏర్పాటుచేసింది. లండన్‌లో ఐతే కాన్నాట్ హోటల్, రోమ్‌లో ఇంఫిల్ టెర్రా, కేవ్ ఫెరాటో, గ్రాండ్ హోటళ్ళు, ప్యారిస్‌లో హోటల్ బాల్డిమోర్‌లోని రాయల్‌సూట్‌లను ఏర్పాటుచేసింది.

1963లో పాబ్లో నెరుడా నోబెల్ ప్రైజ్ పొందటానికి ఒక అభ్యర్థి. అయితే యితడి అభ్యర్థిత్వాన్ని పట్టించుకోవలసిన అవసరంలేదన్న తీవ్ర ప్రచార కార్యక్రమాన్ని కాంగ్రెస్ ముమ్మరంగా జరిపింది. స్వీడిష్, ఫ్రెంచి, ఇంగ్లీషు భాషల్లో – ఒక సర్క్యులర్‌ను రూపొందించి, నోబెల్ కమిటీ సభ్యులకు ఆ సర్క్యులర్‌ను అందేటట్టు చేసి ఆయనకు నోబెల్ ప్రైజ్ రాకుండా ప్రయత్నించింది. ఆ సర్క్యులర్‌లో 'నెరుడాలోని కళాకారుడినీ, రాజకీయ ప్రచారకుడ్నీ విడదీసి చూడకూడదు. నెరుడా చిలీ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు. అతడి కవిత్వం పూర్తిగా, నిరంకుశ రాజకీయాలను పెంపొందించటానికి ఒక సాధనంగా వుంది. అతడు క్రమశిక్షణ గల, మిలిటెంట్ స్టాలినిష్టు. నెరుడా తన 'గురువు' స్టాలిన్‌పై కవిత్వం రాసినందుకు అతడికి 1953 స్టాలిన్ బహుమానం వచ్చింది" అంటూ పేర్కొంది. అందువలన ఆ సంవత్సరం నెరుడాకు నోబెల్ బహుమతి రాలేదు. ఆ బహుమానం జీన్ పాల్ సాత్రేకు ప్రకటించారు. కానీ ఆయన ఆ బహుమతిని తిరస్కరించాడు. ఐతే 1971లో చిలీలో అలెండే ప్రభుత్వం ఏర్పడ్డాక, ఫ్రాన్స్‌లో రాయబారిగా వున్న పాబ్లో నెరుడాకు స్వీడిష్ అకాడమీ నోబుల్ ప్రైజు ప్రకటించి ఆయనను గౌరవించింది. 1973లో అలెండీను సి.ఐ.ఏ కుట్రతో ప్రభుత్వాధికారం నుండి తప్పించటమేకాక ఆయనను దారుణంగా హత్యచేశారు.

## సి.ఐ.ఏ. సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ వివిధ వికార రూపాలు

1964 నాటికి క్రమంగా, సి.ఐ.ఏ సాంస్కృతికరంగంలో జరుపుతున్న ప్రచ్ఛన్న యుద్ధ కార్యక్రమాలపట్ల వ్యతిరేకతలు, వ్యక్తం కాజొచ్చాయి. అందువలన సి.ఐ.ఏ, కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడంను ఉపయోగించుకొని, ప్రపంచమంతటి రచయితల ప్రాతినిధ్య సంస్థగా యునెస్కో గుర్తించిన "అంతర్జాతీయ 'పెన్' (P.E.N)సంస్థలో చొరబడి, దానిని వశం చేసుకొని, దాని ద్వారా తన కార్యకలాపాలు నడపాలని నిర్ణయించుకొంది. ఆ 'పెన్' సంస్థకు ప్రపంచవ్యాపితంగా 55 దేశాలలో కార్యాలయాలున్నాయి. అనేక పన్నాగాలు పన్ని అంతర్జాతీయ పెన్ సంస్థకు అమెరికా దేశానికి చెందిన ఆర్థర్ మిల్లర్‌ను కొత్త అధ్యక్షుడిగా ఎన్నుకొనేటట్లు సి.ఐ.ఏ. చేయగలిగింది. 1966 జూన్ 12–18 తేదీలలో న్యూయార్కు నగరంలో అంతర్జాతీయ పెన్ మహాసభను నిర్వహించారు. "రచయిత ఒక స్వతంత్ర స్ఫూర్తి", "సమాజంలో రచయిత పాత్రపై కేంద్రీకరణ – ఒక కళాకారుడిగా అతడు పట్టించుకోవలసిన అంశాలు" అన్న యితివృత్తంపై ఆ మహాసభను నిర్వహించారు. ఆరకంగా అమెరికాపై వున్న మచ్చను తొలగించినట్లుగానూ, సమకాలీన నాగరికతను ముందుకు తీసుకుపోవటంలో అమెరికా విజయం సాధించిందని, ఆ మహాసభ నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. అయితే న్యూయార్క్ యూనివర్శిటీలో 'పెన్' నిర్వహించిన ఆ మహాసభ సందర్భంగా కానర్ క్రూయిస్ ఓ. బ్రియాన్ ప్రసంగిస్తూ "ఆ మహాసభ యొక్క డాక్టర్ జెకిల్ లాంటి ఇతివృత్తం.... మిష్టర్ హైడ్‌గా మారిపోయే ప్రమాదంలో పడింది" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు.

ఈ సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యక్రమాలలో సి.ఐ.ఏ, మతాన్ని కూడా ఉపయోగించుకొంది. 1954లో బైబిల్ బెలూన్ ప్రాజెక్టు పేరిట, బైబిల్ పుస్తకాలను పెట్టిన 10,000 బెలూన్లను – సోవియట్ యూనియన్లోకి వదిలిపెట్టారు (వెదజల్లారు). "మేము దేముడిలో మా నమ్మకాన్నుంచాము" అన్నది 1956 నాటికి అమెరికా ప్రభుత్వపు అధికార నినాదం (మోటో) అయింది. దేముడి సహస్ర వర్ష ప్రణాళికలుండగా మనకు పంచవర్ష ప్రణాళికలెందుకంటూ, సోవియట్‌ను గేలిచేశారు. అధ్యక్షులు ట్రూమన్ "కమ్యూనిజం దేముడి ఉనికినే నిరాకరిస్తుందని" అందువలన "చీకటికీ వెలుతురుకూ మధ్య పోరాటం జరుగుతోందన్నట్టుగా" వ్యాఖ్యానించాడు. ఈ అభిప్రాయాన్నే బిల్లీ గ్రహం అనే క్రైస్తవ బోధకుడు "కమ్యూనిజం, సాతాను యొక్క వ్యూహం" అంటూ ఆధ్యాత్మీకరించాడు. మెకార్థీ నిర్వహించిన అన్ అమెరికన్ ఏక్టివిటీస్ కమిటీ విచారణల్లో నిందితులు, తమ నేరాలను స్వయంగా తామే ఒప్పుకొని వెల్లడించటమనే (కన్‌ఫెషన్) పద్ధతి అమెరికా దేశపు కమిటీ ఫర్ కల్చరల్ ఫ్రీడం యొక్క ప్రతీకగా అయింది. (ఈ కన్‌ఫెషన్ అన్నది పాపులు మత పూజారి (ఫ్రీస్టు)కి వెల్లడించి పాపం నుండి విముక్తి అయే క్రైస్తవ మత నమ్మకం – ఆచారం). హాపర్, పార్సీన్ అనే యిరువురు కాలమిస్టులు (పత్రికల్లో వ్రాసేవారు) హాలీవుడ్‌లో, దైవం లేదనే అపరిశుద్ధాలన్నింటిని ప్రక్షాళన చేసే 'మత యుద్ధాన్నే' జరిపారు. పలువురు సినీ నిర్మాతలను తమ వైపుకు మార్చుకొన్నారు.

సి.ఐ.ఏ. యిన్ని విధాలుగా సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యకలాపాలు సాగించినా, అమెరికన్ సమాజంలో "స్వేచ్ఛా" సంస్కృతి పేరిట కుక్కమూతి పిందెల్లాంటి "ఎల్.ఎస్.డి (మాదకద్రవ్యాలు) నములుతూ, బెంజోడ్రైనన్ మత్తు (మాదక) పదార్థాలు సేవించిన మత్తు నిషాలో సంచరిస్తూ, శరీరం అంతా వూగిపోతూ పాడుతూ, నగ్నంగా కవిత్వం చదువుతూ, స్వజాతి సంపర్కంలోని (శృంగారంలోని) ఆనందాన్ని ప్రభోదిస్తూ, ప్రపంచమంతా బీట్స్ లాంటి హిప్పీలు "అమెరికా నశించాలి" "శృంగార కార్యకాలాపాలు వర్ధిల్లాలి" అని, నినాదాలు యిస్తూ అమెరికన్ జీవన విధానం (సంస్కృతి)పై తిరుగుబాటుచేస్తూ 'హిప్పీ' సంస్కృతి 1964 నాటికి పుట్టుకొచ్చింది.

మరోవైపు ఆలోచనాపరులు గతంలో కమ్యూనిజాన్ని ఖండించి నట్లుగానే వియత్నాం యుద్ధ ఫలితంగా అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని

వ్యతిరేకించటానికి ముందుకొచ్చారు. వియత్నాం యుద్ధం వలన అమెరికన్ కమ్యూనిస్టేతర వామపక్షవాదుల, మేధావుల అభిప్రాయాలలో అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం పెంపొందింది.

మరొక ఉదంతం కూడా యూరోపులోని కమ్యూనిస్టేతర మేధావులు అమెరికా యొక్క అణచివేత విధానాలను అర్థం చేసుకొని దానిని నిరసించి వ్యతిరేకించేటట్లు చేసింది.

1951లో వారు అమెరికా దేశపు ఆటంబాంబు రహస్యాలను సోవియట్ యూనియన్‌కు అందజేస్తున్నారు అన్న ఆరోపణతో జూలియస్, ఎథెల్ రోజంబర్గ్ దంపతులకు ఉరిశిక్ష విధించారు. అప్పటివరకూ అమెరికాలో శాంతి సమయంలో గూఢచర్యం జరిపినందుకుగాను ఎవ్వరికీ ఉరిశిక్ష విధింపబడలేదు. ఇప్పుడు ఆ రోజంబర్గ్ దంపతులకు ఉరిశిక్ష విధించినందుకుగానూ యూరోపులో నిరసన వెల్లడైంది. ఫ్రాన్సులో అమెరికా వ్యతిరేక నిరసనలు వెల్లడయ్యాయి. ఫ్రాన్సులో రోజంబర్గ్ డిఫెన్సు కమిటీ కూడా ఏర్పడింది. ఫ్రాన్సులో అత్యధిక మెజార్టీ ప్రజానీకం ఉరిశిక్ష విధించటాన్ని సమర్థనీయం కాదు అని అభిప్రాయ పడింది. ఆ తీర్పును నిరసిస్తూ ఉరిశిక్ష అన్యాయం, నిలిపివేయండి అంటూ భారీఎత్తున యూరోపు దేశాలన్నింటినుండీ అధ్యక్షుడు ఐసెన్‌హోవర్‌కు లేఖలు అందాయి. అయినా ఉరిశిక్షను 1953 జూన్ 19న అమలుజరిపారు. ఈ మరణశిక్షను నిరసిస్తూ "ఇది చట్టబద్ధమైన చిత్రవధ (లించింగ్) దీనితో మొత్తం అమెరికా అంతా రక్తంతో కప్పబడింది" అని జాన్ పాల్ సార్త్రే ప్రకటించాడు. ఈ విషయమై 1956 మార్చి 26న 'మాంచెస్టర్ గార్డియన్' పత్రికలో బెర్ట్రండ్ రస్సెల్ వ్రాసిన ఒక ఉత్తరాన్ని ప్రచురించింది. అందులో ఆయన రోజంబర్గుల విచారణలో ఎఫ్.బి.ఐ అత్యాచారాలు చేసిందనీ, అమెరికాను పోలీసు రాజ్యాలైన నాజీ జర్మనీ, స్టాలిన్ యొక్క రష్యాతో పోల్చాడు. ఇందుకు ప్రతిగా సి.ఐ.ఏ ఒక అమెరికన్ జర్నలిస్టు (లండన్‌లో వున్న) ద్వారా రసెల్‌ను యింటర్వ్యూ చేయించి, ఆ జర్నలిస్టు ద్వారా రసెల్ కమ్యూనిస్టు ప్రచార ప్రభావంలో పడి రోజంబర్గ్ కేసును తప్పుపట్టాడనీ, ఆయన ప్రకటనలో వాస్తవం లేదంటూ పత్రికల్లో ప్రకటింపజేయటమేకాక, నేరుగా అమెరికా దేశపు కాంగ్రెస్ కమిటీ ద్వారా ఆయనకు ఒక లేఖ పంపించాడు. అందులో రసెల్‌కు న్యాయం యొక్క ప్రమాణాలను గురించీ, న్యాయం యొక్క నిష్పాక్షిక దృక్పథం గురించి అవగాహన కొరవడిందనీ తెలియ జేశారు. దాంతో బెర్ట్రండ్ రస్సెల్ కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం కమిటీ యొక్క తన గౌరవాధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు.

అమెరికా పాలకులు విదేశాంగశాఖ 'స్వేచ్ఛ', 'ప్రజాస్వామ్యాలు' గురించి ప్రచారం చేస్తూనే, ఎన్ని విమర్శలు ఎదురైనప్పటికీ, తన ప్రచ్ఛన్నయుద్ధ విధానాన్ని కొనసాగించుతోంది. సి.ఐ.ఏ ఎటువంటి నదరు, బెదరు లేకుండా సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యకలాపాలను యథాప్రకారం సాగిస్తోనే వుంది.

### కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం నిజస్వరూపం బట్టబయలు

అటువంటి నేపథ్యంలో 1967లో కాలిఫోర్నియాకు చెందిన "రేంపార్ట్స్" అనే పత్రిక సి.ఐ.ఏ యొక్క రహస్య కార్యకలాపాలను పరిశోధించి తాను కనుగొన్న విషయాలను వెల్లడించింది. "అతి త్వరలో అమెరికాలో గల ప్రతి రాజకీయ సమాజం, దాతృత్వ ట్రస్టు, కాలేజీ సంఘాల నుండి బేస్‌బాల్ టీమ్ వరకూ అన్నీ సి.ఐ.ఏ యొక్క ముసుగు (ఫ్రంట్) సంస్థలే అని గుర్తింపబడతాయి". ఇదే విషయాన్ని జాతీయ పత్రికలన్నీ ప్రచురించాయి. కేవలం అమెరికాలోని ముసుగు సంస్థలనే అది బయటపెట్టలేదు. సి.ఐ.ఏ. కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడంను స్థాపించటం నుండి అది ఏవిధంగా అనేక పత్రికలకు, ప్రచురణలకు నిధులను అందజేసి, వివిధ సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యకలాపాలు నిర్వహించిందో బట్టబయలు చేసింది.

ఈ వివరాలు వెల్లడి కావటంతో ప్రపంచం అంతటా కలకలం చెలరేగింది. అప్పుడు మినూ మసానీ అధ్యక్షతన కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫెడరేషన్ జనరల్ అసెంబ్లీ రహస్యంగా సమావేశం జరిపింది. ఎట్టకేలకు ఒక గోడమీద పిల్లివాటపు తీర్మానం చేసి యిలా ప్రకటించింది : "సి.ఐ.ఏ యొక్క నిధులను యీ కాంగ్రెస్ కార్యకలాపాలకు వినియోగించింది అన్న విషయం మా కాంగ్రెస్‌కు సమర్పింపబడిన నివేదికల ద్వారా రూఢి అయిందని తెలపటానికి విచారిస్తున్నాము. మా సంస్థ ఎక్జిక్యూటివ్ డైరెక్టరు తన సహచరులకు తెలపకుండానే ఆ నిధులను అంగీకరించటం అవసరమనుకొన్నాడని తెలపటానికి చింతిస్తున్నాం.. అయితే మా సంస్థ ఏర్పడిన నాటినుండి దాని కార్యక్రమాలు ఎటువంటి ప్రభావాలకు లోనుగాకుండా, లొంగకుండా స్వతంత్రంగా పనిచేస్తున్నామని తెలియ జేస్తున్నాము. సి.ఐ.ఏ తత్సంబంధమైనవారిని మోసం చేసినందుకు తీవ్రంగా ఖండిస్తున్నాం. సి.ఐ.ఏ చేసిన ఆ పని మేధావుల అభిభాషణ బావుల్లో విషం కలిపిన పనిలాంటిది. అభిప్రాయాల (భావాల) ప్రపంచంలో అటువంటి పద్ధతులను ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్ పూర్తిగా నిరాకరిస్తోంది." అని ప్రకటిస్తూ కాంగ్రెసు తన చేతులు దులుపుకొంది.

ఈ భంగపాటు అనంతరం, మన దేశ కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం విభాగానికి అధ్యక్షుడిగా వున్న జయప్రకాష్ నారాయణ, సభ్యుడు కె.కె. షాలు ఆ సంస్థకు రాజీనామా చేశారు. అదేవిధంగా యితర దేశాలలోని మేధావులు కూడా రాజీనామాలు చేశారు.

ఇంత జరిగినా సి.ఐ.ఏ మాత్రం వీసమంత కూడా వెనక్కి తగ్గలేదు. రహస్యం బయటపడకుండా మరింత పకడ్బందీగా తన సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధాన్ని కొనసాగిస్తూనే వుంది. ఇప్పుడు సమాచార సాంకేతికత, డిజిటల్ సాంకేతికతలలో వచ్చిన అభివృద్ధిని తన కార్యకలాపాల నిర్వహణకు వినియోగించుకొంటోంది. కాకపోతే కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం పేరు మారింది. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ కల్చరల్ ఫ్రీడం పేరిట, అవే కార్యక్రమాలు కొనసాగించింది. జనవరి 1977లో ఈ అసోసియేషన్ కూడా రద్దు అయింది. తర్వాతి కాలంలో ఏయే పేర్లతో, ఏయే రూపాల్లో యీ సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతూ ఉందో యింకా పరిశోధింపబడి వెల్లడి కావాల్సి వుంది.

ఈ సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యకలాపాలు అమెరికా విదేశాంగ శాఖకు కోరుకొన్న ఫలితాలను చేకూర్చాయనే అర్థం చేసుకోవాల్సి

వుంది. ఎందుకంటే యీ ఇరవై ఒకటో శతాబ్దం నాటికి అమెరికా సామ్రాజ్యవాదపు పతన సంస్కృతి ప్రపంచమంతటా అలుముకొంది. ప్రపంచ ప్రజానీకం యీ పతన సంస్కృతిని అనుకరిస్తూ, యిదే సరయిన సంస్కృతిగా భావిస్తున్న (ప్రస్తుతం) దాఖలాలు కనబడుతూనే వున్నాయి.

హింస, క్రూరత్వం, మితిమీరిన వికృత శృంగారం, వస్తు వినియోగ సంస్కృతి, దారుణ వ్యక్తిగత స్వార్థంతో కూడిన కెరీరిస్టు సంస్కృతి, మాదకద్రవ్యాల వినియోగం ద్వారా ఆనందం, సుఖాలు పొందే సంస్కృతి, ఎవరికేమైపోయినా పట్టని, పట్టించుకోని సంస్కృతి, పరాయీకరణ సంస్కృతి, ఏం చేసి అయినా సంపాదించాలనే సంస్కృతి, బలవంతులకు దాసోహం బలహీనులపై దాష్టీకం లాంటి వికృత సాంస్కృతిక సామ్రాజ్యవాద పతన సంస్కృతీ విషభావాలు ప్రజల ఆలోచనలను ఆక్రమించుకొన్నాయి. విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. ఇదంతా అమెరికా సామ్రాజ్యవాదం సి.ఐ.ఏ. ద్వారా నిర్వహింపజేసిన సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యకలాపాల విష ఫలాలే!

ఈ సంస్కృతి మత్తు నుండి బయటపడితేనే, ప్రపంచంలోని విశాల ప్రజానీకం ఎదుర్కొనే దోపిడీ, అసమానతలు, అణచివేత, పేదరికాల నుండి విముక్తికాగలుగుతాం. ప్రజాసాహిత్య, సాంస్కృతికోద్యమం ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయగలుగుతాం. ఫ్రాన్సిస్ స్టోనర్ సాండర్స్ వ్రాసిన పరిశోధనా గ్రంథం ప్రజావ్యతిరేక శక్తులు, సామ్రాజ్యవాద ఏజెంట్లు చేస్తున్న సాంస్కృతిక ముప్పును గుర్తింప చేస్తుంది. ఆ విషయాల లోతుపాతులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ప్రస్తుత తరాలవారికెంతైనా వుంది.

**(Who Paid the Piper? The CIA and the Cultural Cold War by Frances Stonor Saunders - Granta Books- London - 1999)** ✷

# ముప్ఫై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## సంపుటి : 17, సంచిక : 04, నవంబర్ 1993

**సాహిత్య** పరిశోధకుడు బంగోరెను 11వ వర్ధంతి (అక్టోబర్ 31) సందర్భంగా స్మరించుకుంటూ, ఆయన ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. "కాశ్మీరీయుల పోరాటం ప్రజాస్వామికం – అణచివేత పచ్చి నిరంకుశం" సంపాదకీయం–1, "సాహిత్య పరిశోధకుడు బంగోరె" అనే సంపాదకీయం–2లను ప్రచురించారు. మిత్ర రాసిన 'ఓసు' అనే కథనూ, రాహుల్జీ శతజయంతి సందర్భంగా సుధీప్రధాన్, కలకత్తా రాసిన "జాతీయ భాషా చర్చ – కమ్యూనిస్టు పార్టీ – రాహుల్జీ పాత్ర" వ్యాసాన్నీ ప్రచురించారు. బి. ఉదయరేఖ రాసిన "టోనీ మారిసన్ మధురగానం" స్పందననూ, 'నాస్తిక మార్గం' 1993 నవంబర్ సంచిక నుండి సుమతి రాసిన 'భూకంపాలు ఎలా వస్తాయి' అనే వ్యాసాన్ని ప్రచురించారు. 'ప్రేమకు నిర్వచనం అమరత్వం' అనే కవితను చిన్ని, 'త్రిప్పికొట్టండి – డంకెల్ డ్రాఫ్టును' అనే పాటను నిశితాసి రాశారు. బంగోరె స్మృతిలో – పరిశోధనే ప్రాణంగా జీవించిన బంగోరె అనే ప్రకటననూ, బంగోరె 31–10–1982న రాసిన చివరి ఉత్తరాన్ని, డా॥ సంజీవదేవ్ రాసిన 'మరణాన్ని అయిష్టంగా మార్చుకోని బంగోరె' అనే సంతాప సందేశాన్ని, ఖాదర్ మొహియుద్దీన్ రాసిన "ఆత్మహత్యాగ్రహం" కవితనూ, కృష్ణాబాయి రాసిన "బంగోరె జ్ఞాపకాలు"ను, "బంగోరె పై సన్నిహితుల జ్ఞాపకాలను", 'బంగోరె అత్తలూరికి రాసిన ఉత్తరాన్ని' ప్రచురించారు. బంగోరె రాసిన "సినిమాగా, పుస్తకంగా విశ్వజనీనమై విశ్వవ్యాప్తమైన జీవనేతిహాసం "పదిహేనేళ్ళమ్మాయి డైరీ" – సినిమా సమీక్షను, బంగోరె జీవిత విశేషాలు, ఆయన రాసిన సాహిత్యాన్ని ప్రచురించారు. అందుకున్న పుస్తకాలను 'స్వీకారం' శీర్షికలో ప్రచురించారు. 2, 3 అట్టలపై నారాయణస్వామి రాసిన 'రుదాలీ' కవితనూ 4వ అట్టపైన ఛాయరాజ్ రాసిన "బంగోరె మా ప్రేమ సట్లెజ్‌లో దూకు" కవితనూ ప్రచురించారు.

1/8 డెమ్మీలో 72 పేజీలు. వెల : రూ.5/– ✷

# చరిత్ర ఆచార్యులు సి.వి. రామచంద్రరావు మృతి

ప్రముఖ చరిత్ర ఆచార్యులు సి.వి. రామచంద్రరావు 91 సంవత్సరాల వయసులో 9 అక్టోబరు 2023లో నెల్లూరులో మరణించారు. ఆయన నెల్లూరు వి.ఆర్. కళాశాలలో సుదీర్ఘ కాలం చరిత్ర శాఖ అధిపతిగా పనిచేసి రిటైరయ్యారు.

చరిత్ర రంగంలో ఆయన భారతదేశ మధ్య యుగం (Midieval) పై కేంద్రీకరించి కృషిచేశారు. ధార్వాడ విశ్వవిద్యాలయం నుండి గజపతుల వంశంపై ఆయన డాక్టరేటు పొందారు. ఎన్నో హిస్టరీ కాంగ్రెసు సమావేశాల్లో పాల్గొని పత్ర సమర్పణలు చేశారు.

నెల్లూరులోని వర్ధమాన సమాజంలో ఆయన కార్యవర్గ సభ్యునిగా తన సేవలను చాలకాలం అందించారు. ఆ సమాజం తరఫున కావలి రామస్వామి రచన 'దక్కన్ పొయట్స్' అనే గ్రంథాన్ని ఎడిట్ చేసి ప్రచురించారు.

'మారీచీ పరిణయం', 'కేతన', 'విజ్ఞానేశ్వరీయం' గ్రంథాలను పరిష్కరించి ముద్రించారు. ✷

### తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట సాహిత్య పరిచయం-2 :

# భాస్కరభట్ల కృష్ణారావు నవల "యుగసంధి"

- డా॥ దిలావర్

**ఇవ్వాళ** తెలంగాణ తనకు తెలియని తన సాహిత్య చరిత్రను వెతుక్కుంటున్నది. సాహిత్యంలో అవిష్కృతమైన నాటి సామాజిక పరిస్థితులు, రాజకీయ శృంఖలాలు, ఆర్థిక ఒడిదుడుకులు - నాటి జనజీవనంలో ప్రబలిన విశ్వాసాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలూ, ఆచారాలు తెలుసుకోవాలని ఆరాటపడుతున్నది.

నిజానికి తొలితరం రచయితల్లో చాలామందికి సాహిత్యంలో లభించవలసినంత స్థానం దక్కలేదు. చాలామంది రచయితలు ప్రచారం లేక, తమను ఆదరించడానికి తెలంగాణలో సరియైన పత్రికలు లేక, తమ గురించి తాము స్వీయోత్కర్ష చేసుకోవడం యిష్టం లేక తెరమరుగయ్యారు. బండారు అచ్చమాంబ, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు లాంటి కొద్దిమంది తప్ప, నాటి తెలంగాణ రచయితలు - ఒద్దిరాజు సోదరులు, భాస్కరభట్ల లాంటి ప్రతిభావంతులైన రచయితలెవరికీ రావలసినంత గుర్తింపు రాలేదు.

ఇవ్వాళ తెలంగాణ తొలితరం రచనల గురించి, రచయితల గురించి తెలుసుకోవాలన్న ప్రయత్నం ముమ్మరమైంది. తద్వారా నేటితరం - తనను తాను తెలుసుకునేందుకు, తన పూర్వీకులను తెలుసుకునేందుకు, తన మూలాలను తెలుసుకునేందుకు తీవ్ర అన్వేషణ ప్రారంభమైంది. తెలంగాణ అస్తిత్వ వేదన ప్రారంభదశ, భవిష్యద్దర్శనానికి దశ, దిశానిర్దేశం ఎలా చేయగలిగింది? తన వూళ్ళు, పట్టణాలు, జాతి, సంస్కృతి, భూములు - అస్తిత్వం రోజు రోజుకూ దురాక్రమణలకు గురి అవుతున్న విషమ పరిస్థితుల్లో గుండెల్లో రగిలే బాధను, మెదడును తొలిచే అశాంతిని, మానసిక సంఘర్షణను, నాటి సాహిత్యం ఎలా ప్రతిబింబించగలిగింది? సమాజంలోని అణచివేత, అసమానతలు, అన్యాయాలు, ఆధిపత్యాలు, అరాచకాలు ఎలా అక్షరబద్ధమయ్యాయి? ఈ ప్రశ్నలకు జవాబులు తొలితరం తెలంగాణ రచనల్లో గొప్ప భావోద్వేగాలతో, భావావేశాలతో ఆవిష్కరింపబడ్డాయి.

ఇక్కడి సెలయేళ్ళు, వాగులూ, వంకలూ, జీవనదులూ, కొండలూ, కోనలూ, దట్టమైన అరణ్యాలు, అందమైన చరియలూ, పచ్చని గడ్డితో విస్తరించిన బీళ్ళు, సారవంతమైన భూములు, ఖనిజాలు, పరిశ్రమలు, వృత్తులూ - మనను పెంచి పోషించి బ్రతికించిన యీ నేల.. ప్రకృతి, ఈ నేలలోని అణువణువూ అన్యాక్రాంతమై రూపాలు మార్చుకుంటూ, మన భాషకు చెందిన పేర్లు మార్చుకుంటూ - మన నేలలోనే మనం పరాయీకరణ చెందడంలోని దారుణ విషాదం తొలితరం తెలంగాణ రచయితలు ఒడుపుగా తమ రచనల్లో ఒడిసిపట్టుకున్నారు. ఆనాడు తెలంగాణ ప్రజలు అనుభవించిన అవమానాలూ, ఎగతాళి, హేళన, నిరాదరణ, అణచివేత, జాతివివక్ష, ద్వేషం - దోపిడి, దౌర్జన్యం వెనుక దాగి వున్న దారుణ విషాదమే అస్తిత్వ పోరాటాలకు, విముక్తి పోరాటాలకు, ఉద్యమాలకు పురికొల్పింది. ఆ విషాదమే - ఉద్యమ స్ఫూర్తై రచయితల్లో కసిని పెంచింది. వారి స్వేచ్ఛా ప్రియత్వమే ఉద్యమ సాహిత్యం సృష్టించేందుకు బాటలు వేసింది.

అలాంటి - తెలంగాణ తొలితరం ఆధునిక రచయితల్లో ప్రముఖంగా పేర్కొనదగినవారు భాస్కరభట్ల కృష్ణారావుగారు. ఆధునిక ఆంగ్ల సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినవారు భాస్కరభట్ల. యాభై - అరవై సంవత్సరాల కిందటే అస్తిత్వవాదం, చైతన్య స్రవంతి మొదలైన పద్ధతుల్లో నవలలు రాశారు.

వ్యవస్థాగత సంప్రదాయాలూ, కట్టుబాట్లూ, నియమాలూ, ధర్మాలను తృణీకరిస్తూ వ్యక్తిధర్మానికి పట్టంగట్టే సిద్ధాంతమే అస్తిత్వవాదం. ఈ క్రమంలో వ్యక్తికీ - వ్యవస్థకూ సంఘర్షణ అనివార్యమవుతుంది. వ్యవస్థ మీద పూర్తి ఆధిపత్య ధోరణితో యధేచ్ఛగా వ్యవహరించడమే వ్యక్తివాదం. ఎలాంటి సిద్ధాంతాలకూ, కట్టుబాట్లకూ తలొగ్గక జీవితం వల్ల కలిగే అనుభవాలను, అనుభూతించడమే అస్తిత్వవాదం.

అస్తిత్వవాద ఛాయలో కృష్ణారావుగారు రాసిన మొదటి నవల 'యుగసంధి'. ఈ నవలలో 1921 నుండి 1948 వరకు తెలంగాణ జన జీవనం, నిజాం పరిపాలన నిరంకుశ పాలన వల్ల తెలంగాణ ప్రజలు పడిన అగచాట్లు, ఆ పాలనను ఎదుర్కోవడానికి ప్రజలు చేసిన తిరుగుబాట్లు, ఉద్యమాలు - ఒక్కమాటలో చెప్పాలంటే - నాటి తెలంగాణ ముఖచిత్రాన్ని యధాతథంగా ఈ నవలలో రికార్డు చేశారు భాస్కరభట్ల. తెలంగాణ ఉద్యమాన్ని అంతర్లీనంగా గర్భీకరించుకున్న నవల యిది. నవల యితివృత్తంలో తెలంగాణ ఉద్యమాన్ని ఎలాగయినా జొప్పించాలని ఎక్కడా రచయిత కృతక ప్రయత్నాలు చేయలేదు. కథాగమనంలో సహజంగా ఒదిగిపోయింది తెలంగాణ ఉద్యమం. ఇది వస్తువు మీద ఎంతో పట్టు, నవల రాయడంలో ఎంతో నైపుణ్యం వున్న రచయితకే సాధ్యమయ్యే అరుదైన విషయం.

'యుగసంధి'లోని ప్రధాన పాత్రలు - రుక్మిణి, రమణ, పద్మ, రఘు. ఇవేవీ మూసపాత్రలు కావు. దేనికవే ప్రత్యేకమైనవి. చీమూ, నెత్తురూ వున్న - జీవం తొణికిసలాడే పాత్రలు. స్వతంత్ర ప్రతిపత్తి, సొంత వ్యక్తిత్వం గల పాత్రలు. కుహనా విలువల్ని, 'సోకాల్డ్' ఆదర్శాలనూ లెక్కచేయని పాత్రలు. వాటికోసం జీవితం నుండి ఏమాత్రం పలాయనం చిత్తగించవు. తామొక ఆదర్శమూర్తులమని, సాంఘిక విలువల్ని తూ.చ.

తప్పకుండా పాటించేవాళ్ళమని ఎక్కడా ఫోజు కొట్టవు. ఆదర్శాల కోసం – మనిషి కాక, మనిషి కోసమే ఆదర్శాలు అని నమ్మే పాత్రలు సమాజంలోని ఎందరో వ్యక్తులు, ఈ పాత్రలతో తమను తాము పోల్చుకునేందుకు వీలున్న పాత్రలు. జీవితాన్ని – జీవితంలాగే – జీవించే పాత్రలు.

'యుగసంధి' అన్న పేరుతోనే రచయిత ఏ విషయం చెప్పదలచు కున్నాడో మనకు అవగతం అవుతుంది.

'యుగసంధి' అనే పదాన్ని ఉపయోగిస్తూ రచయిత ఒకచోట 'జీవితపు విలువలు సమగ్రంగా అర్థమై, తన తండ్రికి ఆ ప్రశాంతత వచ్చిందా? లేక తనకీ తన తండ్రికీ మౌలికంగా భేదం వుందా? తండ్రికి మతమూ, సంప్రదాయంపైన విశ్వాసం వుంది. తనకు వాటిపైన ఏమాత్రం నమ్మకం లేదు. అవిశ్వాసమే తనని ఒక విభిన్న వ్యక్తిగా మార్చిందా? అనువంశికంగా సంక్రమించవలసిన విశ్వాసానికి దూరమై ఆధునిక వ్యక్తి, జీవితంలో ఏ ఆధారమూ లేకుండా, గాలిలో ఎగురుతున్నాడా? పాత విలువల్ని త్యజించి కొత్త విలువల్ని వాటి స్థానే స్థాపించుకోలేక ఒక 'యుగసంధి'లో బలంగా చిక్కుకొని ఆధునిక మానవుడు గిజగిజ తన్నుకుంటున్నాడా. ఏమో.....! అంతా అయోమయం....' అని నవలలోని హీరో 'రఘు' పాత్రచేత చెప్పిస్తాడు. తరాల అంతరాలలో వ్యవస్థీకృత విలువలు – కాలంతో పాటు మారే విలువల మధ్య ఆధునిక వ్యక్తిపడే సంఘర్షణే 'యుగసంధి'.

'మారుతున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ సందర్భంలో సంప్రదాయ, అంధవిశ్వాసాల – మూఢనమ్మకాలను ఆచరించే వర్గానికి – ఆధునిక, అభ్యుదయ భావాలు ఆచరించేవారి మధ్యన జరిగే ఘర్షణను యుగసంధిగా ఆవిష్కరించాడు రచయిత' అంటూ ఈ నవలకు రాసిన ముందుమాటలో సంగిశెట్టి శ్రీనివాస్ వివరించారు.

అవకాశం దొరికినప్పుడల్లా జీవన తాత్వికతను భూమికగా చేసుకొని జీవితాన్ని అనేక కోణాల్లో శోధించి – జీవన వ్యాఖ్యానాలు చేశారు భాస్కరభట్ల. సమాజం నుండి, సమస్యల నుండి, చివరకు జీవితం నుండి పలాయనం చేసేవారు కొందరు. కాలానికి ఎదురీది, సమాజానికి ఎదురు తిరిగి, సమస్యలను, జీవితాన్ని ఎదుర్కొనేవారు కొందరు. ఈ జీవిత సత్యాన్ని భాస్కరభట్ల ఎంత అందంగా చెప్పారో చూడండి.

"మానవ ప్రకృతి చాలా విచిత్రమైంది. విధి లేకపోతే దారుణ పరిస్థితికి తల ఒగ్గుతుంది. ఆ పరిస్థితులకి మచ్చిక పడుతుంది. చివరికి వాటికి అలవాటుపడి, తన అస్తిత్వాన్నే కోల్పోతుంది. ఆ పరిస్థితులే తనుగా రూపాంతరం పొందుతుంది. విజృంభించడం జరిగితే పరిస్థితుల్నే మారుస్తుంది. తల ఒగ్గడం జరిగితే పరిస్థితులకే దాస్యం చేస్తుంది. ఎదురు తిరగడం జరిగితే గొప్ప విప్లవాన్ని లేవనెత్తి ఎంతటి విషమ పరిస్థితులనైనా అనుకూలంగా మార్చేస్తుంది. ప్రకృతుల్ని బట్టి మానవుల్ని రెండు విధాలుగా విభజించవచ్చు పరిస్థితులకి ఎదురు తిరిగేవారు ధీరోదాత్తులు. తలలు ఒగ్గేవారు భీరువులు. ధీరోదాత్తులు జీవితంలో తమ ఆశయాన్ని సాధిస్తారు – తమ ధీరోదాత్తత వల్ల తమకే కాక ప్రపంచానికి కూడా మేలు చేస్తారు. కాని ధీరోదాత్తతతో పాటు వారి అస్తిత్వం కూడా పవిత్రమైనదిగా ఉండడం అవసరం. భీరువులకి జీవితంలో ఒక ఆశయమంటూ వుండదు. ఆశయమంటూ ఒకటి వున్నా అది విషమ పరిస్థితుల వలయంలో పడి, నామరూపాలు లేకుండా పోతుంది. కాలదోషం పట్టి ఆ ఆశయానికి అపవిత్రత కూడా సంక్రమిస్తుంది. చివరికి ఆశయాన్నే విస్మరించడం కద్దు. భీరువులు తమ జీవితాన్నే భారంగా మార్చుకొని ప్రపంచానికి భారంగా తయారవుతున్నారు."

అందరికీ తెలిసిన జీవిత సత్యాలే అయినా వాటిని విడమర్చి చెప్పడంలో నేర్పును చూపించాడు రచయిత.

సమాజంలోని అంధవిశ్వాసాలు, మూఢాచారాలు, స్త్రీ విద్య, బాల్యవివాహాల రద్దు, విధవా వివాహాలు మొదలైన సంస్కరణలు చేపట్టి, విస్తృతంగా ప్రచారం చేశారు కందుకూరి వీరేశలింగం. ఆ ప్రభావం హైదరాబాదు స్టేటులో కూడా వెలుగులు విరజిమ్మింది. ఆ విషయాన్ని రుక్మిణి పాత్ర ద్వారా సమర్ధించారు రచయిత.

"రుక్మిణి తన భవిష్యత్తు గూర్చి ఆలోచించడం మొదలుపెట్టింది. ఒకటి రెండు రోజుల్లో తనకి వివాహమవుతుంది. తను ఒక కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. ఇంకా ప్రారంభించడమేమిటి? వివాహానికి నాంది ప్రస్తావనగా అది ఎన్నడో ప్రారంభమైంది. ఇంక ఆ జీవితానికి అలవాటు పడటమే తరువాయి. మొగుడు పోయిన స్త్రీ రెండవసారి వివాహం చేసుకోవచ్చునని రఘు బావ ఇటీవలనే తనకు చెప్పాడు. కాగా, ఇది శాస్త్ర సమ్మతమట. వేదవేదాంగాలు, ధర్మశాస్త్రాలు, పురాణాలు – అన్నీ ఒప్పుకుంటాయట. హిందువులు ఇటీవలివరకూ, ఈ విషయాన్ని గుర్తించలేదట. రాజమహేంద్రవరంలో ఎవరో వీరేశలింగం పంతులుగారని ఉండేవారట. వారు విధవా వివాహాలు శాస్త్ర సమ్మతమని రుజువు చేశారట. కుల వివక్షత లేకుండా, ఎన్నో విధవా వివాహాలు చేయించారట...." ఇలా రుక్మిణి తన ధోరణిలో తను అభ్యుదయ దృక్పథంతో ఆలోచించడం – ఆనాటి తెలంగాణ వితంతు స్త్రీల మనోభావాలను ప్రతిబింబిస్తుంది.

అరవై సంవత్సరాల క్రితమే కులమతాల పట్టింపుల గురించి – వాటిని త్యజించడం గురించి చర్చించడం సాహసమే. విశేషమేమిటంటే – నవలలోని ప్రధాన పాత్రలు – రఘు, రుక్మిణి, రమణ, పద్మ – అంతా అభ్యుదయ దృక్పథం గలవారే. ఈ కులమతాల పట్టింపులు అరవై సంవత్సరాల తరువాత – ఇవ్వాళ కూడా సమాజాన్ని అతలాకుతలం చేయడం విడ్డూరమే అయినా అది కాదనలేని సత్యం.

"మీకు కులాల విషయంలో ఇంకా పట్టింపు ఉందా? ఏమీ లేదు..... ఈ పూట మా యింట్లో భోజనం చేసి వెళ్ళమని...." సందేహిస్తూనే రఘును అడుగుతుంది పద్మ.

అందుకు రఘు "పుట్టడమేమో సదాచార సంపన్నమైన బ్రాహ్మణుల ఇంట్లో పుట్టాను. ఆ వాతావరణంలోనే పెరిగాను. కాని, బ్రాహ్మణత్వం అంటే ఏమిటో నాకు తెలియదు. వేదాలు, శాస్త్రాలు వదిలి, ఇంగ్లీషు, ఉర్దూ, పార్శీలు నేర్చుకున్నాను. రెండు సంవత్సరాల క్రితం నీవు ఈ ప్రశ్నలడిగితే, మేము బ్రాహ్మలం, మీరు బ్రాహ్మణేతరులు – మీ యింట్లో భోజనం చేయనని రకీమని జవాబు చెప్పేవాడిని. బ్రాహ్మణ, బ్రాహ్మణేతర భేదాలు బూటకాలని నేనూ విశ్వసిస్తున్నాను. ఏవో బూజుపట్టిన ఆచారాలను నేటికీ చెక్కుచెదరని స్థితిలో పాటిస్తూ రావడం బూటకమని నేను భావిస్తాను...." అని సమాధానం చెబుతాడు. నాటి తెలంగాణంలో యువత ఆలోచనాధోరణి ఎలా వుందో తెలియజేస్తుంది ఈ సంభాషణ.

రుక్మిణి పాత్రను చిత్రిస్తూ – "నీళ్ళు ఏ పాత్రలో పోస్తే, ఆ పాత్రాకారాన్ని దాల్చినట్టు రుక్మిణి తనకు తెలియకుండానే పరిస్థితులకు అనుగుణంగా మారిపోతూ వచ్చింది. బ్రాహ్మణీకం సడలిపోతున్నందుకు ఆమె ఏ కోశానా దుఃఖించలేదు. బ్రాహ్మణీకం అంటే ఆమెకు తెలిసిందల్లా మడి కట్టుకోవడం, పూజా పునస్కారాలు చేయడం, ఎవరినీ అంటి ముట్టకుండా భోజనం చేయడం. ప్రస్తుతం రామనాథం అఘాయిత్యం వల్ల ఇవేవీ జరగడానికి వీలులేని పరిస్థితులు ఏర్పడ్డాయి" అంటూ విద్యాగంధం అంతగా లేని రుక్మిణి గురించి చెబుతారు రచయిత.

నేడు సమాజంలో స్త్రీవాద చైతన్యం గలిగిన యువతులెందరో వున్నారు. ఆకాశంలో సగం అయిన స్త్రీ లింగ వివక్షతో రెండవ శ్రేణి పౌరురాలుగా భావింపబడటాన్ని ఖండిస్తున్నది. పురుషాధిపత్యాన్ని, అణచివేతను ధిక్కరిస్తున్నది. మతాచారాలను, అంధవిశ్వాసాలను, అర్థంలేని కట్టుబాట్లనూ ప్రశ్నిస్తున్నది. ఉన్నతవిద్యను అభ్యసిస్తూ.. ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తున్నది.

అరవై సంవత్సరాల క్రితమే స్త్రీవాద చైతన్యం నరనరాన ప్రవహించే స్త్రీల పాత్రలను భాస్కరభట్ల చిత్రించడం విస్మయం కలిగిస్తుంది. ముఖ్యంగా రమణ పాత్రను స్త్రీవాద చైతన్యం కలిగిన యువతిగా తీర్చిదిద్దిన తీరు శ్లాఘనీయమైనది. స్వేచ్ఛాప్రవృత్తి – స్వతంత్ర భావాలూ కలిగిన రమణ వ్యక్తిత్వాన్ని ప్రతిభావంతంగా ఆవిష్కరించారు రచయిత. స్త్రీ తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్నీ నిలుపుకోవాలి అని పడే తపనను రమణ పాత్ర ద్వారా సమర్థవంతంగా చిత్రించాడు రచయిత.

'రమణ కడు స్వతంత్రాలోచన గల పిల్ల. తన భవిష్యత్తును తానే దిద్దుకోవాలని ఆమె ఆశయం. తత్ఫలితంగా గొర్రెదాటుగా యితరులను అనుకరించడం మానుకొని అన్ని విషయాలలో స్వతంత్రంగా వ్యవహరించడం నేర్చుకుంది. ఏది తప్పో ఏది తప్పుకాదో, ఏది నీతో ఏది నీతికాదో తన జీవితానికి సంబంధించినంతవరకు తానే నిర్ణయించు కుంటుంది. తన స్వవిషయాల్లో యితరుల జోక్యానికి ఏమీ చోటు ఇవ్వదు. మూడు సంవత్సరాల క్రితం పెళ్ళి చేసుకొమ్మంటే 'నాకు పెళ్ళి వద్ద'ని నిరాకరించింది. కాని 'బావని చేసుకుంటాన'ని (రఘును) ఎన్నడూ అనలేదు. బావపైన రమణకి మొదటినుంచి ప్రేమ ఉన్నమాట నిజమే. కాని ఏది మంచి, ఏది చెడు అని నిర్ణయించుకోలేని ఆ అజ్ఞాన దశలో తాను పెళ్ళి విషయంలో తను తొందరపడి రఘును పెళ్ళి చేసుకోవడం సముచితం కాదని నిశ్చయించుకుంది. అప్పట్లో తాత్కాలికంగా ఉద్రేకోద్వేగాలలో కొట్టుకుపోయినా, పెళ్ళి విషయంలో ఎట్టి పొరపాటూ చేయలేదు. కాలుజారి ఊబిలో పడిపోకుండా తీసుకోవలసిన జాగ్రత్త తీసుకుంది' అంటూ రమణ పాత్రోన్మీలన కోసం పకడ్బందీ వ్యూహాన్ని రచించాడు రచయిత.

కొంత కాకపోయినా, కొంతయినా ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తుందన్న ఆశతో నర్సింగ్ కోర్సులో చేరాలని నిశ్చయించుకుంటుంది రమణ. 'బ్రాహ్మణ జన్మ ఎత్తి మాదిగ వృత్తి అవలంబిస్తావా? రోజుకు పది కాన్పులు చేసి, ఆ ఛండాలమంతా ఇంట్లో కలుపుతావా?' అని రమణ తండ్రి యీసడించుకుంటాడు. 'ఇంత చదువూ చదివి, చివరికి కిరస్తానీ వృత్తి అవలంబిస్తావా?' అని కాలేజిలో ఒక స్నేహితురాలు హేళన చేస్తుంది. అయినా తన నిర్ణయం మార్చుకోదు రమణ. 'పెళ్ళి చేసుకొమ్మ'ని ఇంటిపోరు, అటు కాలేజి స్నేహితుల పోరూ ఎక్కువవుతుంది. కాని పెళ్ళి గురించి ఆమెకు కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. స్త్రీలకు వివాహమే పరమావధా? వివాహం లేకుండా జీవించలేదా? బ్రహ్మచారిణులుగా ఎందుకుండకూడదు? అన్న ప్రశ్నలు నిరంతరం రమణ బుర్రలో గిర్రున తిరుగుతుంటాయి. 'నిజం విచారిస్తే (స్త్రీలలో) ఏ కొద్దిమందో తప్ప, అందరూ గొర్రెదాటుగా, వివాహంతో అంతమొందుతారు. పురుషులు అల్లా కాదు. వారిలో ఏ కొద్దిమంది' అయినా వివాహం చేసుకోకుండా తమ జీవితాల్ని తమ ఆశయ సాధనకి బలిపెడతారు. స్త్రీలు అల్లా ఎందుకు చేయరు? ఎప్పుడూ వాళ్ళు తమ సౌఖ్యాన్నే ఎందుకు దృష్టిలో ఉంచుకుంటారు? వివాహమే తమ జీవిత లక్ష్యంగా ఎందుకు ఎన్నుకుంటారు? బ్రహ్మచారిణులుగా ఎందుకు జీవితాన్ని గడపరు? తమ జీవిత లక్ష్యానికి అడ్డువస్తే వివాహాన్నే పరిత్యజించగల ధైర్యం స్త్రీలకి ఏనాడు వస్తుంది?...." ఇలా సాగుతుంది రమణ ఆలోచనా ధోరణి.

ఆధునిక యువతికీ – ప్రాచీన స్త్రీకి గల వ్యత్యాసమేమిటో స్పష్టమైన విభజన రేఖను మనసులో లిఖించుకుంది రమణ. ఆధునిక భావాలు కలిగిన స్త్రీగా, చదువుకున్న యువతిగా జీవితం గురించి చాలా లోతుగా ఆలోచించగలుగుతుంది రమణ. హేతుబద్ధంగా తర్కించుకునే మేథోశక్తి ఆమెకుంది.

'నేటి స్త్రీ ఏవో అవకాశాలు వున్నాయి కనుక చదువు నేర్చుకుంటున్నది. అక్షరాస్యులు కాగలుగుతున్నది. కాని, ప్రాచీన సంప్రదాయాల్లో పడి గిలగిల తన్నుకుంటున్నది. స్వతంత్రాలోచన లేక, విషమ పరిస్థితులకు తలొగ్గుతున్నది. తత్ఫలితంగా సర్వతోముఖంగా అభివృద్ధి చెందలేక పోతున్నది. గదులు గదులుగా జీవితాన్ని గడుపుతున్నది. నేర్చుకున్న విద్య ఒక గదిలో బంధించివేయబడుతున్నది. దాని వెలుగులు, ఏర్పరచుకున్న ఇనుపగోడల ద్వారా జీవిత సమస్యలపైన ప్రసరించలేక పోతున్నాయి. ప్రాచీన సంప్రదాయాల గది – నిజం విచారిస్తే ఒక చీకటి కొట్టు. తాతలూ, తండ్రులూ, అమ్మమ్మలూ, తల్లులూ కలకాలంనించీ అనుసరిస్తూ వస్తున్న సంప్రదాయాలు మంచివా? చెడ్డవా? అని వితర్కించుకోవడమే మహా పాపం! అల్లా వితర్కిస్తే వాటి పవిత్రతనే దూషించినట్లు అవుతుంది. ఆర్జించిన విద్యా విజ్ఞానాలతో వాటిని పరీక్షించగూడదు. పవిత్ర వారసత్వంగా వాటిని శిరసావహించాలి.. ఇట్టి పరిస్థితుల్లో స్త్రీకి విముక్తి ఎక్కడుంది? ఆధునిక యువతులు ఈ దారుణ పరిస్థితులకి గట్టిగా ఎదురు తిరిగితే తప్ప సంఘానికి విముక్తి లేదు...." అంటూ అభ్యుదయ జీవిత మార్గాన్వేషణలో పరిపరి విధాలుగా ఆలోచిస్తుంది రమణ. యాభై, అరవై సంవత్సరాల క్రింద ఇంత స్త్రీవాద చేతన గల యువతి పాత్రను సృష్టించగలగడం భాస్కరభట్ల దార్శనికతకు నిదర్శనం. ఇవ్వాళ కూడా స్త్రీల పరిస్థితులు, రమణ ఆలోచనల్లో వున్నట్లు యధావిధిగా ఉండటం అందుకు తార్కాణం.

పైకి కనిపించే మనిషే వేరు. అతని అంతర్లోకాలలో దాగి వున్న స్వభావం వేరు అంటే అంతరంగ స్వభావమే మనిషి వ్యక్తిత్వాన్ని నిగ్గుదేల్చే నికషం అన్నమాట. మనిషిలో – అన్వేషణాగుణం, అసంతృప్తి, అశాంతి, అలజడి, కన్‌ఫెషన్, ఖేయాస్ (chaos) అంతఃశ్చేతనలోని కల్లోలం, సంఘర్షణ, స్వాప్నికత, దార్శనికత – సోషల్ మెలాంకలీ –

ఇవన్నీ అస్తిత్వ వేదనలోంచి తొంగిచూసే భావోద్వేగాలే. రచయిత సర్వసాక్షి పద్ధతిలో కథ చెప్పినా కథనంలో తాను కల్పించుకోకుండా ఆయా పాత్రల అంతస్సంఘర్షణను చిత్రించడం ద్వారా ఆ పాత్ర పోషణ పరిణిత దశకు చేరుకుంటుంది. ఈ టెక్నిక్ క్షుణ్ణంగా తెలిసివాడు కాబట్టి భాస్కరభట్ల తన నవలలో వీలుదొరికినప్పుడల్లా పాత్రల అంతర్లోక సంఘర్షణను చిత్రిస్తూ ఆ పాత్రల మూర్తిమత్వాన్ని శక్తివంతంగా ఆవిష్కరించగలిగాడు.

రుక్మిణి పాత్ర వాస్తవికతకు అతి చేరువలో వున్న సజీవ పాత్ర. సార్వజనీన సార్వకాలీన అన్న పెద్ద పెద్ద మాటలు ఇక్కడ వర్తించకపోయినా – ఇవాళ కూడా రుక్మిణి లాంటి బాధితులుండటం దారుణమైన సామాజిక విషాదం. జీవితంలో దగాపడి, నిస్సహాయంగా బతుకులీడ్చే అబలలు కోకొల్లలు....

అల్లకల్లోలమైన రుక్మిణి మనసును, ఆవేదనను, ఆమెలోని అలజడిని, అంతఃశ్చేతనలోని సంఘర్షణను అక్షరాలతో ప్రతిఫలింప జేశాడు భాస్కరభట్ల.

‘ఒక తప్పుటడుగుతో, తన జీవితమంతా తారుమారైనట్లు తోచింది. ఆ అడుగు వేసి ఉండకపోతే, తను ఇంత దురవస్థకు లోనయ్యేది కాదు. ఏదో మోడుగానైనా, ప్రశాంతంగా జీవిత శేషం గడిపి ఉండేది. ఒక తాగుబోతుతో సంసారం చేయవలసిన అగత్యం ఉండేది కాదు. ఒక క్రూరుడి క్రౌర్యానికి బలికావలసిన అవసరం ఏర్పడేది కాదు. గత జల సేతు బంధనం. దానికి ఇప్పుడు విచారించి ఏం లాభం? ఇప్పుడు ఈ విషమ పరిస్థితుల్లోంచి తప్పించుకునే మార్గం ఏమైనా ఉంటే ఆలోచించాలి. పోనీ, ఏమీ ఎరగనట్లు ప్రేమావతీ పేటకు వెళ్ళిపోతే, తాను లేచిపోయిన సంగతి ఇదివరకే గ్రామమంతా వ్యాపించి ఉంటుంది. తాను చుడీ బజారుకు వచ్చి అప్పుడే రెండునెలలైంది. ఈ రెండు నెలల్లో, తనని గూర్చి గ్రామంలో ఎన్ని వదంతులు బయల్దేరి ఉండవు? తాను ఆ వదంతుల్ని ఎలా తట్టుకోగలదు? తనను నీచంగా చూచే ప్రజల్ని తను ఏవిధంగా ఎదుర్కోగలదు?.... పోనీ, ఆత్మహత్య చేసుకుంటే ఒక తప్పటడుగు వేసినంతమాత్రాన, ఇక ఆత్మహత్య తప్ప వేరే శరణ్యం లేదా? అని రుక్మిణి అంతరంగ సంఘర్షణకు అక్షర రూపం ఇచ్చాడు భాస్కరభట్ల.

ఒకవైపు బాల్యం నుండి తనతో కలసి మెలసి తన హృదయమెరిగిన రమణ – మరోవైపు తుఫానులా తన జీవితంలోకి ప్రవేశిస్తున్న పద్మ, ఎటువైపు మొగ్గాలి? రఘులోని ద్వైధీభావాన్ని అంతర్మధనంగా భాస్కరభట్ల హృద్యంగా చిత్రించాడు.

“ఏ వ్యక్తైనా ఇద్దరు స్త్రీలను ప్రేమించగూడదా? ఒక స్త్రీలో కొన్ని గుణాలు కనబడతాయి. ఇంకొక స్త్రీలో మరికొన్ని సుగుణాలు అగుపడతాయి. మొదటి స్త్రీని ఆ కొన్ని సుగుణాల కోసం, రెండవ స్త్రీని ఆ మరికొన్ని లక్షణాల కోసం ప్రేమించగూడదా? ఒకేసారి యిరువురు స్త్రీలని ప్రేమించడం దోషమా? ఇది నీతి, ఇది అవినీతి అని నిర్ణయించేదెవరు? బూజుపట్టిన సంఘ దురాచారాలకు మానవుడు కట్టుబడి వుండడం అవసరమా?.... ఆ దురాచారాలను ఎదిరిస్తే సంఘానికి కొంత మేలు జరుగుతుంది.... నేటి సంఘ పరిస్థితులే ఒక ఆచారం మంచిదైందీ, కానిదీ సూచిస్తాయి.... సాంఘిక సంక్షేమం దృష్ట్యా యిరువురు స్త్రీలని ఒకేసారి ప్రేమించడం దోషమే.... పద్మకన్నా ముందు రమణ తన హృదయంలో స్థానమేర్పరచుకుంది.... పద్మ వినయ విధేయతలు, ఉదార స్వభావం, అందచందాలు తన హృదయాన్ని చూరగొన్నాయి..... రమణ పట్టుదల, విద్యపై ఆమెకు గల శ్రద్ధా భక్తులూ తనకు నచ్చాయి. అంతేకాక, ఆమెపై తనకొక ఫ్యాన్సీ....” అంటూ రఘు డోలాయన మనస్సును, ఔచిత్యానికి భంగం కలగకుండా ఆవిష్కరించారు.

ఈ ఇతివృత్తమంతా తెలంగాణా నేపథ్యంలో ఒదిగిపోయే నడుస్తుంది. పేరుకు మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల్లో జరిగిన కథే అయినా తెలంగాణా అంతటా – ఒక్క తెలంగాణ అనేమిటి – ఆంధ్రప్రదేశ్ అంతటా – ఇంకా చెప్పాలంటే దేశం మొత్తం మీద జరుగుతున్న కథే యిది. ఇవాల్టికీ మహిళల మీద పురుషాధిపత్యం, వాళ్ళమీద జరుగుతున్న లైంగికహింస, కుటుంబ లేక గృహహింసల్లో ఏమాత్రం మార్పులేదు. ఈ నవలలోని రుక్మిణి పాత్ర – ఇప్పటికీ అణగారిన స్త్రీల, అణచివేయబడుతున్న స్త్రీల, అత్యాచారాలకు, మానభంగాలకూ గురవుతున్న స్త్రీలకు ప్రాతినిధ్యం వహించేదే.

విశ్వేశ్వరరావు రుక్మిణి కలిసి వెళ్ళాక అతని నిజస్వరూపం బయట పడుతుంది. తను మోసపోయానని తెలుసుకోవడానికి రుక్మిణికి ఎంతోకాలం పట్టలేదు. విశ్వేశ్వరరావు పచ్చి తాగుబోతు. తిరుగుబోతు. అబద్ధాల కోరు, శాడిస్టు కూడా. వేళాపాళా లేకుండా తనకు ఎప్పుడు కోరిక కలుగుతే అప్పుడు రుక్మిణి పక్కలోకి రావలసిందే. బలవంతంగానైనా తన పశువాంఛ తీర్చుకోవడానికి ఏమాత్రం వెనకాడడు. రుక్మిణి ఒప్పుకోకపోతే నిర్దాక్షిణ్యంగా, క్రూరాతిక్రూరంగా కొడతాడు. మానసికంగా, శారీరకంగా హింసిస్తాడు. విశ్వేశ్వరరావు అంతగా హింసించినా మౌనంగా భరిస్తుంది రుక్మిణి. చెలమల్లో నీరు వూరినట్టు ఆమె కళ్ళలో నీరు వూరినా, ఒక్కోసారి ఆ కళ్ళలోంచి నిప్పురవ్వలు రాలినా నిస్సహాయంగా వుండిపోతుంది. శోకమూర్తిగా మారిపోతుంది. అయినా అతణ్ణి పల్లెత్తుమాట అనదు. సహనంతో కిక్కురుమనకుండా ఆ హింసను భరిస్తుంది. ఆ యింట్లో ఎవరైనా వింటారేమోనని నోరు నొక్కుకొని పడి వుంటుంది.

ఈ లైంగిక హింస ఇప్పటికి కూడా అతిక్రూరంగా కోరలు చాచుకొని మహిళలను వేటాడటం మనం చూస్తున్నాం.

ఇక మౌలికమైన నేపథ్యానికి వస్తే – తెలంగాణ విమోచనోద్యమ ప్రారంభం నుండి పోలీస్ యాక్షన్ దాకా హైదరాబాద్ స్టేట్‌లో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక, విద్యారంగ పరిస్థితులను ఒక చరిత్ర పరిశోధకునిలా శోధించి, కళ్ళకు కట్టినట్టు ఆయా సంఘటనల ద్వారా తెలంగాణ చరిత్రను తవ్విపోశారు భాస్కరభట్ల.

1894లో నిజాం రాష్ట్రంలో నామమాత్రంగా ‘శాసనసభ’ స్థాపించబడిన దగ్గరి నుండి – నవలలో నిజాం రాష్ట్రంలోని పరిస్థితులు చిత్రించారు. బ్రిటిష్ ఇండియాలో ముస్లింలీగ్ అవతరించినట్టే నిజాం రాష్ట్రంలో ‘ఇత్తెహదుల్ ముసల్ మీన్’ అనే సంస్థ స్థాపించబడింది. దాని స్థాపకుడు బహద్దుర్ యార్ జంగ్. బ్రిటిష్ ఇండియాలో రెండు దేశాల సిద్ధాంతం పొడసూపినట్టే నిజాం రాష్ట్రంలో ‘ద్విజాతి సిద్ధాంతం’ ఊపందుకుంది. ముస్లింలు వేరు, హిందువులు వేరు అన్నది ఆ సిద్ధాంత

సారాంశం. ప్రజాహితం ఏ కోశానా లేని నిజాం రాష్ట్రంలో మత వైషమ్యాలు చెలరేగాయి. రజాకార్ల దురాగతాలు పెచ్చుమీరాయి. అసలు 'రజాకార్లు' అంటే స్వచ్ఛంద సేవకులు అని అర్థం. ఖాసిం రజ్వీ ఇత్తె హాదుల్ సభ్యులకు సైనికతత్వం బోధించి, వారిని రజాకార్లుగా మార్చాడు. రజాకార్లు యధేచ్ఛగా లూటీలు, మానభంగాలు, గృహ దహనాలు చేయడం మొదలెట్టారు.

ఇక భాష – చదువుల విషయాన్ని చాలా వివరంగా రాశాడు భాస్కరభట్ల. అసఫ్ జాహీ రాజుల పరిపాలన కింద వున్న హైదరాబాద్ సంస్థానంలో ఉర్దూ రాజభాషగా వుండేది. ప్రభుత్వోద్యోగాలలో చేరి సంస్థానంలో మంచి పలుకుబడి సంపాదించుకోదలచుకున్నవారంతా, రాజభాషను విధిగా నేర్చుకోవలసి వచ్చేది. ఉర్దూలో మంచి ప్రావీణ్యత సంపాదించాలంటే పార్శీ భాష నేర్చుకోవడం తప్పనిసరి. అందుకు ఆమదన్, బోస్తాన్ మొ॥ పార్శీ గ్రంథాలు చదవాల్సి వచ్చేది. తెలుగులో అక్షరాలు నేర్చుకొని, పెద్దబాలశిక్ష చదివి, 'పెద్ద ఎరుసులు' మిత్తీ లెక్కలు, ఉత్తరాలు రాయడం వస్తే చాలు. ఇంగ్లీషు చదువు కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్ళవలసి వచ్చేది.

ఏడవ అసఫ్ జాహమీర్ ఉస్మానలీఖాన్ హయాంలో ఉర్దూ బోధనాభాషగా ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించబడింది. ఆఫీసుల్లో, విశ్వవిద్యాలయాల్లో ఉర్దూను పోషించడం వల్ల సంస్థానంలోని తెలుగు, మరాఠీ, కన్నడ – మూడు భాషలూ గణనీయంగా దెబ్బతిన్నాయి. అప్పట్లో గుడ్డిలో మెల్ల అన్నట్టు, నిజాం కళాశాలలో ఇంగ్లీషులో ఉన్నతవిద్యలు చదవడం సాధ్యమయ్యేది.

'ప్రజలు ప్రైవేటుగా పాఠశాలలు స్థాపించడానికి వీల్లేదు. సభలూ, సమావేశాలూ జరుపుకోవడానికి వీల్లేదు. పాఠశాలలు స్థాపించదలచుకుంటే ఖాన్గీ (ప్రైవేటు) పాఠశాలల నియమావళి అడ్డు వస్తుంది. సభలు జరుపదలచుకుంటే 'గష్తీ నిషాన్' (సర్క్యులర్ నెంబర్) 53 అడ్డు వస్తుంది. ఒకవేళ తప్పనిసరి అయితే, సభలకు బాబెహుకూమత్ (మంత్రి మండలి) అనుమతి పొందాలి' అంటూ నాటి నిజాం నిరంకుశ పాలనను గురించి వివరించాడు భాస్కరభట్ల.

గ్రామాల్లో కులవృత్తి పనుల వారికి నామమాత్రంగా మాన్యాలు – 'బలోతా ఈ నామ్ములు' ఇవ్వబడేవి. అందుకు బదులుగా వెట్టిచాకిరీ చేయవలసి వచ్చేది. బలవంతంగా మోతర్ఫా – లేక మగ్గం పన్ను వసూలు చేసేవారు. వెట్టిచాకిరీ చేయించుకునేవారు. వర్తక స్వాతంత్ర్యాన్ని హరించేవారు.

నిజాం తాబేదార్లయిన దొరల గడీలలో కూడా దారుణమైన పరిస్థితులుండేవి. దేశ్‌ముఖులూ, జాగీర్దార్ల యిళ్ళలో సేవికలు, దాసీలూ వంశపారంపర్యంగా ఉండేవాళ్ళకు పెళ్ళీ పెటాకులూ జరిగేవి కావు. దొరలకూ, వారి బంధువర్గానికీ – వాయి వరుసలు లేకుండా 'భోగ్య' వస్తువులయ్యేవారు. దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు' నవలలో కూడా ఈ 'ఆడబాపల' వ్యవస్థ ప్రస్తావన ఉంది.

అయితే సంస్థానంలోని ముస్లింలందరూ 'రజాకార్లు'గానే ముద్రపడడం దారుణం. మత సామరస్యం కోసం ఆజన్మాంతం పాటుపడిన ముస్లింలు కూడా వున్నారు. షోయబుల్లాఖాన్ ఉదంతం అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. షోయబుల్లా ఖాన్ సంపాదకత్వంలో 'ఇమ్రోజ్' అనే పత్రిక వెలువడేది. అందులో ఇత్తెహాదుల్ ముస్లిమీన్ దాష్టీకం గురించి, రజాకార్ల దుర్మార్గం గురించి నిర్భయంగా సంపాదకీయాలు రాసేవాడు. హిందూ ముస్లింల సమైక్యత' మీద విలువైన వ్యాసాలు రాశాడు. అయితే రజాకార్ ముష్కరులు ఆయనను అమానుషంగా హతమారుస్తారు. ఈ వాస్తవిక సంఘటనను సమయాను కూలంగా తన నవలలో వాడుకున్నారు భాస్కరభట్ల.

రషీద్ ఉదంతం కూడా మత సామరస్యానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కాల్పనిక పాత్రే అయినా, చాలా ఉదాత్తంగా ఆ పాత్రను చిత్రించారు రచయిత. రుక్మిణిని అప్పటికే ఇద్దరు (విశ్వేశ్వరరావు, రామనాధం) వాడుకొని, మోజు తీరాక వెళ్ళగొడతారు. రుక్మిణి ఎల్లమ్మ సహాయంతో రషీద్‌కు చెందిన సిగరెట్ కార్ఖానాలో 'కూత్'గా చేరుతుంది. వెలిసిపోని రుక్మిణి అందచందాలు చూసి రషీద్ మనసుపడతాడు. రుక్మిణిని చేరదీస్తాడు. నీడ కల్పిస్తాడు. రషీద్ ఓ హిందూ స్త్రీని ప్రేమించాడని రజాకార్లకు తెలుస్తుంది. అంతకుముందే రజాకార్లు పదివేల రూపాయల చందా యివ్వమని రషీద్‌ను అడుగుతారు. ఒక మత సంస్థకు చందా కట్టడానికి తిరస్కరిస్తాడు రషీద్. ఆ హిందూ స్త్రీని ఇస్లాం మతంలోకి మార్చమని పదేపదే రషీద్‌ను హెచ్చరిస్తారు. రుక్మిణి భయపడి వాళ్ళు చెప్పినట్టుగానే నన్ను ముస్లిం మతంలోకి చేర్చుకోండి అని రషీద్‌ను ప్రాధేయపడుతుంది. ఎవరి మతం వాళ్ళకు గొప్ప అని భావించి మతమార్పిడికి ససేమిరా ఒప్పుకోడు రషీద్. తన మాట వినినందుకు రషీద్‌ను క్రూరంగా హత్య చేస్తారు రజాకార్లు. ఇది కూడా మత సామరస్యాన్ని చాటిచెప్పే ఉదంతమే.

స్వాతంత్రోద్యమంతో దేశం, విముక్తి పోరాటంతో నిజాం రాష్ట్రం అట్టుడికిపోతున్న క్లిష్ట పరిస్థితుల్లో ఆ పరిస్థితులకు మూలపురుషులైన జిన్నా, లాయఖాలి, ఖాశిం రజ్వీల గురించి కూడా ప్రస్తావించడం – రచయిత విషయ పరిజ్ఞానం తెలుపుతున్నది.

1942లో చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం, గాంధీజీ నాయకత్వం, సత్యాగ్రహాలు, విదేశీ వస్తు బహిష్కరణ, మిల్లు వస్త్రాలు మాని ఖద్దరు వస్త్రాల్ని ధరించడం. న్యాయవాదులు తమ వృత్తుల్ని వదిలిపెట్టి ఉద్యమంలోకి దూకడం, విద్యార్థులు పాఠశాలల్ని, కళాశాలలు బహిష్కరించడం, వేలాదిమంది ప్రజలు జైలుశిక్షను అనుభవించడం – ఇవన్నీ ఈ నవలకు హీరో అయిన రఘు గమనిస్తూ వుంటాడు. కాని హైదరాబాదులో ఇలాంటి ఉద్యమం లేకపోవడం రఘు మనసును కలచివేస్తుంది. కాలక్రమేణ ఆంధ్ర మహాసభల కార్యకలాపాలు, ఆర్య సమాజం సంస్కరణ దృక్పథం, వందేమాతరం ఉద్యమం రఘుని ప్రభావితం చేస్తాయి. విముక్తి పోరాటంలో 'సంగం' బలీయమైన శక్తిగా ఎదగటం వీటన్నిటినీ చూస్తుంటే రఘులో ఎడతెరపి లేని ఆలోచనలు ముసురుకుంటాయి.

1947 ఆగస్టు 15 అర్ధరాత్రి భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. 1948 సెప్టెంబర్ 11వ తేదీన జిన్నా మరణించాడు. సెప్టెంబర్ 13న భారత సేనలు లెఫ్టినెంట్ జనరల్ రాజేంద్రసింగ్ పర్యవేక్షణలో మూడువైపుల నుంచీ సంస్థానాన్ని ముట్టడించాయి. ఈ పోలీసు చర్యకి మేజర్ జనరల్ జె.ఎన్. చౌదరి నాయకత్వం వహించారు.

ఒక్క నల్‌దుర్గ్‌లో తప్ప, భారత సేనలకు ఎలాంటి ప్రతిఘటనా ఎదురుకాలేదు. లెఫ్టినెంట్ జనరల్, రజాకార్లను ఆయుధాలు విసర్జించవలసిందిగా హెచ్చరిస్తాడు. భారతసేనలు హైదరాబాదుకు 50 మైళ్ళ దూరంలో వుండగా, హైదరాబాదు సర్వసేనాని జనరల్ ఎల్. ఇద్రూస్ – లొంగిపోవడం మంచిదని నిజాంకు హితవు చెప్పాడు. నిజాం సెప్టెంబర్ 17వ తేదీ ఉదయం హైదరాబాదు సేనలు లొంగిపోయినట్టు ప్రకటించాడు. ఆరోజు సాయంత్రం 5 గంటలకు నిజాం ప్రభువు దక్కన్ రేడియో నుంచి మాట్లాడుతూ – ఇటీవల జరిగిన దురాగతాలన్నిటికీ రజాకార్లు మాత్రమే బాధ్యులనీ, తను ఎంత చెప్పినా వారు తమ దురాగతాల్ని మానలేదనీ, హైదరాబాదు సేనలు భారత సేనలకు లొంగిపోయాయనీ, ప్రజల్ని ప్రశాంతంగా ఉండవలసిందనీ చెప్పాడు.

రఘు, పద్మ దంపతులకు ఆడపిల్ల పుడుతుంది. సెప్టెంబర్ 17న లోక కళ్యాణం జరిగిన రోజున పాప పుట్టింది కాబట్టి, పాపకు 'కళ్యాణి' అని నామకరణం చేయడంతో నవల సమాప్తమవుతుంది.

భాస్కరభట్ల పుష్కలంగా కవిత్వ స్పృహ ఉన్నవారు కాబట్టి చాలా చోట్ల కవితాపంక్తులతో కథనాన్ని రక్తి కట్టించాడు. అరిగిపోని తాజా ఉపమానాలతో నవలని అలంకరించారు. షమా – పర్వానాల ఉర్దూ కవి సమయాన్ని అందంగా తెలుగులోనికి దిగుమతి చేసుకున్నాడు. ఇలాంటి భాషా విషయాల్ని వివరించాలంటే అదో పెద్ద వ్యాసమై కూచుంటుంది.

చివరకు ఒక్క విషయం చెప్పక తప్పదు. జనరల్ చౌదరిని 'హీరో'గా వర్ణిస్తూ ఎలాంటి రక్తపాతం లేకుండా నిజాం సంస్థానం భారత యూనియన్‌లో విలీనమయిందని రాశారు భాస్కరభట్ల. నిజానికి పోలీస్ యాక్షన్‌లో భారత సేనలు వేలాది కమ్యూనిస్టు పోరాట యోధుల్నీ, అమాయక ముస్లింలనూ ఊచకోత కోసింది. తనకున్న పరిమితులమేర – ఆ రక్తపాతాన్ని అక్షరీకరించలేకపోయారని సరిపెట్టుకోక తప్పదు. ఏది ఏమైనా ఆ యుగసంధిలోని మరపురాని మజిలీలను కళాత్మకంగా నవలీకరించిన తెలంగాణ రచయిత భాస్కరభట్ల మరలిపోలేని మంచి రచయిత.

## వైద్యుడు, కథా రచయిత

# డా॥ మల్లెమాల మరణం




88 సంవత్సరాల డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి కడపలో 3 జులై 2023న మరణించారు. సినిమా రంగంలోని మల్లెమాల సుందర రామిరెడ్డి వీరి అన్న. వారిది నెల్లూరుజిల్లా అయినా కడపకు చెందిన గైనకాలజిస్టు డా॥ వరలక్ష్మిని వివాహం చేసుకుని కడపలో పేద రోగులకు తక్కువ ఫీజుతో వైద్యం అందించడం ప్రారంభించారు. పేద ముస్లిములందరూ వారి వైద్యం అందుకునేవారు. డా॥ వరలక్ష్మి ప్రముఖ విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డికి మేనకోడలు.

డా॥ మల్లెమాల తన పెద్దకుమార్తె 'శిరీష' పేరును కలంపేరుగా స్వీకరించి, 1960లలో కథా రచన ప్రారంభించారు. వాటన్నిటినీ ఐదు సంపుటాలుగా ప్రచురించారు. మొత్తం 100 కథలు దాకా ఆయన రాశారు. 'ఆవలిగట్టు' అనే నవల కూడా వారు రాశారు.

జిల్లా రచయితల సంఘ అధ్యక్షునిగా సాహిత్య కృషి చేశారు. 2009 నుండి మల్లెమాల పురస్కారాలను ఎంపిక చేసిన రచయితలకు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించారు. ఈ పురస్కారం కేతు విశ్వనాథరెడ్డి, పి. రామకృష్ణ, కాత్యాయని విద్మహే, పెళ్ళకూరు జయప్రద, మధురాంతకం నరేంద్ర, పాలగిరి విశ్వనాథరెడ్డి తదితరులు అందుకున్నారు. కరోనా కాలంలో ఈ పురస్కార కార్యక్రమం ఆగిపోయింది.

## మలయాళంలో

# నూతన సినిమా ఉద్యమ ఆద్యుడు కె.జి. జార్జి మరణం



**కళాత్మక,** వ్యాపారాత్మక చలనచిత్రాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి అవిరళ కృషిచేసిన మలయాళీ చలనచిత్ర దర్శకుడు కె.జి. జార్జి 24 సెప్టెంబరు 2023న ఎర్నాకుళంలోని కక్కనాడ్‌లో గల పతనంతిట్ట వృద్ధాశ్రమంలో తన 77వ యేట మరణించారు. ఆయన 24 మే 1946 కేరళలోని 'తిరుమళ్ళ'లో జన్మించారు.

పూనే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన జార్జి, దర్శకుడు రామూకరియాత్ వద్ద సహాయకునిగా చేరారు. చలనచిత్ర రంగంలో 26 ఏళ్ళపాటు ఆయన క్రియాశీలంగా వున్నారు. 1975లో 'స్వప్నదానం' సినిమాతో ఆయన నూతన చలనచిత్ర ఉద్యమంలో తన వంతు పాత్ర నిర్వహించారు. ఆ చిత్రానికి ఆయనకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డు అందుకున్నారు. 1970 నుంచీ 9 రాష్ట్రస్థాయి అవార్డులు ఆయనకు వచ్చాయి. మలయాళం సినిమా రంగం ఇచ్చే అత్యుత్తమమైన జె.సి. డేనియల్ అవార్డు ఆయనకు 2015లో లభించింది.


వారి ప్రసిద్ధ సినిమాలలో 'యవనిక' 1982లో విడుదలై, ప్రపంచవ్యాప్తంగా చలనచిత్ర అభిమానులకు ఒక పాఠ్యపుస్తకంగా మారింది. మరోచిత్రం 'పంచవాది పాకం' (1984) ఒక రాజకీయ వ్యంగ్య చిత్రం. 1985లో విడుదలైన 'ఇరాకల్' కూడా ప్రసిద్ధ చిత్రమే.

## సినిమా సమీక్ష

# నక్బా నరమేధానికి చెరగని సాక్ష్యం 'తంతురా' (2022)

– బాలాజీ (కోల్‌కతా)

**అలాన్** స్వార్జ్ ఇజ్రాయెల్ దర్శకుడు. ఇజ్రాయెల్ రాజ్య స్థాపన కాలంలోని ఓ పాతిపెట్టిన, దాచిపెట్టిన సత్యాన్ని ప్రపంచానికి చాటుతూ ఆయన 'తంతురా' నరమేధంపై డాక్యుమెంటరీ నిర్మించాడు. అధికారులు చెప్పే చందమామ కథల్లా ఇజ్రాయెల్ రాజ్య స్థాపన చాలా సాఫీగా, సుఖ ప్రసవంలా జరిగిపోయిందా? లేక హోలోకాస్ట్ బాధితులు అరబ్బు భూభాగంలో మరో హోలోకాస్టును సృష్టిస్తూ తమ రాజ్య స్థాపన చేసుకున్నారా? పాలస్తీనా చరిత్రలో 1948 సంవత్సరానికి గల ప్రాముఖ్యత ఏమిటి? ఈ విషయాలు తెలిస్తే 'తంతురా' డాక్యుమెంటరీ మనకర్థమౌతుంది. అందుకోసం పాలస్తీనా చరిత్ర విహంగ వీక్షణం చేసి అసలు కథలోకొద్దాం.




**పాలస్తీనా చరిత్రలో కొన్ని కీలక ఘట్టాలు :**

- జూడాయిజం, ఇస్లాం, క్రైస్తవం మతాలకు ప్రధాన కేంద్రం పాలస్తీనా. ఇస్లామ్ అనుయాయులూ, యూదులూ, క్రైస్తవులూ ఒకప్పుడు కలిసి జీవించేవారు.
- దాదాపు రెండు వేల యేళ్లనాడు రోమన్ సైన్యాలు (తిరుగుబాటు చేశారనే కారణంగానో లేక క్రీస్తుకు శిలువ వేయడంలో వారి పాత్ర వుందనే కారణంగానో) యూదుల వధ సాగించాయి. తప్పించుకున్న యూదులు యూరప్‌లోని వివిధ దేశాలకు పారిపోయి తర్వాతి కాలాల్లో చాలామంది వర్తక వాణిజ్యాల్లో, వడ్డీ వ్యాపారాల్లో స్థిరపడ్డారు. కొద్దిమంది యూదులు మాత్రం పాలస్తీనాలో మిగిలారు. కాబట్టి యూదుల్ని వెలివేయడంలో అరబ్బుల పాత్ర లేదు. ఆనాటికి జాతి రాజ్యాల (Nation States) భావనే లేదు.
- రవాణా సదుపాయాలు ప్రారంభమయ్యాక యూదులు తమ జెరుసలెం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునే వారు కానీ వారికి పాలస్తీనా నేలతో పేగుబంధం లాంటిది మాత్రం లేదు.
- క్రీ.శ. 1516లో పాలస్తీనా టర్కీ కేంద్రంగా గల ఒట్టోమాన్ సామ్రాజ్యం క్రిందికి వచ్చింది. అక్కడ్నుంచి నాలుగు వందల యేళ్లు ఈ ప్రాంతం తులనాత్మకంగా కొంత శాంతియుత కాలాన్ని అనుభవించింది.
- పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి క్రమంలో మధ్యప్రాచ్యపు చమురు నిల్వలు బ్రిటీష్ సామ్రాజ్యవాదులను ఆకర్షించాయి. పైగా పాలస్తీనా ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లను కలిపే కూడలి స్థలం కూడా.
- 'ఒట్టోమాన్ ఖలీఫాను ఓడిస్తే సొంత రాజ్యాలు' అంటూ అరబ్బులకు బ్రిటీషర్లు ఆశచూపారు. కానీ మొదటి ప్రపంచయుద్ధంలో గెలిచాక జోర్డాన్ – పాలస్తీనా బ్రిటన్‌కీ, లెబనాన్ – సిరియా ఫ్రాన్సుకీ అంటూ వంతులు వేసుకున్నారు.
- కీలకమైన పాలస్తీనాలో తన తైనాతీ రాజ్యమొకటి అవసరం. అందు కోసం బ్రిటీషువారికి దొరికిన తిరుగులేని ఆయుధం 'జియోనిజం'. యూదు వ్యతిరేక (Anti-Semetic) భావనలకు ప్రతిచర్యగా పుట్టిన సిద్ధాంతమే 'జియోనిజం'. యూదుల కోసం తమ పవిత్ర భూమి పాలస్తీనాలో 'గొప్ప యూదు రాజ్య స్థాపనే లక్ష్యం' అని థియొడార్ హెర్జల్ అనే ఆయన మొదటిసారి ప్రకటించాడు. ఈ సిద్ధాంతానికి అజ్యం పోస్తూ పాలస్తీనా భూభాగంలోకి జియోనిస్టు వలసల్ని ప్రోత్సహించింది బ్రిటన్.
- 1922 నుండి 1935 మధ్యకాలంలో యూదుల జనాభా తొమ్మిది శాతం నుండి 27 శాతానికి పెరిగిపోయింది. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా తిరగబడ్డ పాలస్తీనా అరబ్బులను బ్రిటీషువారూ, జియోనిస్టులూ కలిసి క్రూరంగా అణిచి వేశారు. 1936–39 మధ్య ఈ అణిచివేతల పర్యవసానంగా పాలస్తీనా పురుషుల్లోని పది శాతం మంది హతులో, బంధితులో లేక దేశ బహిష్కృతులో అయ్యారు.
- రెండో ప్రపంచయుద్ధం కారణంగా ఇజ్రాయిల్ ఏర్పాటు పనులు సన్నగిల్లాయి. అరబ్బులకూ, జియోనిస్టులకూ మధ్య గొడవలు పెరుగుతూనే వున్నాయి. చివరికి రెండో ప్రపంచ యుద్ధానంతరం 1947లో పాలస్తీనాను విభజించే పనిని బ్రిటీషువారు ఐక్యరాజ్య సమితికి అప్పగించారు. అప్పటికి పాలస్తీనా జనాభాలో మూడో వంతున్న యూదులకు (వీరిలో గత ముప్పై ఏళ్లలో వచ్చిన వారే అత్యధికం) 55 శాతం నేలను, అందునా ముఖ్యమైన రేవు పట్టణాలూ, వ్యాపార కేంద్రాలూ, వ్యవసాయ భూములూ, అరబ్బులు మెజారిటీగా వున్న ప్రాంతాలూ ఇజ్రాయెల్ కోసం కేటాయించారు. సహజంగానే దీన్ని అరబ్బులు అంగీకరించలేదు.
- తగినంత అగ్గి రాజేశాక 1948 మే 14 అర్ధరాత్రి పూట బ్రిటీష్ తన మేండేట్‌ను ముగించుకుంది. జియోనిస్టు నాయకుడు డేవిడ్

బెన్ గురియన్ తనను తాను ఇజ్రాయెల్ ప్రధానమంత్రిగా ప్రకటించుకున్నాడు.

- 'రామ జన్మభూమి' కోసం చరిత్ర ఆధారాలు అక్కర్లేదు. అలానే 'దేవుడు వాగ్దానం చేసిన భూమి' అనే పుక్కిటి పురాణాల మీద ఆధారపడిన జియోనిస్టు పథకాలకు కూడా చరిత్రా, న్యాయాన్యాయాల పట్టింపు లేదు. 'భూమి లేని ప్రజల కోసం ప్రజలు లేని భూమి' అంటూ అరబ్బులతో నిండి వున్న నేలను ఆక్రమించడానికి కంకణం కట్టుకున్నారు జియోనిస్టులు. అందుకోసం సునియోజిత పథకం వేసుకున్నారు. 1948 మార్చి 10వ తేదీనాడు టెల్ అవీవ్‌లోని రెడ్‌హౌస్ అనే భవనంలో (అది జియోనిస్టు అండర్‌గ్రౌండ్ మిలీషియా 'హగానా' ప్రధాన కార్యాలయంలో) ఒక కీలకమైన సమావేశం జరిగింది. అందులో పదకొండు మంది అనుభవజ్ఞులైన జియోనిస్టు నాయకులు, యువకులైన యూదు మిలటరీ ఆఫీసర్లూ పాల్గొన్నారని, పాలస్తీనా ప్రజల్ని నగరాలూ, గ్రామాల నుండి బలవంతంగా ఎలా తరిమివేయాలో, ఎలా హతమార్చాలో వివరంగా పథకాలు రచించుకున్నారని చరిత్రకారుడు ఇలాన్ పాపే తన 'The Ethnic Cleansing of Palestine' పుస్తకం 'ముందుమాట'లో రాసాం.
- బ్రిటీషువారు అలా వెళ్లారో లేదో 1948 మే 15 ఉదయం నుండి గురియన్ పంపిన ముష్కరులు తమ పథకం ప్రకారం పాలస్తీనా అరబ్బులపై దాడికి దిగారు. ఐక్యరాజ్య సమితి కేటాయించిన ప్రాంతాలే కాక తమకు నచ్చిన, అవసరమనుకున్న ప్రతిచోటునూ ఖాళీ చేయించి కబ్జా చేశారు. హత్యలు చేశారు. అత్యాచారాలు చేశారు. చిన్నపిల్లల కపాలాలు పగలగొట్టారు. దెర్ యాసిన్, తంతురా, దవాయ్‌మే, సఫ్‌సఫ్ – ఇలా వందలాది గ్రామాల్ని ఖాళీ చేశారు. 15,000 మందిని చంపేసి, 7,50,000 మందిని తరిమేశారు. వీరిలో చాలా మంది చుట్టుపక్కల దేశాల్లో ఈనాటికీ శరణార్థులుగా బ్రతుకుతున్నారు.
- ఇజ్రాయెల్ ఈ మారణహోమాన్నీ, విస్థాపననూ 'స్వాతంత్ర్య పోరాటం' అని చెప్పుకుంటుంది. అక్కడి పాఠ్య పుస్తకాలు అదే బోధిస్తాయి. కానీ నిజానికి ఇది ఏకపక్ష దౌర్జన్యం. అందుకే దీన్ని అరబ్బులు 'నక్బా' (మహా విధ్వంసం) అని అంటారు. (అది ఈనాటికీ సాగుతోందని గాజాపై తాజా దాడులు రుజువు చేస్తున్నాయి.) 'నక్బా' ప్రస్తావన వస్తే చాలు యూదు జాత్యహంకారులు కలవరపడతారు. 1948లో ఏమీ జరగలేదని బుకాయిస్తారు. 'నక్బా' గురించి మాట్లాడే వారిపై చర్యలు తీసుకోవడానికి 2011లో ఒక చట్టాన్ని కూడా తీసుకొచ్చారు. ఇజ్రాయెల్ ఏర్పడుతుండగా అరబ్బులంతా ఆనందంగా, స్వచ్ఛందంగా ఆ ప్రాంతం వదిలి పారిపోవడంతో 'భూమి లేని ప్రజలు' 'ప్రజలు లేని భూమి'లో తమ దేశాన్ని ఏర్పాటు చేసుకున్నారని డిస్నీల్యాండ్ కతలు చెబుతారు. కానీ 'తంతురా', 'ఫర్హా' లాంటి సినిమాలు వాళ్ల కథనాలను పీలికలు చేసి పడేస్తాయి.

### 'తంతురా' డాక్యుమెంటరీ :

మధ్యధరా సముద్ర తీరంలో హైఫా నగరానికి దక్షిణాన ముప్పై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అందమైన గ్రామం తంతురా. జనాభా 1,500. ఇజ్రాయెల్ దేశ ప్రకటన జరిగిన వారం తర్వాత 22–23 మే 1948 రాత్రి ఇజ్రాయెల్ సైన్యంలోని అలెగ్జాండ్రోనీ బ్రిగేడ్ యూనిట్ ఈ గ్రామంపై దాడి చేసింది. ఐక్యరాజ్య సమితి ఇజ్రాయెల్ కోసం కేటాయించిన భాగంలో ఇదుంది గనుక తమ ప్రాంతాన్ని తామే డీపాపులేట్ (జనాభా నిర్మూలన) చేయడానికొచ్చారన్న మాట! 1948లో దాడి జరిగిన 400 గ్రామాల్లో తంతురా ఒకటి. అయితే ఈ గ్రామంలో చాలా పెద్ద ఎత్తున ఊచకోతలు జరిగాయి. 270 నుండి 280 మందిని హత్య చేసినట్లు అంచనా.

ఇజ్రాయెల్ ప్రభుత్వం పాలస్తీనాలోని ఒక ప్రాంతాన్ని ఆక్రమించడమే కాక, ఆ ప్రాంతంలోని అరబ్బుల ఇళ్లనూ, ప్రార్థనా స్థలాలనూ, సాంస్కృతిక కేంద్రాలనూ – మొత్తంగా దాని చరిత్రా, సంస్కృతినీ ధ్వంసం చేసి ఊరి పేరు కూడా మార్చేస్తుంది. తంతురా గ్రామానికి ప్రస్తుత నామం నహ్షోలిమ్. అక్కడ టూరిస్టు కేంద్రం కూడా తయారైంది. అలోన్ స్వార్జ్ ఇక్కడ జరిగిన ఊచకోతను డాక్యుమెంట్ చేశాడు.

ఈ చిత్రంలో కనిపించే ఒక కీలకమైన వ్యక్తి టెడ్డీ కాట్జ్. అతనిప్పుడు 70 ఏళ్ళ వయస్సు కలిగి, అనారోగ్యంతో ఉన్నాడు. విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ విద్యార్థిగా ఉన్నప్పుడు 1990ల చివరలో అతను తంతురా మారణకాండపై ఒక థీసిస్ రాశాడు. దాని కోసం అతడు ఎంతో మంది అరబ్, యూదు సాక్షులను ఇంటర్వ్యూ చేశాడు, అలెగ్జాండ్రోని బ్రిగేడ్ సభ్యుల వాంగ్మూలాన్ని 135 గంటల ఆడియో క్యాసెట్ టేపులలో రికార్డ్ చేశారు. ఈ థీసీస్ రాసినందుకు అతడు తీవ్ర అభిశంసనకూ, విమర్శలకూ గురయ్యాడు. అతడిపై పరువునష్టం దావా వేసి వొత్తిడి తెచ్చాక క్షమాపణ చెప్పక తప్పలేదు. కానీ అలా చెప్పక పోవాల్సింది అని ఈ సినిమాలో దర్శకుడికిచ్చిన ఇంటర్వ్యూలో చెబుతాడు.

ఈ రోజు ఇజ్రాయెల్ వెబ్‌సైట్‌లలో టెడ్డీ పరిశోధనపై వంద విమర్శలు కనిపిస్తాయి. అతను ప్రతిదీ వక్రీకరించాడని చెబుతాయి. టెడ్డీ రికార్డు చేసిన ఒక ఇంటర్వ్యూను విని "ఇదే నిజమైతే, ఇది జాలి పడాల్సిన విషయమే. ఆయన దగ్గర ఇంత బలమైన సాక్ష్యాలు ఉన్నప్పుడు ఆయన చివరివరకూ పోరాడవలసింది" అని టెడ్డి పరువునష్టం కేసును విచారించిన జడ్జి డ్రోరా పిల్పెల్ బాధపడుతుంది.

టెడ్డీ ఒకప్పుడు ఇంటర్వ్యూ చేసిన వాళ్లలో బతికున్న సైనికులను ఈసారి వీడియో సాక్షిగా ప్రశ్నిస్తాడు దర్శకుడు. క్రాస్ ఎగ్జామినేషన్ చేయడానికి కావలసిన సమాచారాన్నీ, టెడ్డీ అందించిన ఆడియో టేపుల్నీ ఆధారంగా తీసుకెళ్తాడు. వృద్ధాప్యంలో వున్న ఆనాటి అలెగ్జాండ్రోని బ్రిగేడ్ సైనికుల్లో కొందరు తెలీదన్నట్టు నటిస్తారు, కొందరు ప్రశ్నల్ని దాటవేస్తారు. కొందరు పశ్చాత్తాపం కూడా ప్రకటిస్తారు.

"చాలామంది అరబ్బుల శవాలు చెత్తలా, చెల్లాచెదురుగా పడున్నాయి. అన్నట్టు ఇవన్నీ చెప్పడం నిషేధమనుకోండి" అని ఓ మాజీ సైనికుడు నసుగుతాడు. హైమ్ లెవిన్ అనే ఆయన తన యూనిట్‌లోని ఒక సభ్యుడి గురించి చెప్తూ, "ఆయన 15 లేదా 20 మంది అరబ్బు యుద్ధ ఖైదీల గుంపు వద్దకు వెళ్లి వాళ్ళందరినీ టపటపా కాల్చి చంపేశాడు" అని వివరిస్తాడు. అమిత్జుర్ కోహెన్ అనే ఆయన "ఖైదీలుగా పట్టుకోవడమనేదే లేదు. దొరికిన వాళ్లని దొరికినట్టు చంపేయడమే నా పని" అని చెబుతాడు. 'చేతులు పైకెత్తి లొంగిపోయిన అరబ్ సైనికులు కనిపిస్తే చాలు, వారందరినీ కాల్చేసేవాడిని' అని ఉల్లాసంగా వివరిస్తాడు. 'ఎంత

మంది అరబ్బులను చంపుంటావ్?' అని అడిగితే "నేనెప్పుడూ లెక్కించలేదు. నా దగ్గర 250 బుల్లెట్ల మెషిన్ గన్ ఉండేది. ఎంత మంది అనడిగితే చెప్పలేను" అని చెప్పినపుడు మనకు వొళ్లు జలదరిస్తుంది.

హైఫా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఇలాన్ పాపే ఈ డాక్యుమెంటరీలో కనిపిస్తాడు. "ఇజ్రాయెల్ ఒక నైతిక సమాజంగా మన ప్రజలకు అందమైన కథలు చెప్పుకుంటూ వస్తోంది. అందుకే ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడినట్లు చెబితే అంగీకరించడం మనకు చాలా కష్టం" అని వ్యాఖ్యానిస్తాడాయన. అరబ్ జనాభా తమంత తామే ఆ ప్రాంతాన్ని విడిచిపోయిందనే అబద్ధాన్ని ప్రచారం చేసే అధ్యయనాలను ఇజ్రాయెల్ సంస్థాపకుడు డేవిడ్ బెన్–గురియన్ ప్రోత్సహించిన సంగతిని ఈ డాక్యుమెంటరీ గుర్తుచేస్తుంది.

తంతురా జనాభాలోని పురుషులను వేరుచేసి వారిని ఒక్కొక్కరినీ చెట్లచాటుకు తీసుకుని వెళ్లి కాల్చిపారేశారనీ, వందలాది శవాలను పెద్ద పెద్ద సామూహిక సమాధుల్లో పాతిపెట్టారనీ, ప్రస్తుతం ఆ ప్రాంతంలో సముద్రం వొడ్డున వున్న డోర్ బీచ్ పార్కింగ్ స్థలం కింద ఒక సామూహిక సమాధి వుందనీ పాత, కొత్త గూగుల్ మ్యాపుల్నీ, వివిధ కాలాల ఏరియల్ షాట్‌లను పోలుస్తూ ఈ సినిమా రుజువు చేస్తుంది. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టి నిజం నిగ్గు తేల్చాలని చాలామంది డిమాండ్ చేస్తున్న విషయాన్ని కూడా ఈ సినిమా గుర్తు చేస్తుంది. ఈ సందర్భంగా మనం మరో విషయం తెలుసుకోవాలి. తంతురా సంఘటన జరిగి 75 యేళ్లు నిండుతున్న సందర్భంగా ఈ ఏడాది మే నెలలో లండన్ యూనివర్శిటీకి సంబంధించిన ఫొరెన్సిక్ ఆర్కిటెక్చర్ అనే పరిశోధనా సంస్థ ఆ ప్రాంతపు భౌగోళిక డాటానూ, పాత మ్యాపులనూ ఉపయోగించి 3D మ్యాపును తయారుచేసి అక్కడ మరో మూడు సామూహిక సమాధులున్నాయని తేల్చింది. ఆ సమాచారం, వీడియోలు నెట్‌లో చూడవచ్చు.

ఈ డాక్యుమెంటరీలో కొందరు పాలస్తీనా ప్రత్యక్ష సాక్షుల కథనాలు కూడా ఉన్నాయి. పురుషుల్ని చంపేసి పెద్ద పెద్ద గోతుల్లో పూడ్చేసి, ట్రక్కుల్ని రప్పించి వాటిలో స్త్రీలనూ, పిల్లల్నీ ఎక్కించి ఫురేడిస్ ప్రాంతానికి తరలించారనీ, ఆ ప్రయాణంలో దారి పొడుగునా రోడ్లపై, రైల్వే ట్రాకులపై చెల్లాచెదురుగా పడివున్న శవాలు కనిపించాయనీ 1936లో జన్మించిన ముహమ్మద్ అబు హనా అనే ఆయన (ఆనాటికి 12 యేళ్ల పిల్లాడు) చెబుతాడు.

"హైఫా చుట్టుపక్కల గ్రామాలపై దాడి జరుగుతోందని విని మేము చందాలు వేసుకుని తుపాకులు కొన్నాము. కానీ మాకు అనుభవం లేకపోవడం వల్ల కాల్పుల సమయంలో చాలా తూటాలు వృధాగా ఖర్చుయిపోయేవి. చేసేది లేక తంతురా నుంచి పారిపోయిన వారు పారిపోగా మిగిలిన వారు హతులయ్యేవారు" అని ఫరీద్ తాహా సలామ్ (జననం: 1915) వివరిస్తాడు.

యూసుఫ్ సలామ్ (జననం: 1924) తన కథనం వినిపిస్తాడు – "దాడికి ఒక వారం ముందు, కాఫర్ లామ్‌లో మా బంధువులతో కలిసి ఉంటున్న నా సోదరుడు ముస్తఫా, నా బంధువు మహమ్మద్‌లను ఆ గ్రామంపై దాడి చేసిన యూదులు చంపేశారు. వారి మృతదేహాలను తీసుకువస్తున్న మా నాన్న గాయపడ్డాడు. బుల్లెట్ల శబ్దానికి నాకు మెలకువ వచ్చింది. మా గ్రామంలోకి ప్రవేశిస్తున్న యూదుల్ని చూశాను. (లొంగుబాటుకు చిహ్నంగా) మసీదు మినార్ నుండి తెల్లటి జెండాను వేలాడదీసినప్పటికీ, వారు దారిలో కనబడ్డ ప్రతి ఒక్కర్నీ చంపారు."

ముహమ్మద్ కమిల్ అల్–దస్సుకి (జననం: 1935) కథనం – "తెల్లవారుజామున, గ్రామానికి ఉత్తరాన ఉన్న అల్–బుర్జ్ సమీపంలో సైనికులను దించుతున్న పడవలను నేను చూశాను. వివిధ మార్గాల గుండా వారు తంతురాలోకి ప్రవేశించారు. మేము యూదుల ఆదేశాల మేరకు మృతదేహాలను మోస్తున్నప్పుడు, ముస్తఫా అల్–సల్బుద్ అనే యువకుడు ఏడవడం మొదలుపెట్టాడు. విషయమేమిటని ఒక సైనికుడు అడిగాడు. అతను బదులిస్తూ, 'నా ఇద్దరు సోదరులు చంపబడ్డారు. ఇది నా సోదరుడు ఖలీల్ మృతదేహం. అక్కడ నా సోదరుడు ముహమ్మద్ శవం ఉంది. మా అమ్మకి ఇప్పుడు నేను తప్ప ఎవరూ లేరు' అని చెప్పాడు. 'అలాంటప్పుడు నువ్వుండి ఏం ప్రయోజనం?' అని అతడ్ని కూడా చంపేశాడు ఆ సైనికుడు. స్మశానవాటికలో, నేను యూదులతో నిండిన కార్లను చూశాను, వారిలో కొందరు నవ్వుతూ పాడుతున్నారు, ఇంకొందరు నిశ్శబ్దంగా ఉన్నారు."

"నేను ఈ పని (ఈ డాక్యుమెంటరీని నిర్మించడం) చేస్తున్నప్పుడు మానసికంగా నరకయాతన అనుభవించాను. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను, దానికో భవిష్యత్తు ఉండాలనీ కోరుకుంటాను. కానీ ఇక్కడ సైనిక యుద్ధ చట్టాల ప్రకారం జరగకూడని మహా ఘోరాలు జరిగాయి. ఇది నిజం." అని దర్శకుడు ఒక మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెబుతాడు.

## చరిత్రకారుడి చమత్కార వ్యాఖ్యానం :

ఇలాన్ పాపే ఓ ప్రగతిశీల ఇజ్రాయెల్ చరిత్రకారుడు. (ఈ డాక్యుమెంటరీలో పలుమార్లు కనిపిస్తాడు.) ఇంగ్లాండులో ఓ డిబేట్లో మాట్లాడుతూ పాలస్తీనా – ఇజ్రాయెల్ సమస్యను చాలా సరళంగా రెండు ముక్కల్లో చెబుతాడు.

"లండన్‌లో మీరుంటున్న ఇంటికి ఓ అర్ధరాత్రి పూట ఒకాయన వచ్చి – 'ఇది నా యిల్లు, నేనిక్కడ 2000 సంవత్సరాల క్రితం ఉండేవాణ్ణి. కాబట్టి త్వరగా నువ్వు ఖాళీ చేస్తే మంచిది' – అనంటాడు. అదెలా సాధ్యం అని మీరనుకుంటుండగా, ఆ తర్వాతి రోజు ఆయనతో పాటు ఓ పోలీసోడు వచ్చి, 'ఈయనిక్కడ 2000 యేళ్ల క్రితం ఉండేవాడు కనుక సగం ఇల్లు ఖాళీచేసి అతడికిచ్చెయ్' అని హెచ్చరిస్తాడు." పాపే చెప్పిన ఈ ఉదాహరణలో పోలీసోడు బ్రిటన్ కావచ్చు లేక ఆ తర్వాత రంగంలో కొచ్చిన అమెరికా కావచ్చు. కొద్దిపాటి యూదుల కోసం 55 శాతం నేలను కేటాయించిన ఐక్యరాజ్య సమితి కూడా కావచ్చు. కానీ 1947 తీర్మానం 181 ప్రకారం ఐక్యరాజ్య సమితి చెప్పిన భూమి మేరకే జియోనిస్టు రాజ్యం పరిమితం కాలేదు. అది వెస్ట్ బ్యాంక్, గాజాలలో జాగాలను కబ్జా చేస్తూ, కొత్త కొత్త యూదు సెటిల్మెంట్లు ఏర్పాటుచేస్తూ పాలస్తీనా మొత్తాన్ని ఆక్రమించే క్రమంలో ముందుకెళ్తోంది. కాబట్టి 'సగం ఇంట్లో తిష్టవేసిన వ్యక్తి మెల్లగా మిగతా సగాన్ని కాజేసి అసలు యజమానినే ఇంటి నుండి వెళ్లగొట్టాడు' అని పాపే చెప్పిన పోలికను ఇంకాస్త పొడిగించి చెప్పాల్సిన అవసరం వుంది. ✺

పాలస్తీనా స్వేచ్ఛను

# గాజా నగరానికి తిరిగి వెళ్దామని నా కూతుర్లు బ్రతిమలాడుతున్నారు : కానీ మా పాత జీవితం ఇక తిరిగిరాదు

– రుష్దీ అబులౌఫ్ (ఖాన్ యూనీస్, గాజా)

**రెండురోజుల** క్రితం నా భార్య, పిల్లలు మృత్యుముఖంలోకి వెళ్ళారు. వారు గాజాలోని ఖాన్ యూనీస్ అనే నాలుగు అంతస్తుల భవనంలో క్రింద అంతస్తులో వున్నారు. అది ఒక ఆసుపత్రి దగ్గర వుంది. నేనేమో ఒక గుడారంలో నిద్రపోతున్నాను. వారు నన్ను కలుసుకోడానికి బయలుదేరుతున్న సమయంలో ఇజ్రేలీ డ్రోన్ పై అంతస్తుపై దాడి చేసింది. మా తొమ్మిదేళ్ళ కవల కూతుర్లు భయంతో అరుస్తూ, వారి అమ్మను వదలి వీధిలోకి పరిగెత్తారు. అమ్మకి తలపైన, కప్పు పై నుండి రాలిన రాళ్ళతో దెబ్బతగిలింది. అయితే ఆ గాయం అంత ప్రమాదకరమైనది కాదు. కాని మా కూతుర్లిద్దరూ భయభ్రాంతు లయ్యారు. ఆరోజు రాత్రంతా భయంతో కేకలు పెడుతూనే వున్నారు. వాళ్ళు నిద్రపోవాలంటే ఏంచేయాలో సలహా అడగటానికి ఒక డాక్టరును పిలవాల్సి వచ్చింది. ప్రస్తుతం నా కుటుంబం ఆ భవనం ప్రక్కనే వున్న ఒక ఇంట్లో తమ రాత్రివేళలు గడుపుతున్నారు. తాము కళ్ళుమూసి నిద్రపోతే ప్రమాదమో కాదో వారికి తెలియదు. ఈ యుద్ధం ప్రారంభమైన తర్వాత నేను, నా భార్య, నా కూతుర్లు, నా 18 ఏళ్ళ కొడుకు – రెండు వారాల్లో నాలుగు చోట్లకు – ఇజ్రేలీ వారి విమాన దాడుల హెచ్చరికల వల్ల మారాల్సి వచ్చింది. మా కారు టాపుపైన మా పరుపులు కట్టుకున్నాం. గాజా నగరంలో వారికి అత్యంత ప్రియమైన వారి పాఠశాలను, వారి స్నేహితులను, వారి గుర్రపు స్వారీ క్లబ్బును, వారికిష్టమైన పిజ్జా దుకాణాన్నీ వదిలిపెట్టి వెళ్ళాల్సి వచ్చింది.

గాజాలో మరణమూ, జీవితమూ సమానమైపోయాయి. నిరంతరం పైనుంచి బాంబుల వర్షం. పెద్దవారే భరించలేకపోతున్నారు. పిల్లల సంగతేమిటి!

నా కూతుర్లయితే నా కాళ్ళు పట్టుకొని వుండటానికి ప్రయత్నిస్తున్నారు. నన్ను కౌగిలించుకుంటున్నారు. ప్రమాదం నుండి తప్పించుకోడానికి ఏమైనా చేయదలచుకున్నారు. వాళ్ళు మళ్ళీ మామూలు మనుషులు కావాలంటే చాల సమయం పడుతుంది. వాళ్ళకెంతో సహాయం అవసర మౌతుంది. ఇద్దరూ గాజాకు వెళ్ళిపోదామని పదేపదే అడుగుతున్నారు.

ఇటీవల పెచ్చుమీరిన సంఘటనల ముందు మేము 99 శాతం పాలస్తీనీయులకంటే మెరుగైన జీవితం గడిపాం. ఇక్కడ ఇప్పుడు విద్యుచ్ఛక్తి పరిమితంగా వాడాలి. నీళ్ళన్నీ మురికి – ఇక సెలవులకు బయటకు వెళ్ళటమనేది మహా కష్టం. ఈ చిన్న ముక్కగా వున్న ఈ భూమిని వదిలి వెళ్ళని 40 యేళ్ళ వాళ్ళున్నారు.

విదేశాలలో నెలో, నెలకు పైనో సెలవులు గడిపే అదృష్టం మాకుండేది. ఈ వేసవిలో మేం ఇస్తాంబుల్, సైప్రస్, ఈజిప్టు, జోర్డాన్‌లకు యాత్ర చేసి వచ్చాం. మనం గాజా తిరిగి వెళ్ళాలని చెప్పినపుడు మా పిల్లలు విలపించారు.

బీచ్ నుంచి 400 మీటర్ల దూరంలో గాజా నగరంలో మాకొక విశాలమైన ఇల్లు వుంది. నేనూ, నా భార్య తరచు ఉదయంపూట బీచ్‌లోని ఇసుకలో నడుస్తుండేవాళ్ళం. మా అబ్బాయి విశ్వవిద్యాలయానికి, ఇద్దరమ్మాయిలు స్కూలుకు వెళ్ళేవారు. క్లబ్బుకు పోయి ఈతకొట్టేవారు. గుర్రాలపై స్వారీ చేసేవారు. ఎవరి టాబ్ వారికుంది – యూట్యూబ్ చూసేవారు. నేను ఇంటికి వచ్చేటప్పుడు వారికి తీపి పదార్థాలు తెచ్చేవాడిని. సాయంత్రాలు వారితో పాటు ఆటలు ఆడేవాడిని. ఒక్కోసారి వారు నా రూమ్‌లో నిద్రపోతే, వారిని వారి గదుల్లోకి ఎత్తుకొని వెళ్ళేవాడిని. మరి ఇప్పుడు? నా పిల్లలు పెరిగి పెద్దదైన ఈ ఇరుగుపొరుగు స్థలమంతా ఖాళీ అయిపోయింది. బాంబులతో చదునైపోయింది.

చాల రాత్రులు, మా స్నేహితుని ఇంటికి వెళ్ళి పొద్దుపోయేవరకు కాఫీ తాగుతూ పేకాట ఆడేవాడిని. వారానికొకసారి మంచి రెస్టారెంటుకు కుటుంబ సమేతంగా వెళ్ళేవారం. ఆ రెస్టారెంటు ప్రక్కనున్న పిజ్జాషాపులో ఒక ప్రత్యేకమైన కుండలో మాంసం వండేవారు. అదంటే మాకెంతో ఇష్టం. ఇప్పుడు ఆ పిజ్జాషాపు ఒక శిధిలమైన రాళ్ళగుట్ట!

కష్టాలు భరిస్తూ జీవితాన్ని ఆనందంగా గడిపేవారం. గాజాలో నిరంతరం యుద్ధం జరిగేది కాదు. ఆనందించడానికి అవకాశం వుండేది. పరిస్థితులు బాగున్నా, బాగులేకపోయినా నా భార్య, పిల్లలు నాకు ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చేవారు.

ఇప్పుడు యుద్ధం మధ్యలో కూడా, ఎక్కడ సాధ్యమైతే అక్కడ ఆనందపు క్షణాలను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నాం. నేను పనిచేసే చోటుకు నా పిల్లలు వస్తారు. వాళ్ళు నా జాకెట్, నా హెల్మెట్ పెట్టుకుంటారు. అందరం కలసి నవ్వుకుంటాం. మైక్రోఫోన్ తీసుకొని పత్రికా విలేకరుల్లాగా నటిస్తారు.

కానీ జీవితం ఇంతకుముందు వున్నట్లు వుండబోదు. గతంలో మేము మార్కెట్‌లో సరుకులు కొనే దుకాణం గుర్తు తెచ్చుకుని దాని గురించి అడుగుతారు. వెనక్కి మన వూరికి వెళ్ళిపోదామని అడుగు తుంటారు. అలా అక్కడకు తిరిగి వెళ్ళడం అసాధ్యమన్న విషయం వారికి అర్థంకాదు.

ప్రతిరోజూ, ఉత్తర ప్రాంతంలో వుంటున్న డాక్టర్లు, ఇతరులు – మరో భవనాన్ని ధ్వంసం చేశారనీ, నాకు చెబుతుంటారు. నా కుటుంబానికి ఒక వాగ్దానం చేశాను. ఈ యుద్ధ గందరగోళం తగ్గిన

తర్వాత వారిని గాజా నుండి బయటకు ఒక సురక్షితమైన ప్రదేశానికి తీసుకువెళ్తానన్నాను. ఇప్పటికే మీరు చాలా త్యాగం చేశారు.

వేలాది ప్రజలతోపాటు గాజా నగరం నుండి దక్షిణ ప్రాంతానికి పారిపోవడానికి ముందు మీ ఇంటిచుట్టూ తిరిగి, ఆ ఇంటితో మా కుటుంబానికున్న జ్ఞాపకాలను తలచుకున్నాను. నా భార్యతో అన్నాను – "ఈ అందమైన ఇంటిని ఆఖరిసారిగా చూడు. మనం మరల ఇక్కడికి రాకపోవచ్చు".

ఇప్పుడు, ఈరోజు నేనొక గుడారంలో నిద్రిస్తున్నాను. సముద్ర తీరంలో నా పడకగదిలో కాఫీ తాగుతున్న దృశ్యాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నా. అయితే అవన్నీ ఇప్పుడు తీరని కలలు మాత్రమే

కవిత

# గాజా బాలుని పిలుపు

నేను అలసిసొలసిపోయా!
రాత్రంతా నిద్రపోలా!
నిద్రపోతే బాంబులు పిడుగులు
అదంతా ఒక పీడకల!
అమాయక బాలల్ని అమరులుగా చేసే
క్రూరులుగా మీరు ఎలా తయారయ్యారు?
బాంబు ఎక్కడ ఎప్పుడు పడుతుందోనని
నక్కి కూర్చున్నా నా గదిలో!
దయ్యం పట్టినట్లు వూగిపోతున్నాయి ఇళ్ళు!
నా చిన్ని తమ్ముడిని రక్షించాలని నా యత్నం!
అణచబడ్డవాడి కోర్కె కంటే బలమైనదేమీ లేదు.
ఎదురుదాడి చేస్తా శత్రువుపై నా పాటలతో, కవితలతో!
పాలస్తీనాను ముక్కచెక్కలు చేస్తున్న కాలంలో జీవిస్తున్నా
నా తలపై మబ్బుల్లో దాక్కుని వేలాడుతున్నాయి అవేమిటి?
మాకు రొట్టెముక్క కోసం బయటకు వెళ్ళి
ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నాడు నాన్న!
నా 12వ యేట ఇది నాల్గవ యుద్ధం!
మొద్దుబారిపోయినా! భయమే లేదు నాకు!
క్షేమంగా ఉండటానికి చేసేదేమీ లేదు
ఈ ఇల్లే నా సమాధి ఐనా భయపడని ధీరుణ్ణి నేను....
ఇక్కడున్న 20 లక్షల ఖైదీల స్వేచ్ఛ కోరుతున్నా -
గోడలు ప్రతిధ్వనించేలా నినదించినా మార్పు లేనేలేదు.
ఇదీ ఆక్రమిత ప్రాంతంలో జీవితం!
మా తల్లులు విలపిస్తున్నారు భయంతో, దుఃఖంతో
వీధుల్లోని శవాలపై కప్పిన శ్వేతవస్త్రాలు!
భవనాలన్నీ బూడిదైపోతున్నాసరే
ఉక్కు గుండె నాది
కోలుకోడానికి పట్టదులే ఎంతోసేపు
జీవేచ్ఛ పోదు ఎన్నడూ మాలో!
మా పెద్దమ్మ ఇల్లూ ధ్వంసమైంది
ఇంటిపై వేసిన బాంబు గాయపరచిందామెను
ఆ రాత్రి పడింది బాంబు ఎగురుతూ వచ్చి
ఆమె బతుకే బ్రద్దలైంది కానీ ఇంకా ప్రాణాలతోనే వుంది!
నా చెల్లి నిద్రపోలేకపోతోంది
ఆమె ఏడుపు ఆపాలని విఫలయత్నం చేస్తున్నా!
ఆమెతో అబద్ధాలు చెప్పా - ఆ పేలుళ్ళన్నీ టపాసులవని!
జాలీ దయా లేని హృదయ విదారక పరిస్థితి ఇది.
కరెంటు లేక, నీళ్ళు లేక
చీకట్లో మగ్గుతున్నాం మేమంతా
వారేమో టవర్స్‌ను కూల్చేస్తున్నారు!
కాని నా కలానికున్న బలాన్ని మాత్రం
తొలగించలేరెవరూ!
నేను రాయడం మొదలిడితే ఆపలేరెవరూ నన్ను!
మైక్రోఫోన్‌లో మాట్లాడటమే తప్పించుకునే ఏకైక మార్గం!
అలా మాత్రమే నా భావాలు చెప్పగలను -
నిద్ర సమయంలో ఫైటర్ విమానం ఎగరడం విచిత్రం!
తెలుసు దానికి నగరం మొత్తాన్ని
అల్లకల్లోలం చేయగలనని....
ఒక్క బటన్ నొక్కితే చాలు
ఒక్క క్షణంలో కుటుంబాలకు కుటుంబాలే
నాశనమౌతాయి.
నేను కోరుతున్నా స్వేచ్ఛను
ఇక్కడ వుంటున్న 20 లక్షల ఖైదీలకు....
గోడలు పగలేలా అరుస్తున్నా మార్పేమీ లేదు
ఈ ప్రాంతపు ఇరవై లక్షలమంది స్వేచ్ఛను
కోరుతున్నా! కోరుతున్నా!

(ఎం.సి. అబ్దుల్ జాన్ అనే 12 ఏళ్ళ కుర్రవాడు, పై భావాలను ఇంగ్లీషులో రాప్ పద్ధతిలో పాడి వీడియో తీసి యూట్యూబ్‌లో వుంచాడు. ఇంగ్లీషులో రాప్ పద్ధతిలో అబ్దుల్ జాన్ దీనిని చదివాడు. ఆ వీడియో ఆధారంగా తెలుగు అనువాదం చేసినవారు కొత్తపల్లి రవిబాబు)

పద్యం

# ప్రజల పాలస్తీన

– ఓపీవీయస్

1. స్వంత దేశములోన
నిలువ నీడే లేని
ప్రజల పాలస్తీన
ఓ కూనలమ్మా!

2. చెప్పుకొనుటకెగాని
పుడమి పటమునలేని
ప్రజల పాలస్తీన
ఓ కూనలమ్మా!

3. నాటి తెల్లవాడు
నేటి అమెరికోడు
కలిసి పన్నిన ఉచ్చు
ఓ కూనలమ్మా!

4. కొంత ఫ్రెంచివాడు
పిదప రష్యనువాడు
ఎగదోసె మంటలు
ఓ కూనలమ్మా!

5. మధ్య ప్రాచ్యములోన
పట్టు బిగియిస్తున్న
సామ్రాజ్య పంజాలు
ఓ కూనలమ్మా!

6. చమురు వనరులపైన
ఆధిపత్యము కొరకు
జాతి నిర్మూలనమా?!..
ఓ కూనలమ్మా!..

7. ఆదరించినవారి
అవనినే చెరిచేటి
ముష్కరమ్ముల నీతి
ఓ కూనలమ్మా!

8. విషమంత పోగేసి
బాకాలు ఊదినా
ప్రజలేకమౌతారు
ఓ కూనలమ్మా!

9. ముక్కండముల మధ్య
అమెరికోడి తిష్ట
శ్రమజీవులెదిరించు
ఓ కూనలమ్మా!

10. సామ్రాజ్యవాదమ్ము
పడగనీడన ప్రజలు
చేరనే రాదమ్మ
ఓ కూనలమ్మా!

11. జనులంత ఒక్కటై
దోపిడీ మర్మముల
కెదురు నిలిచేరమ్మ
ఓ కూనలమ్మా!

12. దోపిడీ అంతమౌ
సమత మార్గమునెంచి
నడునడువు పరుగిడుతు
ఓ కూనలమ్మా!

పాట

# పాడుతా పాలస్తీనా స్ఫూర్తిని

– ఉప్పెన

**ఏమని** చెప్పను గాజా గాథను
ఏమని పాడను గాజా గాయాలను
ఏమని చెప్పను ఇజ్రాయెల్ దుర్మార్గం
ఏమని పాడను ఈ నెత్తుటి గేయము
అమెరికోడి అండతోని రెచ్చిపోయి పిచ్చిపట్టి
పాలస్తీనా ప్రజలా రక్తాలను తాగుకుంటు
యుద్ధోన్మాది ఇజ్రాయెల్ దాడులను చేసుకుంటు
పాలస్తీనా ప్రజలా ప్రాణాలను తీస్తుంటే ॥ ఏమని చెప్పను ॥

స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసము
తరాల నుండి పోరుతున్నరు
తాతల తండ్రుల నుండి సాగుతుంది ఈ పోరు
ఐనా దక్కలేదు వారికి స్వాతంత్ర్యము ॥ ఏమని చెప్పను ॥

యూదుల యుద్ధం అధర్మమే
ఇజ్రాయెల్ తరిత ఊచకోతలే
వలసొచ్చి పాలస్తీనాను ఆక్రమించి అణిచివేస్తూ
నేరాలకు పాల్పడుతు ఘోరాలాను చేస్తువుంటె
॥ ఏమని చెప్పను ॥

గాజా గుండె నిండ గాయాలే
పాలస్తీనా నిలువెల్ల త్యాగాలే
నెత్తుటి కూటికి మరిగిన ఇజ్రాయెల్ ఆకలికి
పిల్లా జెల్లా ఎందరొ బలి అయ్యి పోతుంటే ॥ ఏమని చెప్పను ॥

బాంబులతో దాడులను చేస్తూ
సైన్యంతో చుట్టు ముట్టుతుంటే
చావో రేవో ఇంకా తేల్చుకోను సిద్ధమయ్యి
గాజా చేస్తుంది ఈ అంతిమ యుద్ధాన్ని ॥ ఏమని చెప్పను ॥

పాలస్తీనా స్ఫూర్తి నిలవాలే
గాజా పోరాటం గెలవాలే
అమెరికోడి అండతోని ఎగురుతున్న ఇజ్రాయెల్ను
గుండెలపై ఎగిరి తన్ని నేల కూల్చివేయగ ॥ ఏమని చెప్పను ॥

పాడుతా పాలస్తీనా స్ఫూర్తిని
నే పాడుతాను గాజా తెగువను
నేను చాటుతాను పాలస్తీనా త్యాగాలను
నేను మీటుతాను గాజా యుద్ధ గీతాలను
నేను ఏకుతాను ఇజ్రాయెల్ ఘోర నేరాలను ॥ పాడుతా ॥

కవిత

# శాంతి పావురాలు ఎగరాలి

- కుర్రు వినోద్

ఆరిపోయిన పసికూన
ఆర్తనాదం వినేదెవ్వరు?
ఆ బాంబుల పేలుడుల మధ్య
ఆ కూన అరుపులు వినేదెవ్వరు

దేశాల మధ్య మంటలకు
పోస్తుంది ఇంధనం
ఆ పెట్టుబడిదారీ విధానం
ఇదో పెద్ద తతంగం.

మత తరంగాల మంటలు
బలికోరుతున్నాయి సామాన్యులను
యుద్ధ సంక్షోభాల మధ్య
పగిలిపోతున్నాయి పేదల జీవితాలు

సర్కారుల పంతాల పట్టు వల్ల
ఛిన్నాభిన్నమైపోతున్నాయి
పసిపాపల పసిడి నవ్వులు
ఎవరయ్యా దీనికి బాధ్యులు?

చీమల పుట్టల ఆక్రమణకు
పాములు పన్నే ఎత్తుగడలా
ప్రపంచాధిపత్యం కొరకు
సామ్రాజ్యవాద దాడులు ఈ యుద్ధాలు.

యూదులనే పాముని పాలోసి పెంచి
పాలస్తీనా చీమల పుట్టను
ఆక్రమించేందుకు ఉసిగొల్పింది
ఆ ఇంపీరియల్ డేగ.

గూడులు వీడి తమను తాము
కాపాడుకొనేందుకు పరుగులు
చేస్తున్నారు సాధారణ జీవులు
ఆ పాలస్తీనా వీధులలో

కంటినిండా కునుకు లేక
ప్రాణాల మీద ప్రేమతో
చంటి పిల్లలను చంకనేసుకొని
పగలూ రాత్రులూ పోరాటాలు

ఇకనైనను ఆపాలీ దురంతాలు
సాధారణ సామాన్యులపై
ఇకనైనను స్వస్తి పలకాలి
ఈ ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధానికి

శాంతి పావురాలు హాయిగా ఎగరాలి
నడి వీధులలో స్వేచ్ఛగా
మార్మోగాలి పసిపాపల నవ్వులతో
ఇరు దేశాలు.

# చైతన్యవాహిని

## అనకాపల్లి జిల్లా మామిడిపాలెం
## ల్యాండ్ పూలింగ్ బాధితులకు జనసాహితి సంఘీభావం

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (VMRDA) ల్యాండ్ పూలింగ్ పేరుతో అనకాపల్లి జిల్లాలో 12 గ్రామాలలో 1225 ఎకరాలు డి-ఫారమ్, కొండపోరంబోకు భూములను సమీకరించింది. 2016-19 సంవత్సరాల మధ్య ఏడు జీవోలను విడుదల చేసి ల్యాండ్ పూలింగ్ స్కీమును (LPS)ను రూపొందించాయి. ప్రస్తుతం వాటి స్థానే జీవో-72 విడుదల చేసి భూ సమీకరణను దూకుడుగా చేసింది. ఏళ్ళ తరబడి నిరుపేదలు తుప్పలు, డొంకలు నరికి పోరంబోకు భూములను సరిచేసుకుని, కిలోమీటర్ల దూరాల నుంచి నీళ్ళు మోసి పోసి జీడిమామిడి, యూకలిప్టస్ మొదలైన తోటలు వేసుకున్న భూములవి. అపరాలు, కూరగాయలు సైతం పెంచుకుంటున్న భూములు. కరోనా వంటి కష్టకాలంలో సైతం ఆదుకున్న భూములవి. ఆవులు, గేదెలు, మేకలు పెంచుకుంటూ జీవనోపాధి పొందే భూములు. జీవో-72 ప్రకారం పట్టాభూమి ఎకరా కోల్పోతే 18 సెంట్లు. ఆక్రమణ భూమి ఎకరా కోల్పోతే 9 సెంట్లు ఇళ్ళ పట్టాలను మంచి ధర వచ్చే ప్రాంతాలలో యిస్తామని ఇప్పటిదాకా మీరు చూడనంత డబ్బు చూస్తారని, గోనెసంచుల్లో పట్టుకెళ్ళేంత డబ్బు వస్తుందని మాయమాటలు చెప్పారు. LPOC ల్యాండ్ పూలింగ్ ఓనర్షిప్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. భూసేకరణ నోటిఫికేషన్ విడుదలైన 5 నెలలకే ఇళ్ళపట్టాలిస్తామని చెప్పి ఇప్పటికీ హౌస్ సైట్లు అప్పగించలేదు. సరికదా అవే భూములలో జగనన్న ఇళ్ళ ప్లాట్ల కోసమంటూ బస్సులలో వందలాదిమందిని తీసుకొచ్చి జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఒరిస్సా కార్మికులతో నిర్మాణ పనులు మొదలు పెట్టేశారు. ఈ పరిణామాలతో తీవ్రంగా ఆందోళన చెందిన నిర్వాసితులు రైతుకూలీసంఘం నేతృత్వంలో నిర్మాణ పనులను అడ్డుకొని, నిరసన దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాన్ని అక్టోబర్ 12న ప్రారంభించగా, జనసాహితి అనకాపల్లి జిల్లా సభ్యులు అక్టోబర్ 14న శిబిరాన్ని సందర్శించి, సంఘీభావాన్ని తెలియచేశారు.




**"మన నవలలు" (తెలుగు నవలల మీద విమర్శ వ్యాసాలు) – రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

తెలుగు సాహిత్య విమర్శనా కృషిలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి 50 ఏళ్ళు గడిచాయి. ఈ సందర్భంగా తీసుకువచ్చిన పుస్తకమే "మన నవలలు". 20 తెలుగు నవలల మీద విమర్శ వ్యాసాలివి. ఈ వ్యాసాలు రాచపాళెంవారు ఐచ్ఛికంగా రాసినవి. 9 వ్యాసాలు ఆయా నవలా రచయితలు రాయించుకున్న ముందుమాటలు. ప్రతి ముందుమాటా విశ్లేషణతో కూడుకున్నది. ఈ 20 వ్యాసాలకు రాచపాళెంవారు రాసిన ముందుమాట 145 ఏళ్ళ తెలుగు నవలకు విహంగ వీక్షణం. నేటి 23 జిల్లాల తెలుగు మడిలో పంట తీసిన రాయలసీమ రతనాల నవలలు చాలా పరిమితం అంటారు రాచపాళెం. భూస్వామ్య, సామ్రాజ్యవాద మిలాఖత్ సంస్కృతికి వ్యతిరేకంగా శ్రామికవర్గ పోరాట సంస్కృతిని ప్రతిబింబించే నవలల ఉనికిపట్టుని అందించే వ్యాసాలు ఈ పుస్తకంలో వున్నాయి.

అధికార మార్పిడి వెనుక ఆగస్టు 15 విద్రోహాన్నీ, దాన్ని అధిగమించేది వ్యవసాయక విప్లవమనీ, అందుకు భూకేంద్రీకరణపై జరిగే పోరాటాల చలనాలనీ ఈ వ్యాసాలు పరిచయం చేసాయి. ప్రజలు ప్రశ్నించేతత్వం మీద నీళ్ళు జల్లే చీకటి వినోదాల వెనుక కుట్రల్ని, దాన్ని ఎదిరించేది ప్రజాదృక్పథమే అనే పురోగామి తత్వాన్ని ఈ వ్యాసాలు అందించాయి. 'దోపిడిలో భాగం కోరుతామా?' 'దోపిడీ రద్దును కోరుతూ నూరేళ్ళ మాలపల్లి నుండి అనే ప్రశ్నకు సంఘర్షణకు చోటిచ్చే చారిత్రక నవలా గమనాన్ని రాచపాళెం బలంగా పట్టి చూపించిన వ్యాసాలివి.

**"మన కథానికలు" (తెలుగు కథానికల మీద విమర్శ వ్యాసాలు) – రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

ఈ సంపుటిలో 23 వ్యాసాలున్నాయి. 'గురజాడ' నుండి 'శీలం భద్రయ్య' వరకు – ముస్లిం మహిళల కన్నీటి కథలతో సహా – ఈ 23 వ్యాసాలూ తెలుగు కథానిక ప్రపంచాన్ని అద్దంలో చూపిస్తాయి. సన్నపురెడ్డి కథలో రాయలసీమ గ్రామీణ చిత్రణను పట్టి ఇచ్చారు. మానవతావాదాన్నీ, మంచి చెడ్డల నెంచి చూసే హంసలాంటి కథానికల్ని గుర్తుచేశారు. ప్రపంచీకరణ పై అంచనా ఇచ్చారు. కథానికలో వాస్తవికతని, కదిలించే గుణాన్నీ, కష్టజీవుల బతుకు వెతల్ని – చిత్రించిన రచయితల్ని ఈ వ్యాసాల్లో పరిచయం చేశారు. తొలి తెలుగు ముస్లిం కథకుడు – మహబూబ్ మియా సాహెబ్‌ని, వి.ఆర్.రాసాని కథల నిమగ్నతనీ, పెద్దిభొట్ల అభ్యుదయాన్నీ, వల్లూరు అధిక్షేపాన్నీ గుర్తుచేశారు.

అత్యాధునిక మానవ సంబంధాలను చిత్రించిన – సదాశివరావు రచనలో వైవిధ్యాన్ని పరిచయం చేశారు రాచపాళెం. ఇలా కథానిక గమనాన్ని సుమారు అటూ ఇటూగా శతాబ్దకాలంపాటు సామాజిక చిత్రణనీ ఈ వ్యాసాలు అందించాయి.

1/8 డెమ్మీ; 181 పుటలు; వెల : రూ.160/–; ప్రథమముద్రణ : జూలై 2023;

పై రెండు పుస్తకాలు దొరుకుచోటు : ప్రచురణ : వంకిరెడ్డి ప్రచురణలు – అనంతపురం. ప్రతులకు : డి. నిర్మలమ్మ, ఫ్లాట్‌నెం : 303, చంద్రప్రియ రెసిడెన్సీ, ఆదిమూర్తినగర్, అనంతపూర్ – 515001; చరవాణి : 94400 44922.

**మోటార్ సైకిల్ – యాత్రా దర్శనం – మంచికంటి గ్రంథాలయ యాత్ర : మంచికంటి వెంకటేశ్వరరావు**

పిల్లల చదువు కోసం – పిల్లలు బాలసాహిత్యాన్ని విరివిగా చదవడం కోసం – ప్రకాశం జిల్లాలో శాంతివనం ద్వారా మంచికంటి కృషి చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో గ్రంథాలయ ఉద్యమానికి ఆకుపోత పోస్తున్నారు. ఒకనాడు జాతీయోద్యమ స్ఫూర్తితో, గ్రంథాలయోద్యమం ఒక చరిత్రను సృష్టించింది. ఆ స్ఫూర్తితో నేడు మంచికంటి మరో గ్రంథాలయోద్యమాన్ని చేపట్టారు. పుస్తకాలు చదవడం, జ్ఞానాన్ని పెంచుకోవడం చాలా అవసరం. కానీ, ఆ జ్ఞానం – సామాజిక చైతన్యంగా రూపాంతరం చెందడం కూడా అంతే అవసరం. ప్రగతిశీల భావాలు గల మంచికంటి మండుటెండల్లో ఆంధ్ర రాష్ట్రంలో మోటారు బైక్ మీద 'మరో గ్రంథాలయోద్యమం' పర్యటన అనుభవాలన్నీ ఈ పుస్తకంలో నిక్షిప్తమై వున్నాయి.

1/8 డెమ్మీ; 156 పుటలు; 'వారధి' రచయితల సహకార వేదిక ప్రచురణ; ప్రథమ ముద్రణ : 2023; వెల : రూ.150/–; ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, బడీచౌడీ, హైదరాబాద్; నవోదయ పబ్లిషర్స్, ఏలూరు రోడ్, విజయవాడ; విశాలాంధ్ర అన్ని శాఖలలో; మంచి పుస్తకం – హైదరాబాద్, ఒంగోలు.

**అనంత ఎర్ర సితార (సాంస్కృతిక స్వర్ణోత్సవ సంచిక) : దాసరి ఆదినారాయణ**

దాసరి ఆదినారాయణ ప్రజాగాయకుడు. ప్రజావిప్లవ పోరాట నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఆశయాలకు అనుగుణంగా దాసరి ఆదినారాయణ తొలి జీవిత భాగం సాగింది. అందులో భాగంగా ఓపిడిఆర్ హక్కుల సంఘంలో మమేకమయ్యారు. ఆయన జీవితం రెండోభాగం దళిత చైతన్యంతో నిండింది. కారంచేడు, చుండూరు, లక్ష్మింపేట – ఇలా సాగిన దళిత ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. దాసరి ఆదినారాయణ మలి – మూడో జీవిత భాగం – కుటుంబ బాధ్యతలతోనూ, నాల్గో జీవిత భాగం – స్వంత వూరిలో ఉద్యమ కృషి. ఈ విశేషాలతో తీసుకువచ్చిన పుస్తకమే – ఈ "అనంత 'ఎర్ర సితార' – దాసరి ఆదినారాయణ (సాంస్కృతిక స్వర్ణోత్సవ సంచిక)".

1/8 డెమ్మీ; 110 పుటలు; మహాబోధి సాహిత్య వేదిక, అనంతపురం. వెల : రూ.100/– తొలిముద్రణ : ఆగస్టు 2023. ప్రతులకు : (1). దాసరి ఆదినారాయణ – చరవాణి : 94933 61103; (2). దాసన్నగారి కృష్ణమూర్తి – చరవాణి : 93928 42792.

(ఇంకా వున్నాయి) ✷

## జైలుశిక్ష అనుభవిస్తూ 2023 నోబెల్ శాంతి బహుమతి అందుకున్న ఇరానీ మహిళ నార్గెస్ మొహమ్మది

**ఆమె** తన దేశ నియంతృత్వ, మతోన్మాద పాలకులు విధించిన 154 కొరడా దెబ్బల శిక్షను ధైర్యంగా అనుభవించింది. 51 సంవత్సరాల వయసులోనే 13 సార్లు అరెస్టు అయ్యారు. 5 సార్లు జైలు శిక్ష అనుభవించారు. 31 ఏళ్ళ జైలు జీవితం ఆమెది. ఇరాన్‌లో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పితృస్వామ్య విలువలకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాన్ని జరుపుతున్న నార్గెస్ మొహమ్మదీకి ఈ ఏడాది 2023 నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని ఇచ్చారు.

ఆమె అధ్యయనం చేసింది భౌతికశాస్త్రం. ఇంజనీరుగా పనిచేశారు. ఆ తర్వాత జర్నలిస్టుగా మారారు. విశ్వవిద్యాలయ విద్యార్థినిగా స్త్రీల హక్కులపై వ్యాసాలు రాశారు. విద్యార్థుల రాజకీయ బృందాల సమావేశాలకు హాజరైనందుకు అరెస్టు అయ్యారు.

ఆమె "డిఫెండర్స్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సెంటర్" (DHRC – మానవ హక్కుల రక్షణ కేంద్రం)కు ఉపాధ్యక్షురాలిగా చేశారు. హిజాబ్‌కు 'పవిత్రత' అనే కార్యక్రమానికి వ్యతిరేకంగా మహిళలు మూకుమ్మడిగా చేసిన ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. టెహ్రాన్‌లో మరణశిక్ష రద్దు కొరకు జరిగిన ఉద్యమంలో పాల్గొన్నందుకు 2016లో ఆమెకు 16 ఏళ్ళు జైలుశిక్ష విధించారు. 2020లో విడుదలైనా, 2021లో మరల జైలుపాలయ్యారు. ఆ కాలంలో ఆమె డిటైన్డ్ కాబడిన మహిళల ఏకాంతవాస శిక్ష, వారిపై జరుగుతున్న దురాగతాలపై ఒక నివేదిక విడుదల చేశారు.

2022 సెప్టెంబరులో మోరల్ పోలీసింగ్ చేత ఇరాన్‌లో కుర్దిష్ బాలిక మసా జినా అమిని చనిపోయింది. దీనికి వ్యతిరేకంగా, హిజాబ్‌కు వ్యతిరేకంగా, మహిళలు అసంఖ్యాకంగా రోడ్లపైకి వచ్చి, జుట్టు కత్తిరించుకొని చేసిన మహోందోళనలో 500 మంది మహిళా ప్రదర్శనకారులు మరణించారు. 20 వేలమంది జైలుపాలయ్యారు.

ఆమె ఎన్నో సంస్కరణవాద వార్తాపత్రికలలో వ్యాసాలు రాశారు. రాజకీయ వ్యాసాల గ్రంథం 'ది రిఫార్మ్, ది స్ట్రాటజీ అండ్ ది టాక్టిక్' ప్రచురించారు. సహజంగానే, ఇరాన్‌కు చెందిన విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖవారు నార్గెస్ మొహమ్మదికి నోబెల్ శాంతి బహుమానాన్ని ప్రకటించడాన్ని ఖండించారు!

ప్రపంచశాంతికి విఘాతం కలిగించే మొట్టమొదటి అంతర్జాతీయ శక్తి సామ్రాజ్యవాదానిది. దాని అధినాయకుడు అమెరికా! నోబెల్ శాంతి బహుమతి అర్హతకు సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించకపోవటం, ఖండించకుండటం అన్నది నోబెల్ బహుమతి పొందటానికొక అర్హత!! అదే ఇందులోని అభాస!!!

## స్త్రీవాద సాహిత్యంలో అవిరామకృషి చేసిన అంబై

**ఆమె** తమిళ సాహిత్యంలో స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, స్త్రీవాద దృక్పథంతో గొంతువిప్పిన తొలి రచయిత్రి. ఆమె పేరు సి.ఎస్.లక్ష్మి అంటే చిత్తూరు సుబ్రహ్మణ్య లక్ష్మి. శుక్రవారం పుట్టిన ఆడపిల్లలందరికి లక్ష్మి అని పేరు పెట్టే సంప్రదాయం ప్రకారం లక్ష్మి అని ఆమెకు పేరు పెట్టారు. అయితే తమిళ సీనియర్ రచయిత దేవన్ రాసిన 'పార్వతి సంకల్పం' అనే నవలలోని ఒకానొక పాత్ర పేరును తన పేరుగా మార్చుకుని 'అంబై' పేరుతో రచనా వ్యాసంగం చేస్తుంటుంది. ఆ పాత్ర పేరును సి.ఎస్.లక్ష్మి తన కలంపేరుగా పెట్టుకుంది.

అంబైకు ఇటీవల '2023 టాటా లిటరేచర్ లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డు' లభించింది. గతంలో ఈ అవార్డు వి.ఎస్.నైపాల్, మహాశ్వేతాదేవి, రస్కిన్ బాండ్, గిరీష్ కర్నాడ్ తదితరులు అందుకున్నారు.

ఆమె కోయంబత్తూర్‌లో 1944లో జన్మించారు. బొంబాయి, బెంగళూరులలో పెరిగారు. బెంగళూరు విశ్వవిద్యాలయం నుండి బి.ఏ., మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో ఎం.ఏ., పూర్తిచేశారు. జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు)లో పిహెచ్‌డి పట్టా పొందారు. ఆ తరువాత ఉపాధ్యాయురాలిగా, అధ్యాపకురాలుగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఆ కాలంలోనే కథలు రాశారు.

ఆమె సాహిత్య కృషి, 16 ఏళ్ళ వయసులో పిల్లల కోసం రాసిన 'నందిమల కొండల్లో' అనే డిటెక్టివ్ నవలతో ప్రారంభమైంది. 1967లో 'రెక్కలు విరిగిపోతాయి' అనే కథతో అసలుసిసలు స్త్రీవాద బాటపట్టారు. అలా ఆమె తమిళంలో స్త్రీవాద దృక్పథంతో గొంతు విప్పిన తొలి రచయిత్రిగా గుర్తింపు పొందారు. 'ట్విలైట్' (సంధ్యాకాలం) అనే కథాసంపుటిని 1966లో ప్రచురించారు.

ఆమె ముప్పైఏళ్ళపాటు స్త్రీల సమస్యలపై అధ్యయనాన్ని కొనసాగించి ఎన్నో రచనలు చేశారు. 1988లో 'స్పారో' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి దానిలో మహిళలపై చేసిన అధ్యయనాలు, మౌఖిక కథనాలు, దృశ్యాలు నిక్షిప్తం చేశారు. 1994లో చెన్నైలో రోజా ముత్తయ్య రిసెర్చి లైబ్రరీ ఏర్పాటుచేశారు. మూడు లక్షల గ్రంధాలున్న, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేటు గ్రంథాలయం ఇది. జీత్ తాయిల్ అనే కవయిత్రి తన భర్త శక్తి భట్, ప్రచురణకర్త పేరుతో స్థాపించిన రివార్డు కూడా అంబై పొందారు.


## ఫ్రీగా బైక్ మెకానిక్ ట్రైనింగ్..

**గ్రామీణ** ప్రాంతాల్లో నివసిస్తున్న యువకులకు స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం (SBRSETI) గుడ్ న్యూస్ చెప్పింది. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా టూ వీలర్ మెకానిక్‌లో నెలరోజుల పాటు ఉచిత శిక్షణకు (free coaching) ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో నివసించే వారు ఈ శిక్షణకు అర్హులు కారని ఆయన వెల్లడించారు.

**అర్హతలు :** తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి 18–45 ఏళ్ల వయస్సు కలిగిన యువకులు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, తెల్ల రేషన్‌కార్డ్, ఆధార్ కార్డు, 4 పాస్ ఫోటోలతో సంప్రదించాలని సూచించారు.


# దేశ విభజనపై స్పందించిన కళాకారుల చిత్రాలు






















PRAJA SAAHITI Novemober 2023 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 44 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI